# ప్రజాభూమి

ఇది ప్రజల వెలుగు

Prajabhoomi Telugu Daily

www.prajabhoomi.com






సంపుటి : 02 | సంచిక : 192 | శుక్రవారం | మే 15, 2026 | ఎడిటర్ : రామమోహన్ రెడ్డి అంకిరెడ్డిపల్లి | పేజీలు : 12 | వెల : 3 రూ

Vol.No : 02 | Issue No : 192 | Friday | 15 MAY 2026 | Editor : Ankireddypalle Ramamohan Reddy | Pages 12 | Rs 3/-

Published From : Vijayawada, Anathapuramu, Eluru, Kadapa, Kakiknada, Tirupathi Circulated at Andharapradesh & Telangana




## రాయలసీమ.. ఇక రాళ్ల సీమ కాదు..

# రక్షణ సీమ

### సీమకు భారీగా డిఫెన్స్ ప్రాజెక్టులు

- రూ.15,803 వేల కోట్లతో AMCA ప్రాజెక్టుకు పుట్టపర్తిలో శంకుస్థాపన
- డిఫెన్స్ డ్రోన్ రంగాల్లో మరో 12 ప్రాజెక్టులకూ భూమి పూజ
- నేడు రక్షణ మంత్రితో భూమి పూజ చేయనున్న సీఎం చంద్రబాబు





**ప్రజాభూమి ప్రతినిధి,అమరావతి :** రాయల సీమ రతనాల సీమ... ఇది చరిత్ర. ఉద్యాన సీమ... ఇది వర్తమానం. రక్షణ సీమ... ఇది భవిష్యత్. ఇరిగేషన్, హార్టీకల్చర్, స్పేస్, డ్రోన్, సోలార్, విండ్ ఎనర్జీ వంటి రంగాల్లో దూసుకెళ్తున్న రాయలసీమ డెవలప్మెంట్ జర్నీలో మరో కీలక రంగం జత కానుంది. ఇకపై రాయలసీమ దేశ రక్షణ రంగంలోనూ తన ముద్రను వేయబోతోంది. ప్రత్యేకతను చాటుకోనుంది. శుక్రవారం శ్రీ సత్యసాయి జిల్లాలో దేశం గర్వించే అత్యంత ప్రతిష్టాత్మకమైన అడ్వాన్స్డ్ మీడియం కాంబాట్ ఎయిర్‌క్రాఫ్ట్ (AMCA) డిఫెన్స్ ప్రాజెక్టును ఏరో నాటికల్ డెవలప్మెంట్ ఏజెన్సీ-డీఆర్డీఏ సంస్థలు సంయుక్తంగా ఏర్పాటు చేయనున్నారు.

- మిగతా 2లో..



## పాకిస్తాన్‌లో ఉగ్రవాదులపై ఆపరేషన్‌లో ఐదుగురు

# సైనికులు మృతి

ఇస్లామాబాద్ : పాకిస్తాన్ లో ఉగ్రవాదులపై జరిపిన ఆపరేషన్ లో ఐదుగురు సైనికులు మరణించారు. బలూచిస్తాన్ లోని బర్ఖాన్ జిల్లాలో మార్ఘమ్ లోని నోషమ్ ప్రాంతంలో పాకిస్తాన్ సైన్యం, బలూచిస్తాన్ ఫ్రాంటియర్ కార్ప్స్ సంయుక్తంగా ఈ ఆపరేషన్ నిర్వహించినట్లు ఇంటర్ సర్వీసెస్ పబ్లిక్ రిలేషన్స్ (ఐఎస్ పి ఆర్) బుధవారం ఆలస్యంగా విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపింది.

వివరాలు 2లో



## సీఎం చంద్రబాబు వాహన

# శ్రేణి కుదింపు

- ప్రధాని మోదీ పిలుపుతో కాన్వాయ్ తగ్గించుకున్న ముఖ్యమంత్రి

ప్రజాభూమి ప్రతినిధి,అమరావతి: ప్రధాని నరేంద్ర మోదీ ఇచ్చిన పిలుపు మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తన వాహన శ్రేణిని కుదించుకున్నారు. మొత్తం 12 వాహనాల కాన్వాయ్‌ను 4 వాహనాలకు తగ్గించుకున్నారు. ఇవాల్టి నుంచే ఈ వాహన శ్రేణి కుదింపును అమల్లోకి తీసుకురావాలని సీఎం సూచనలు జారీ చేశారు. ఈ మేరకు ఉండవల్లిలోని క్యాంపు కార్యాలయం నుంచి సచివాలయంలో జరిగే కేబినెట్ సమావేశానికి కేవలం నాలుగు వాహనాల కాన్వాయ్‌తోనే సీఎం చేరుకున్నారు.

- మిగతా 2లో..




## ఎస్ఐఆర్ మూడవ దశ షెడ్యూల్

# విడుదల..

### ఏపి, తెలంగాణ సహా 16 రాష్ట్రాల్లో

న్యూఢిల్లీ : ఓటర్ల జాబితా సమగ్ర సవరణ (ఎస్ ఐ ఆర్) మూడవ దశ షెడ్యూల్ ను భారత ఎన్నికల సంఘం (ఇసిఐ)గురువారం విడుదల చేసింది. ఏపి, తెలంగాణతో పాటు 16 రాష్ట్రాలు , 3 కేంద్రపాలిత ప్రాంతాల్లో ఈ ప్రకియ నిర్వహించనున్నట్లు తెలిపింది. కర్ణాటక, మహారాష్ట్ర, అరుణాచల్ ప్రదేశ్, హర్యానా, సిక్కిం, జార్ఖండ్, మణిపూర్, మేఘాలయ, మిజోరం, నాగాలాండ్, ఒడిశా, పంజాబ్, ఉత్తరాఖండ్, త్రిపుర లలో ఎస్ ఐ ఆర్ చేపట్టనున్నట్లు ప్రకటించింది.

- మిగతా 2లో..

## నీట్ పరీక్ష రద్దుపై

# రేవంత్ రెడ్డి స్పందన

### పేపర్ లీక్‌తో నీట్ పరీక్ష రద్దు

- పారదర్శకమైన విచారణ జరపాలన్న రేవంత్ రెడ్డి
- పోటీ పరీక్షలు విద్యార్థుల జీవితాలను నాశనం చేయకూడదని వ్యాఖ్య

ప్రజాభూమి ప్రతినిధి, అమరావతి : నీట్ యూజీ 2026 పరీక్ష రద్దు, పేపర్ లీక్ అంశంపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్రంగా స్పందించారు. దేశవ్యాప్తంగా సుమారు 22.79 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తుతో ముడిపడి ఉన్న ఈ అంశంపై కేంద్రం పారదర్శకమైన విచారణ జరపాలని ఆయన డిమాండ్ చేశారు.

- మిగతా 2లో..



## క్రూయిజ్ షిప్‌లో

# నోరోవైరస్ కలకలం..

- ఫ్రాన్స్‌లో నిలిపివేత

బోర్డెక్స్: విహార షిప్‌లో వరుసగా వైరస్‌లు వ్యాపిస్తున్న ఘటనలు పర్యాటకులను తీవ్ర ఆందోళనకు గురిచేస్తున్నాయి. తాజాగా 'యాంబిషన్' అనే క్రూయిజ్ షిప్‌లో నోరోవైరస్ వ్యాప్తి చెందడంతో ఫ్రాన్స్‌లో కలకలం రేగింది. సుమారు 1700 మంది ప్రయాణికులు, సిబ్బందితో బెల్‌ఫాస్ట్ నుంచి స్పెయిన్‌కు వెళ్తున్న ఈ నౌకను, వైరస్ భయంతో ఫ్రాన్స్‌లోని బోర్డెక్స్ పోర్టులో అధికారులు నిలిపివేశారు.




2 పేజీలో..



## అల్పపీడనంతో కోస్తాంధ్ర, రాయలసమిాల్లో

# వర్షాలు

### 16 నాటికి అండమాన్‌లోకి నైరుతి ప్రవేశం

ప్రజాభూమి ప్రతినిధి, విశాఖపట్నం : నైరుతి బంగాళాఖాతం- పశ్చిమ మధ్య బంగాళాఖాతం సమీపంలో అల్పపీడనం కొనసాగుతోందని విశాఖ వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. ఇదే ప్రాంతంలో సముద్ర మట్టానికి 5.9 కి.మీ ఎత్తులో ఉపరితల ఆవర్తనం కొనసాగుతోందని పేర్కొన్నారు. దీని ప్రభావంతో రాగల 48 గంటల్లో కోస్తాంధ్ర, రాయలసీమ, యానాంలో ఉరుములు, మెరుపులతో కూడిన జల్లులు, గంటకు 30 నుంచి 40 కి.మీ వేగంతో ఈదురు గాలులు వీచే అవకాశముందని తెలిపారు.

2లో..

## వర్క్ ఫ్రమ్ హోమ్‌పై

# ఏపీ సర్కార్ కసరత్తు..

### కొంతమంది ప్రభుత్వ ఉద్యోగులకు ఇంటి నుంచి పని చేసే అవకాశం!

- పశ్చిమాసియా యుద్ధంపై ప్రధాని మోదీ హెచ్చరిక
- పొదుపు, వర్క్ ఫ్రమ్ హోమ్‌కు ప్రాధాన్యం ఇవ్వాలని సూచన
- ఏపీ ప్రభుత్వ ఉద్యోగులకు వర్క్ ఫ్రమ్ హోమ్ పరిశీలిస్తున్నామన్న చంద్రబాబు
- ఇంధన పొదుపులో భాగంగా హైబ్రిడ్ విధానంపైనా ఏపీ సర్కార్ యోచన
- త్వరలో మార్గదర్శకాల రూపకల్పన.. కేబినెట్‌లో చర్చకు అవకాశం




**ప్రజాభూమి ప్రతినిధి,అమరావతి :** పశ్చిమాసియాలో ఉద్రిక్తతల నేపథ్యంలో ప్రధాని నరేంద్ర మోదీ ఇచ్చిన పొదుపు పిలుపునకు ఏపీ ప్రభుత్వం స్పందించింది. ఇంధన సంక్షోభాన్ని నివారించే ముందస్తు చర్యల్లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు వర్క్ ఫ్రమ్ హోమ్ విధానాన్ని అమలు చేసే అంశంపై ఏపీ సర్కార్ తీవ్రంగా యోచిస్తోంది. కరోనా మహమ్మారి సమయంలో ప్రాచుర్యం పొందిన ఈ విధానం, మళ్లీ ఇప్పుడు యుద్ధ పరిస్థితుల కారణంగా తెరపైకి వచ్చింది. ఇటీవల ప్రధాని మోదీ దేశ ప్రజలనుద్దేశించి మాట్లాడుతూ.. పశ్చిమాసియాలో ఉద్రిక్తతల ప్రభావం భారత్‌పైనా ఉంటుందని, ప్రజలందరూ పొదుపు పాటించాలని సూచించారు. ముఖ్యంగా ఇంధనం వాడకాన్ని తగ్గించడం, అనవసర ప్రయాణాలు మానుకోవడం వంటి జాగ్రత్తలు తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ క్రమంలోనే ఆయన వర్క్ ఫ్రమ్ హోమ్ విధానాన్ని ఒక పరిష్కారంగా ప్రస్తావించారు.

2 పేజీలో..










# రాయలసీమ..ఇక రాళ్ల సీమ కాదు..రక్షణ సీమ

## సంపాదకీయం

### కాన్వాయ్‌ల కార్లు తగ్గితే పొదుపు కాదు !

అధికార పార్టీ నేతల విన్యాసాలు మొదలయ్యాయి. చమురు సంక్షోభం దృష్ట్యా ఖర్చులు తగ్గించుకోవాలని, వర్క్ ఫ్రమ్ హోమ్ పెరగాలని, బంగారం కొనొద్దని ఇలా..ప్రధాని పలు సూచనలు చేశారు. వాటిని బిజెపి పాలిత రాష్ట్రాల సిఎంలు, ఎన్‌డిఎ పాలిత సిఎంలు స్వాగతించారు. ఇందులో కాన్వాయ్‌లో కార్ల సంఖ్యను మాత్రమే తగ్గించారు. ప్రధాని కూడా కాన్వాయ్ తగ్గించారు. నిజానికి రాజకీయంగా దుబరా ఖర్చుల గురించి ఆలోచించడం లేదు. ఓ వైపు విమాన ఇంధన ధరలు పెంచడంతో విమానాలను రద్దు చేస్తున్నారు. ఇది సామాన్యులపై పెనుభారం మోపుతోంది. విదేశీయానం అంటే ప్రజలు ఎంజాయ్ చేయడానికి వెళ్లడం లేదు. తమ పిల్లల దగ్గరకు వెళ్లాలన్న తల్లిదండ్రులకు విమానం టిక్కెట్ ధరలు తడిసి మోపెడు అవుతున్నాయి. వీటిని ఆదా చేసేందుకు ప్రభుత్వాలు ఆలోచించడం లేదు. కాన్వాయ్‌ల తగ్గింపుతో ఆర్థిక వ్యవస్థ బలోపేతం కాదు. ఆర్థిక వ్యవస్థకు గుదిబండగా ఉన్న వందలాది పతకాలు, రాజకీయ పార్టీల ఖర్చులు వంటివి తగ్గాలి. శాసనమండళ్లతో పెద్దగా పనిలేదు. జడ్పీటిసి, ఎంపిటిసిలతో పెద్దగా పనిలేదు. వీటిని తగ్గించాలి. ప్రజాప్రతినిధులు రెండేసి పెన్షన్లు తీసుకుంటున్నారు. ఈ పెన్షన్లను పూర్తిగా రద్దు చేయాలి. ఈ ఖర్చు ఎంతో లెక్క కట్టాలి. దేశ ఆర్థిక వ్యవస్థ ప్రమాద ఘంటికలు మోగిస్తోన్న వేళ ఎక్కడ ఖర్చులు తగ్గించాలో మోడీ చెబితే బాగుంటుంది. ఆచరిస్తే మరీ మంచిది. ప్రజాస్వామ్యం పేరుతో ప్రజాప్రతినిధులు ప్రజల డబ్బుతో విలాసాలు చేస్తున్నారు. దీనిపై ప్రధాని మోడీ దృష్టి సారించాలి.

పశ్చిమాసియాలో చోటుచేసుకుంటున్న పరిణామాలు మన దేశ ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ఆర్థిక సంక్షోభం దిశగా పయనిస్తున్న తీరును చూస్తున్నాం. వరుసగా స్టాక్ మార్కెట్లు కుప్పకూలడం, విదేశీ పెట్టుబడుల ఉపసంహరణ, రూపాయి విలువ పతనం కొనసాగడం, ద్రవ్యోల్బణం అడ్డు అదుపులేకుండా పెరగడం, అంతర్జాతీయంగా ముడి చమురు ధరల పెరుగుదల, ఇవన్నీ కలిపి దేశ ఆర్థిక స్థితిపై తీవ్ర ప్రభావాన్ని చూపుతున్నాయి. ఈ క్రమంలో దేశ ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి పొదుపు చర్యలు తీసుకోవాల్సిందే. కఠిన చర్యలకు ఉపక్రమించాలి. కేవలం కాన్వాయ్‌ల కార్లు రద్దుతో చేతులు దులుపుకుంటే సరిపోదు. ప్రధాన మంత్రి నరేంద్రమోడీ చేసిన పొదుపు సూచనలు పరిస్థితి తీవ్రతను మరింత స్పష్టం చేశాయి. స్టాక్‌మార్కెట్లు కుప్పకూలి, లక్షల కోట్ల రూపాయల సంపద ఆవిరి కావడం, విదేశీ పెట్టుబడు దారులు పెద్ద ఎత్తున నిధులు వెనక్కి తీసుకోవడం వంటి పరిణామాలన్నీ ఆర్థికసంక్షోభ తీవ్రతకు అద్దం పడుతున్నాయి.అదే సమయంలో ద్రవ్యోల్బణం పెరుగుతున్న తీరు మరింత ఆందోళనకరం. ఏప్రిల్‌లో రిటైల్ ద్రవ్యోల్బణం 3.48 శాతానికి చేరి 13 నెలల గరిష్ఠాన్ని నమోదు చేసింది. ఆహార ద్రవ్యోల్బణం 4.2 శాతానికి పెరగడం సామాన్య కుటుంబాల పై తీవ్రమైన భారం మోపుతోంది. పప్పుధాన్యాలు, కూరగాయలు, వంటనూనెలు, పాల ఉత్పత్తుల ధరలు వరుసగా పెరుగుతుండగా, ప్రజల ఆదాయం మాత్రం పెరగడం లేదు. దేశ వ్యాప్తంగా నిరుద్యోగం పెరుగు తుండటం, అసంఘటిత రంగంలో ఉపాధి క్షీణించడం, గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి హామీ పనుల నిధులను తెగ్గోయడం వంటి చర్యలు ఇప్పటికే ప్రజల కొనుగోలు శక్తిని దారుణంగా దెబ్బతీశాయి. దీనికితోడు ఇప్పుడు పెట్రోల్, డీజిల్ ధరలు పెంచక తప్పదని సూచనలు చేస్తున్నారు. ఆర్‌బిఐ గవర్నర్ మల్హోత్రా కూడా ఇదే విషయం చెప్పారు. ధరాఘాతం నుండి ప్రజలకు ఊరటనిచ్చే చర్యలు తీసుకోవడానికి బదులుగా కేంద్ర ప్రభుత్వం మరింతగా భారాలు మోపేందుకు కసరత్తు చేయడం దారుణం! అంతర్జాతీయ ముడి చమురు ధరలు పెరుగుతుండటాన్ని సాకుగా చూపుతూ పెట్రో ఉత్పత్తుల ధరలు పెంచడానికి ఇప్పటికే సిద్ధమైంది. 'పెట్రో ధరలు పెరగవని నేను చెప్పలేను అంటూ సాక్షాత్తు కేంద్ర పెట్రోలియం శాఖ మంత్రి హర్‌దీప్ సింగ్ పూరీ ప్రకటించారు. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు ఇదే మాదిరి కొనసాగితే పెట్రోల్, డీజిల్ ధరల పెంపు తప్పకపోవచ్చంటూ రిజర్వు బ్యాంకు గవర్నర్ సంజయ్ మల్హోత్రా చేసిన వ్యాఖ్యలతో దేశంలో పెట్రో మోత తప్పదని తేలిపోయింది. అయితే, ఏ స్థాయిలో ధరలు పెరుగుతాయి, ఎప్పటి నుండి పెరుగుతాయి అన్న అంశంపైనే స్పష్టత రావాల్సిఉంది. నాలుగేళ్లుగా పెట్రో ధరలు పెరగలేదంటూ తాజాగా చేయబోయే పెంపునకు సమర్థనగా కేంద్రం చేస్తున్న వాదనలు ఏ మాత్రం సమర్థనీయం కాదు. పెట్రో ధరలు పెరగ్గానే అమాంతంగా అన్ని వస్తువుల ధరలు పెరుగుతాయి. నిత్యావసరాలు ఆకాశాన్ని అంటుతాయి. కాబట్టి ప్రత్యామ్నాయ మార్గాలు ఆలోచించాలి. పొదుపు అన్నది ప్రజాప్రతినిధుల దుబారాలను తగ్గించడంతో మొదలు కావాలి. చమురు ధరలు పెరిగితే రవాణా వ్యయం పెరిగి, దాని ప్రభావం అన్ని వస్తువులపై పడటం ఖాయం. బంగారం కొనుగోళ్లను ఏడాదిపాటు నిలిపి వేయాలని ప్రధాని సూచించగా, కేంద్ర ప్రభుత్వం తాజాగా బంగారం, వెండిపై దిగుమతి సుంకాలను 6 నుండి 15 శాతానికి పెంచడం కూడా ప్రజలపై భారాలు మోపడం తప్ప మరోటి కాదు. ప్రజలు త్యాగాలు చేస్తే ప్రజాప్రతినిధులు ఎంజాయ్ చేయడం ఎంతవరకు సమంజసం. లక్షల్లో జీతు, భత్యాలు, ఉచిత బంగళాలు, కరెంట్ ఫ్రీ, ఫోన్లు ఫ్రీ ఎందుకో చెప్పాలి. ఇవన్నీ ప్రజలను ఉద్ధరించే చర్యలు ఎంతమాత్రం కావు. దీనికితోడు చిన్న మధ్య తరహా పరిశ్రమలు ఒత్తిడిలో ఉండటం, రైతాంగ ఆదాయం స్థిరంగా లేకపోవడం వంటి అంశాలు దేశ ఆర్థిక వృద్ధిని తీవ్రంగా దెబ్బతీస్తున్నాయి. ధరల నియంత్రణ చర్యలు, ఉపాధి హామీ, వ్యవసాయ, చిన్న పరిశ్రమల రక్షణపై దృష్టి పెట్టాలి. పొదుపును సీరియస్‌గా తీసుకుని ప్రజాప్రతినిధుల జీతాలు, పెన్షన్లు రద్దు చేయాలి. వారి విదేశీ ప్రయాణాలను, విమానాలను వేసుకుని ఊరేగడాన్ని, హెలకాప్టర్లు వేసుకుని ఊరూరా తిరగడాన్ని అడ్డుకోవాలి. ఇవి మాత్రమే దేశానికి మేలు చేస్తాయి. ఈ దిశగా విప్లవాత్మక చర్యలకు దిగాలి.

మొదటి పేజీ తరువాయి

పుట్టపర్తిలో జరగనున్న ఈ కార్యక్రమంలో కేంద్ర రక్షణ మంత్రి రాజ్ నాథ్ సింగ్ తో కలిసి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు భూమి పూజ నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి నారా లోకేష్ పాల్గొననున్నారు. ఈ ప్రాజెక్టును సుమారు రూ.15,803 కోట్ల భారీ వ్యయంతో, 650 ఎకరాల్లో ఈ రూపుదిద్దుకోనుంది. ఇది భారతదేశపు మొట్టమొదటి 5వ +వఅవతీఖఅశీఅ స్టెల్త్ మల్టీ-రోల్ ఫైటర్ ఎయిర్‌క్రాఫ్ట్ ప్రాజెక్ట్. ఇందులో స్టెల్త్ టెక్నాలజీ, ట్విన్ ఇంజిన్ సూపర్ క్రూయిజ్ సామర్థ్యం, అత్యాధునిక ఏవియానిక్స్ వంటి హంగులతో యుద్ధ విమానాలను అభివృద్ధి చేయనున్నారు. యుద్ధ విమానాలను పుట్టపర్తిలోనే అభివృద్ధి చేయడంతోపాటు... టెస్టింగ్ కూడా చేపట్టేలా ప్రాజెక్టును రూపొందించనున్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా సుమారు 7,500 మందికి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని అంచనా. అలాగే, ఈ ప్రధాన ప్రాజెక్టుకు అనుబంధంగా వచ్చే ఇతర యూనిట్ల ద్వారా మరో రూ.1 లక్ష కోట్ల పెట్టుబడులు వచ్చే అవకాశం ఉంది. దీని కోసం ప్రభుత్వం ప్రత్యేకంగా 400 ఎకరాలు కేటాయించింది. వీటితో పాటు కర్నూలు జిల్లాలో నిర్మిస్తున్న 'డ్రోన్ సిటీ' ద్వారా భారతదేశంలోనే అత్యుత్తమ డ్రోన్ ఎకోసిస్టమ్‌ను ప్రభుత్వం సిద్ధం చేస్తోంది. ఆ మేరకు పెట్టుబడులు భారీ ఎత్తున రానున్నాయి. మొత్తంగా రాయలసీమ, ప్రకాశం జిల్లాల పరిధిలో డిఫెన్స్, డ్రోన్ రంగాల్లో పెద్ద ఎత్తున పెట్టుడులు వచ్చేందుకు ప్రభుత్వం గ్రౌండ్ ప్రిపేర్ చేస్తోంది. దీంట్లో భాగంగా డ్రోన్ ప్రాజెక్టుల ఏర్పాటుకు రంగం సిద్ధమవుతోంది. ూవీజూ ప్రాజెక్టుతో పాటే డిఫెన్స్ రంగానికి చెందిన 4 ప్రాజెక్టులు, 8 డ్రోన్ ప్రాజెక్టులకు శంకుస్థాపన జరగనుంది. ఈ 12 ప్రాజెక్టుల ద్వారా రూ. 4145 కోట్ల పెట్టుబడులు, 6071 మందికి ఉద్యోగ అవకాశాలు రానున్నాయి. వీటిల్లో మడకశిరలో రెండు ప్రాజెక్టులు, దొనకొండ, నెల్లూరుల్లో ఒక్కో ప్రాజెక్టు ఏర్పాటు కానుంది. మిగిలిన 8 డ్రోన్ ప్రాజెక్టులు కర్నూలు జిల్లా డ్రోన్ సిటీలో నిర్మాణాలు చేపట్టనున్నాయి.

### మరో 12 ప్రాజెక్టులకు శంకుస్థాపన...

- కళ్యాణి స్ట్రాటజిక్ సిస్టమ్స్ లిమిటెడ్ - రూ. 1430 కోట్ల పెట్టుబడి - 565 మందికి ఉపాధి
- భారత్ డైనమిక్స్ మిటెడ్ - రూ. 489 కోట్ల పెట్టుబడి - 500 మందికి ఉపాధి
- HFCL - రూ. 1040 కోట్ల పెట్టుబడి - 870 మందికి ఉపాధి
- ప్రీమియర్ ఎక్స్ ప్లోజివ్స్ - రూ. 500 కోట్ల పెట్టుబడి - 2050 మందికి ఉపాధి
- అల్గోబాటిక్స్ ప్రైవేట్ లిమిటెడ్ -రూ. 34 కోట్ల పెట్టుబడి - 52 మందికి ఉపాధి
- డ్రోగో డ్రోన్స్ ప్రైవేట్ లిమిటెడ్ - రూ. 255 కోట్ల పెట్టుబడి - 850 మందికి ఉపాధి
- డ్రోన్ ల్యాబ్ టెక్నాలజీస్ - రూ. 5 కోట్ల పెట్టుబడి - 14 మందికి ఉపాధి
- హెచ్ సి రోబోటిక్స్ - రూ. 100 కోట్ల పెట్టుబడి - 500 మందికి ఉపాధి
- సెన్స్ ఇమేజ్ టెక్నాలజీస్ - రూ. 68 కోట్ల పెట్టుబడి - 45 మందికి ఉపాధి
- ఎయిర్ పేస్ ఇండస్ట్రీస్ - రూ. 100 కోట్ల పెట్టుబడి - 150 మందికి ఉపాధి
- జేడీకే ఫ్లై డ్రోన్ వరల్డ్ - రూ. 114 కోట్ల పెట్టుబడి - 350 మందికి ఉపాధి
- లాట్రిక్ ఎయిరో స్పేస్ - రూ. 10 కోట్ల పెట్టుబడి - 125 మందికి ఉపాధి



**ముఖ్యమంత్రి పర్యటన షెడ్యూల్...** **ముఖ్యమంత్రి పర్యటన ఉదయం 08:15 గంటలకు క్యాంప్ కార్యాలయం నుంచి బయలుదేరి 09:45 గంటలకు పుట్టపర్తి విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడ నుంచి రోడ్డు మార్గం ద్వారా ఉదయం 10:15 గంటలకు పుట్టపర్తి ఎయిర్‌పోర్ట్ వెనుక ఏర్పాటు చేసిన ఉన్న శంకుస్థాపన కార్యక్రమ వేదికకు చేరుకుంటారు. ఉదయం 10:15 నుంచి మధ్యాహ్నం 12:30 వరకు ఏరోనాటికల్ డెవలప్‌మెంట్ అథారిటీ (ూాఉూ) ఆధ్వర్యంలోని ఎయిర్‌క్రాఫ్ట్ ఇంటిగ్రేషన్ - ఫ్లైట్ టెస్ట్ సెంటర్ శంకుస్థాపనతో పాటు, ఇతర రక్షణ, డ్రోన్ రంగ పరిశ్రమల భూమి పూజ కార్యక్రమాల్లో రక్షణ మంత్రి రాజ్ నాథ్ సింగ్ తో కలిసి పాల్గొంటారు. అనంతరం మధ్యాహ్నం 02:20 గంటలకు తిరిగి అమరావతిలోని తన నివాసానికి చేరుకుంటారు.**

## వర్క్ ఫ్రమ్ హోమ్‌పై ఏపీ సర్కార్ కసరత్తు..

ప్రధాని సూచనల తర్వాత సీఎం చంద్రబాబు నాయుడు కూడా ఈ విషయంపై స్పందించారు. ఏపీలో ప్రభుత్వ రంగంలోనూ వర్క్ ఫ్రమ్ హోమ్ విధానాన్ని అమలు చేసేందుకు సిద్ధంగా ఉన్నామని ఆయన ప్రకటించారు. భవిష్యత్తులో ప్రపంచమంతా ఇంటి నుంచే పనిచేసే రోజులు రాబోతున్నాయని, దానికి అనుగుణంగా మన ఆలోచనా విధానంలో మార్పు రావాలని ఆయన పేర్కొన్నారు. ఇంధన పొదుపు కోసం అనవసర ప్రయాణాలు తగ్గించి, టెలి, వీడియో కాన్ఫరెన్స్‌లకు ప్రాధాన్యం ఇవ్వాలని అధికారులకు సూచించారు.




చంద్రబాబు వ్యాఖ్యల నేపథ్యంలో ప్రభుత్వ ఉద్యోగులకు వర్క్ ఫ్రమ్ హోమ్ అమలుకు సంబంధించిన ప్రతిపాదనలపై ఉన్నతాధికారులు కసరత్తు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇంటి నుంచి పనిచేసేందుకు వీలున్న విభాగాలు, కార్యాలయాలకు తప్పనిసరిగా హాజరుకావాల్సిన ఉద్యోగులను గుర్తించే ప్రక్రియ చేపట్టనున్నారు. కొందరికి పూర్తిగా వర్క్ ఫ్రమ్ హోమ్, మరికొందరికి హైబ్రిడ్ విధానంలో (కొన్ని రోజులు ఇల్లు, కొన్ని రోజులు ఆఫీస్) పనిచేసే అవకాశాన్ని కల్పించే అంశాలను పరిశీలిస్తున్నారు. ఈ ప్రతిపాదనలపై కేబినెట్ సమావేశంలో చర్చించి, స్పష్టమైన మార్గదర్శకాలతో తుది నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని ప్రభుత్వ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

## క్రూయిజ్ షిప్‌లో నోరోవైరస్ కలకలం..




**అస్వస్థతకు గురైన 50 మంది ప్రయాణికులు :** నౌకలోని సుమారు 50 మంది ప్రయాణికులు వాంతులు, విరేచనాల వంటి లక్షణాలతో అస్వస్థతకు గురయ్యారు. దీంతో అప్రమత్తమైన ఫ్రెంచ్ ఆరోగ్య అధికారులు నౌకను తాత్కాలికంగా క్వారంటైన్ చేశారు. వైద్య బృందాలు సేకరించిన నమూనాలను పరీక్షించగా, ఇది నోరోవైరస్ అని నిర్ధారణ అయింది. వైరస్ సోకిన వారి నౌకలోనే ఐసొలేషన్‌లో ఉంచి చికిత్స అందిస్తున్నారు. అయితే, ఎలాంటి లక్షణాలు లేని మిగిలిన ప్రయాణికులను నౌక నుంచి దిగేందుకు అధికారులు అనుమతించారు.

**వృద్ధుడి మరణంపై స్పష్టత :** మే 10న నౌకలో 92 ఏళ్ల వృద్ధుడు మరణించినట్లు నౌక యాజమాన్య సంస్థ 'అంబాసిడర్ క్రూయిజ్ లైన్' ధృవీకరించింది. అయితే, అతడి మరణానికి ఈ వైరస్ వ్యాప్తికి ఎలాంటి సంబంధం లేదని సంస్థ స్పష్టం చేసింది. మృతుడికి వైరస్ లక్షణాలు లేవని ప్రాథమిక దర్యాప్తులో తేలింది.

**హంటా వైరస్‌తో సంబంధం లేదు :** ఇటీవల మరో నౌకలో వ్యాపించిన హంటా వైరస్‌కు, ప్రస్తుత నోరోవైరస్ ఘటనకు ఎటువంటి సంబంధం లేదని అధికారులు స్పష్టం చేశారు. ప్రస్తుతం నౌకలో మెరుగైన పారిశుద్ధ్య చర్యలు చేపట్టినట్లు, బాధితులకు ఉచిత వైద్య సేవలు అందిస్తున్నట్లు క్రూయిజ్ సంస్థ వెల్లడించింది. వరుస ఘటనల నేపథ్యంలో క్రూయిజ్ ప్రయాణాల్లో పారిశుద్ధ్యంపై పర్యాటకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## అల్పపీడనంతో కోస్తాంధ్ర, రాయలసమీాల్లో వర్షాలు



నైరుతి రుతుపవనాలు చురుగ్గా కదులుతున్నాయని, ఈనెల 16 నాటికి దక్షిణ బంగాళాఖాతం, అండమాన్ నికోబార్ దీవులను తాకే అవకాశముందన్నారు. నైరుతి రుతుపవనాలు ఈ నెల 16నాటికి దక్షిణ బంగాళాఖాతం, అండమాన్ సముద్రం, అండమాన్ నికోబార్ దీవుల ప్రాంతంలో ప్రవేశించే అవకాశం ఉన్నదని వాతావరణ కేంద్రం తెలిపింది. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేసింది. నైరుతి బంగాళాఖాతంలో కొనసాగుతున్న అల్పపీడనం బుధవారం తీవ్ర అల్పపీడనంగా మారిందని పేర్కొన్నది. గురువారం నుంచి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 2 నుంచి 3 డిగ్రీలు పెరిగే అవకాశం ఉన్నదని వెల్లడించింది. ఈనెల 22 వరకు భానుడు తన ప్రతాపాన్ని చూపుతాడని హెచ్చరించింది. గడిచిన 24 గంటల్లో నిజామాబాద్‌లో అత్యధికంగా 44.5 డిగ్రీలు, జగిత్యాల జిల్లా బీర్పూర్‌లో 44.4, కామారెడ్డి జిల్లా బిచ్కుందలో 44.2, సిద్దిపేట జిల్లా కోహెడలో 43.9, నిర్మల్ జిల్లా దస్తూరాబాద్‌లో 43.8 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదైనట్టు వివరించింది. వచ్చే రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా వడగాల్పులు ఎక్కువగా ఉంటా యని 11 గంటల తర్వాత బయటకు వెళ్లే సమయాల్లో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించింది. చిన్నపిల్లలు, వృద్ధులు, గర్భిణులు ఈ వారంపాటు జాగ్రత్తగా ఉండాలని కోరిం

## నీట్ పరీక్ష రద్దుపై రేవంత్ రెడ్డి స్పందన



పరీక్ష రద్దు నిర్ణయంతో లక్షలాది మంది విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తీవ్ర ఆందోళనలో ఉన్నారని, ఇలాంటి ఘటనలు పరీక్షల వ్యవస్థపై ఉన్న విశ్వసనీయతను దెబ్బతీస్తాయని సీఎం ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా పేపర్ లీక్ మాఫియాపై ఉక్కుపాదం మోపాలని, విద్యార్థులు మళ్లీ ఇబ్బంది పడకుండా కేంద్ర ప్రభుత్వం తక్షణమే పటిష్ఠమైన చర్యలు తీసుకోవాలని రేవంత్ రెడ్డి సూచించారు. పోటీ పరీక్షలు అనేవి విద్యార్థుల ప్రతిభకు వేదిక కావాలి తప్ప, వారి జీవితాలను నాశనం చేసే సాధనాలుగా మారకూడదని ఆయన హితవు పలికారు. ఇదే సమయంలో ఆయన రాజకీయంగా కూడా విమర్శలు గుప్పించారు. పరీక్షల నిర్వహణలో వైఫల్యాలు, పేపర్ లీక్ ఘటనల విషయంలో గత ప్రభుత్వ తీరు, ఇప్పుడు కేంద్రంలోని బీజేపీ వైఖరి ఒకేలా ఉందంటూ రేవంత్ రెడ్డి చురకలు అంటించారు.

## ఎస్ఐఆర్ మూడవ దశ షెడ్యూల్ విడుదల..

3.94లక్షలకు పైగా బూత్ స్థాయి అధికారులు (బిఎల్ ఒ) ఇంటింటికి వెళ్లి 36.73కోట్ల మంది ఓటర్లను సర్వే చేస్తారని తెలిపింది. ఎస్ ఐఆర్ మూడవ దశలో దేశ రాజధాని ఢిల్లీ కూడా ఉందని, అక్టోబర్ 7న తుది జాబితా ప్రచురిస్తామని వెల్లడించింది. జనగణనలో భాగంగా కొనసాగుతున్న ఇళ్ల సర్వే నేపథ్యంలో క్షేత్రస్థాయి యంత్రాంగాన్ని దృష్టిలో ఉంచుకుని మూడవ షెడ్యూల్ ను ఖరారు చేసినట్లు ఇసిఐ తెలిపింది. మూడవ దశ పూర్తయిన తర్వాత హిమాచల్ ప్రదేశ్, జమ్మూకాశ్మీర్, లడఖ్ మినహా దేశమంతా ఎస్ ఐఆర్ చేపడతామని ప్రకటించింది. వాతావరణ పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని హిమాచల్ ప్రదేశ్, జమ్ముకాశ్మీర్, లడఖ్ ల షెడ్యూల్ ను ప్రకటిస్తామని తెలిపింది.

## పాకిస్తాన్‌లో ఉగ్రవాదులపై ఆపరేషన్‌లో ఐదుగురు సైనికులు మృతి



ఫీల్డ్ ఆఫీసర్ సహా ఐదుగురు సైనికులు మరణించగా, ఏడుగురు ఉగ్రవాదులు మరణించినట్లు ఐఎస్ పి ఆర్ తెలిపింది. ఉగ్రవాదుల నుండి ఆయుధాలు, మందుగుండు సామాగ్రి, పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకున్నామని వెల్లడించింది. బలూచిస్తాన్ లో ఇటీవల ఉగ్రవాదులు భద్రతా దళాలు, ప్రభుత్వ మౌలిక సదుపాయాలు లక్ష్యంగా దాడులు జరుపుతున్న సంగతి తెలిసిందే.

## సీఎం చంద్రబాబు వాహన శ్రేణి కుదింపు

ఇక నుంచి ఈ నాలుగు వాహన కాన్వాయ్ శ్రేణితోనే ప్రయాణించాలని సీఎం నిర్ణయించారు. అటు మంత్రులు, ప్రజాప్రతినిధులు కూడా ఈ మేరకు వాహన శ్రేణిని తగ్గించుకుని ఇంధనాన్ని ఆదా చేయాలని సీఎం సూచించారు. ఈ మేరకు మంత్రులు కూడా తమ కాన్వాయ్‌లోని వాహనాలను తగ్గించుకున్నారు.

## జిన్‌పింగ్‌పై ట్రంప్ ప్రశంసలు

**తనకుమంచి స్నేహితుడని అంటూ పొగడ్తలు**

**ఇరు దేశాల మధ్య శిఖరాగ్ర సదస్సులో ట్రంప్**

**ఇంగ్ :**అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, చైనా అధినేత జిన్‌పింగ్ మధ్య గురువారం బీజింగ్‌లో ఉన్నత స్థాయి సమావేశం ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఇరు దేశాల బృందాలను ఉద్దేశించి మాట్లాడిన అధ్యక్షుడు ట్రంప్ చైనా అధినేతపై ప్రశంసలు కురిపించారు. జిన్‌పింగ్‌ను కలవడం తనకు గౌరవమని, ఆయన తనకు మంచి స్నేహితుడని కొనియాడారు. ఇరు దేశాలకు అద్భుతమైన భవిష్యత్తు ఉందని వ్యాఖ్యానించారు. 'మా మధ్య మంచి సంబంధాలు ఉన్నాయి. పొరపొచ్చాలు వచ్చినప్పుడు కూడా మాట్లాడుకుని త్వరగా పరిష్కరించాము. మీరు ఒక గొప్ప నాయకుడు. ఇలా నేను మిమ్మల్ని ప్రశంసించడం కొందరికి నచ్చకపోవచ్చు. కానీ నేను ఉన్నది ఉన్నట్టు చెబుతున్నాను. చైనా, అమెరికాలు కలిసికట్టుగా అద్భుత భవిష్యత్తువైపు అడుగులు వేస్తున్నాయి ' అని ట్రంప్ అన్నారు. ఈ పర్యటన కోసం తాను అమెరికాకు చెందిన అత్యుత్తమ వ్యాపారవేత్తలను తీసుకొచ్చానని కూడా ట్రంప్ చెప్పారు. వారందరికీ చైనా అధినేత అంటే గౌరవమని చెప్పారు. ఇదే అతిపెద్ద శిఖరాగ్ర సమావేశమని కూడా వ్యాఖ్యానించారు. ఇక ఈ సమావేశాల ప్రారంభంలో చైనా అధినేత జిన్‌పింగ్ మాట్లాడుతూ ఇరు దేశాల మధ్య సహకారం ఉండాలని అభిలషించారు. చైనా-యూఎస్ బంధం స్థిరంగా ఉండాల్సిన ఆవశ్యకత గురించి కూడా మాట్లాడారు. ప్రస్తుతం ప్రపంచం దృష్టి తమ రెండు దేశాలపైనే ఉందని అన్నారు. గత శతాబ్దంలో చూడని మార్పులు ప్రస్తుతం జరుగుతున్నాయని చెప్పారు. అంతర్జాతీయంగా అల్లకల్లోల పరిస్థితులు ఉన్నాయని, ప్రపంచం నాలుగు రోడ్ల కూడలిలో ఉందని అభిప్రాయపడ్డారు. చైనా, యూఎస్‌లు తమ దౌత్య బంధంలో కొత్త అధ్యాయాన్ని ప్రారంభించాలని కూడా వ్యాఖ్యానించారు. రెండు రోజుల పాటు జరగనున్న ఈ శిఖరాగ్ర సమావేశంలో ఎన్‌విడియా సంస్థ సీఈఓ జెన్సన్ హువాంగ్, టెస్లా అధినేత ఎలాన్ మస్క్, యాపిల్ సీఈఓ టిమ్ కుక్ పాల్గొంటున్నారు. ద్వైపాక్షిక వాణిజ్యం, ఇరాన్ యుద్ధం, టెక్నాలజీతో పాటు తైవాన్ అంశంపై కూడా చర్చించేందుకు ట్రంప్ చైనాలో పర్యటిస్తున్నారు. వ్యవసాయ ఉత్పత్తులు, ప్యాసింజర్ విమానాలను చైనాకు మరింతగా ఎగుమతి చేసేలా ఒప్పందం కుదుర్చుకునేందుకు ట్రంప్ ప్రయత్నిస్తున్నారు.

## చెన్నై ఎక్స్‌పెస్‌లో సాంకేతిక లోపం

**రెండున్న గంటలపాటు నిలిపివేత**

మొదటి పేజీ తరువాయి

నల్లగొండ,నల్లగొండ జిల్లా మిర్యాలగూడ రైల్వే స్టేషన్ సమీపంలో చెన్నై ఎక్స్‌ప్రెస్ రెండున్నర గంటలు పాటు నిలిచిపోయింది. ఇంజిన్‌లో విద్యుత్ సమస్య తలెత్తడంతో రైలు ఆగిపోయింది. మరమ్మతుల అనంతరం రైలు 9:50 గంటలకు బయలుదేరి వెళ్లింది. ట్రెయిన్ ఆగిపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అసలే ఎండాకాలం కావడంతో ట్రైన్‌లో ఫ్యాన్లు, ఎసిలు పనిచేయకపోవడంతో నానాయాతన పడ్డారు.

# దీవుల ప్రగతికి అలుపెరుగని విక్రమార్కునిలా కృష్ణారావు కృషి







## స్మరించుకున్న ఎదురుమొండి వాసులు

### ఎదురుమొండిలో మండలి కృష్ణారావు శత జయంతి సందర్భంగా ఉచిత వైద్య శిబిరం

అవనిగడ్డ / నాగాయలంక ప్రజాభూమి ప్రతినిధి

దీవుల ప్రగతికి అలుపెరుగని విక్రమార్కునిలా ఎంవీ కృష్ణారావు కృషి చేశారని ఎదురుమొండి వాసులు స్మరించుకున్నారు. గురువారం నాగాయలంక మండలం ఎదురుమొండి దీవిలోని జిల్లా పరిషత్ హైస్కూల్లో ఉమ్మడి రాష్ట్ర మాజీ మంత్రి, దివిసీమ గాంధీ స్వర్గీయ మండలి వెంకట కృష్ణారావు శత జయంతి వేడుకలు ఘనం గా జరిగాయి. ఈ సందర్భంగా శత జయంతి నిర్వహణ కమిటీ, మాజీ సర్పంచులు, గ్రామ పెద్దల ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ ముఖ్య అతిధిగా విచ్చేశారు. కృష్ణారావు విగ్రహానికి గ్రామ పెద్దలు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. స్వర్గీయ కన్నా జనార్ధన్ చిత్రపటానికి ఎమ్మెల్యే పూల మా లలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా విజయవాడ పళ్లెం పెద్దేశ్వర్ హాస్పటల్ నిర్వాహకులు డాక్టర్ పళ్లెం ఆకాష్ తమ వైద్య బృందంతో విచ్చేసి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ మాట్లాడుతూ మండలి వెంకట కృష్ణారావు 1956లోనే సెప్టెంబర్ 2వ తేదీన గుల్లలమోద వద్ద సముద్రపు కరకట్ట ఆవశ్యకతను నాటి ఉప ముఖ్యమంత్రి నీలం సంజీవరెడ్డికి వివరించేందుకు నదికి అవతలి వైపు ఉన్న రాజు ఛానల్లో లాంచీలో ప్రయాణిస్తూ ఎదురుమొండి దీవుల అభివృద్ధి ప్రణాళిక గురించి కూడా వివరించారని తెలిపారు. 1957 నవంబర్ 20వ తేదీన పార్లమెంట్ సభ్యునిగా ఎదురుమొండి దీవిలో కాలినడకన పర్యటించిన ఎంవీ కృష్ణారావు ఇక్కడి పరిస్థితిని అప్పటి జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్ దృష్టికి తీసుకెళ్లి, వారితో కలిసి 1957 డిసెంబర్ 10వ తేదీ మరోసారి పర్యటించారని తెలిపారు. 1958 జనవరి 21వ తేదీన దివిసీమ సముద్రపు కరకట్ట శంకుస్థాపనకు విచ్చేసిన అప్పటి రాష్ట్ర నీటిపారుదల, వ్యవసాయ శాఖ మంత్రి జేవీ నరసింగారావు దృష్టికి మండలి వెంకట కృష్ణారావు ఎదురుమొండి, ఈలచెట్లదిబ్బ దీవుల అభివృద్ధి పథకాన్ని వివరించారని, వారి సానుకూల స్పం దనతో, రెండో రోజే ప్రభుత్వ చీఫ్ ఇంజినీర్లను సంప్రదించి,

1958 ఏప్రిల్ 16వ తేదీ అప్పటి రాష్ట్ర ముఖ్యమంత్రిని కలసి ఈ దీవుల అభివృద్ధి పథకా న్ని మంజూరు చేయాలని అభ్యర్థించారని తెలిపారు. దీవుల అభివృద్ధికి అలుపెరగని భట్టి విక్రమార్కునిలా సమస్యను భుజాన వేసుకొని తిరిగిన మండలి వెంకట కృష్ణారావు కృషి ఫలితంగా 1958 సెప్టెంబర్ 9వ తేదీ అధికారులు, ఇంజినీర్లు దీవుల సర్వే చేపట్టారని తెలిపారు. 1958 అక్టోబర్ 14వ తేదీ కృష్ణారావు అధికా రులు, అనధికారులతో ఎదురుమొండి బ్లాక్ అభివృద్ధి కమిటీ ఏర్పాటు చేసి ఈ దీవుల సామా జిక ఆర్థిక పరిస్థితులపై అవగాహన సదస్సు నిర్వహించారని తెలిపారు. 1958 డిసెంబర్ 28వ తేదీ జరిగిన కృష్ణాజిల్లా ఇరిగేషన్ బోర్డు సమావేశంలో ఈ దీవుల అభివృద్ధి పథకంపై చర్చించారని బుద్ధప్రసాద్ వివరిం చారు. బ్రిటిష్ వారి హయాం నుంచి ఎదురుమొండి, ఈలచెట్లదిబ్బలో మడ అడవులు ఉన్న కారణంగా రిజర్వ్ ఫారెస్టుగా ఉన్న ఈ దీవుల అభివృద్ధికి అనుగు ణంగా అప్పటి రాష్ట్ర అటవీ శాఖ మంత్రి పల్లంరాజును ఈ దీవులలో పర్యటింపచేశారని, ఫలితంగా 1967 ఫిబ్రవరి 7వ తేదీ రాష్ట్ర ప్రభు త్వం ఈ దీవులకు నీటి ఎత్తిపోతల పథకాన్ని మంజూరు చేసిందని తెలిపారు. తద్వారా అప్పటి కేంద్ర నీటిపారుదల శాఖ మంత్రి డాక్టర్ కె.ఎల్. రావు 1965 ఫిబ్రవరి 9వ తేదీ ఎదురుమొండి దీవుల్లో పర్యటించారని తెలిపారు. కృష్ణారావు విస్తృత కృషి ఫలించి 1967 ఆగస్టు 16వ తేదీ అప్పటి ఇరిగేషన్ శాఖ మంత్రి శీలం సిద్ధారెడ్డి పంపింగ్ స్కీం ప్రారంభించారని తెలిపారు. 1968 ఆగస్టు 27వ తేదీ అప్పటి అటవీ శాఖ మంత్రి హోదాలో శీలం సిద్ధారెడ్డి దీవుల్లో పర్య టనకు ఆహ్వానించటం ద్వారా దీవుల్లోని 2,200 ఎకరాల రిజర్వ్ ఫారెస్ట్ భూములను స్థానికులకు కౌలుకు సాగుకు ఇచ్చేందుకు అనువుగా ప్రభు త్వం ఉత్తర్వులు జారీ చేసేలా కృష్ణారావు విస్తృత కృషి చేశారని బుద్ధప్రసాద్ తెలిపారు. దీవుల ప్రగతికి అపర భగీరధునిలా మండలి వెంకట కృష్ణారావు చేసిన కృషి ఫలితంగా 1977 అక్టోబర్ 20వ తేదీ అప్పటి నీటిపారుదల శాఖ మంత్రి ఆనం వెంకటరెడ్డి రిజర్వాయర్ నిర్మాణా నికి శంకుస్థాపన చేయగా, అప్పటి ప్రభుత్వం రూ.4.40 లక్షలతో నిర్మించిన రిజర్వాయరును 1978 ఆగస్టు 4వ తేదీ అప్పటి మైనర్ ఇరిగేషన్ శాఖ మంత్రి సి.దాసు ప్రారంభించారని తెలిపా రు. అనంతరం ఎదురైన సముద్రపు ఉప్పు నీటి పోటు సమస్యను పరిష్కరించేందుకు ప్రభుత్వ సహకారంతో కృష్ణానది వెస్ట్ బ్యాంక్ కెనాల్ ద్వారా కృష్ణానది నీటిని భారీ పైప్ లైన్ల ద్వారా దీవుల రిజర్వాయరుకు మళ్ళించారని తెలిపారు. 1977 నవంబర్ 19న వచ్చిన దివిసీమ ఉప్పెనకు దివిసీమతో సహా అతలాకుతలమైన ఎదురు మొండి, ఈలచెట్లదిబ్బ దీవులలో మండలి వెంకట కృష్ణారావు కెనడాకు చెందిన సిడా సంస్థ ద్వారా సహాయ కార్యక్ర మాలు, ఆరోగ్య పథకం అమలు చేశారని తెలిపారు. నాచుగుంట, ఈలచెట్లదిబ్బలో రెండు తుఫాను షెల్టర్లు నిర్మించారని తెలిపా రు. ముక్కామల నాగభూషణం సహకా రంతో కెనడియన్ ఇంటర్నేషనల్ డెవలప్మెంట్ ఏజెన్సీ, కెనడియన్ బాప్టిస్ట్ ఫెడరేషన్ సహ కారంతో దీవులలో తవ్విన రిజర్వాయరుకు పైప్ లైన్ కలిపారని తెలిపారు. 1978 ఆగస్టు 4వ తేదీ జలశయాన్ని ప్రారంభించారని తెలిపారు. చేపల వేట వృత్తిపై ఆధారపడి జీవి స్తున్న దీవుల ప్రజల ఆర్థిక సామాజిక స్థితిగతులు మెరుగుపరిచేందుకు మండలి వెంకట కృష్ణారావు విస్తృత కృషి చేశారని తెలిపారు. దీవుల్లో వ్యవసా యాన్ని కూడా ప్రధాన వృత్తిగా మార్చేందుకు అనువుగా కృష్ణారావు దీవులకు నీటిపారుదల సౌకర్యాలు కల్పించేందుకు రూ.కోటి నలభై లక్షల అంచ నాతో ఎదురు మొండి, ఈలచెట్లదిబ్బ దీవుల ఎత్తిపోతల పథకం ఏర్పాటు చేయాలనే లక్ష్యంతో కృష్ణానది పశ్చిమ కాలువ ద్వారా ఎదురుమొండి దీవులకు పైపులైన్ ఏర్పాటుచేసి సాగునీరు అందించి ఎదురుమొండి దీవిలోని 1,215 హెక్టార్లు, రాజు కాలువ ద్వారా ఈలచెట్లదిబ్బలోని 608 హెక్టార్లను సాగులోకి తెచ్చేందుకు 1980 నవంబర్ 20వ తేదీ ప్రభుత్వం దృష్టికి చీఫ్ ఇంజినీర్ ప్రతిపాదనలు పంపారని బుద్ధప్రసాద్ తెలిపారు. 1982 మే 8వ తేదీ కెనడియన్ డెవలప్మెంట్ ఏజెన్సీ ఆర్థిక సహకారంతో వెస్ట్ బ్యాంక్ కెనాల్ నుంచి నది గర్భంలో పైప్ లైన్ వేసేందుకు అప్పటి రాష్ట్ర ముఖ్యమంత్రి భవనం వెంకట్రామ్ శంకుస్థాపన చేసినట్లు ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ తెలిపారు. ఈ స్కీం కోసం కేంద్ర గ్రామీణ విద్యుదీకరణ సంస్థ వారిచే కృష్ణారావు ప్రత్యేక విద్యుత్తు సబ్ స్టేషన్ ఏర్పాటు చేయిం చారని, ఎదురుమొండి దీవులకు వచ్చే 1.70 క్యూసెక్కుల నీటి ప్రవాహాన్ని భరించేందుకు అనువుగా 1,001 ఆర్మ్ పొడవు గల పైప్ లైన్ వేయించారని తెలిపారు. ఈలచెట్లదిబ్బకు 789 మీటర్ల పొడవునా 0.89 క్యూసెక్కుల నీటిని విడుదల చేసే వారి పైప్ లైన్ వేయించినట్లు తెలిపారు. ఈ రెండు దీవులలో నివసించే నిరుపేదల ఆకాంక్షలు నెరవేర్చేందుకు మండలి వెంకట కృష్ణారావు అనేకసార్లు ఢిల్లీ, బొంబాయి, హైదరాబాద్ ప్రాంతాల్లో పర్యటించి నిధులు సాధించి సాకారం చేశారని తెలిపారు. ఎదురుమొండి దీవులకు విద్యుత్ సౌకర్యం కల్పించిన ఘనత కృష్ణారావుకే దక్కిందన్నారు. మండలి వెంకట కృష్ణారావు శత జయంతి నిర్వహణ కమిటీ కన్వీనర్ తలశిల స్వర్ణలత అధ్యక్షతన జరిగిన సభలో కృష్ణారావు అనుచరులు బొడ్డు సాంబయ్య, మాజీ ఎంపీటీసీ మేడికొండ రాజమోహన రావు, నాచుగుంట మాజీ సర్పంచులు సైకం నాగేశ్వరరావు, పోతాబత్తిన నారాయణ, నీటి సంఘ అధ్యక్షులు నాయుడు మస్తాన్ రావు మాట్లాడుతూ ఎదురుమొండి, నాచుగుంట, ఈలచెట్లదిబ్బలకు చేసిన మేలు స్మరించుకున్నారు. నీటి సంఘం అధ్యక్షులు, మాజీ సర్పంచ్ నాయుడు బాబూరావు, మాజీ జడ్పీటీసీ కన్నా నాగరాజు, మాజీ సర్పంచ్ కన్నా సుధా కీర్తన, పర్యవేక్షణలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో నాగాయలంక డీసీ చైర్మన్ బండ్రెడ్డి నాగమల్లికార్జునరావు (చిన బాబు), మాజీ సర్పంచ్ మండలి ఉదయ భాస్కర్, శత జయంతి కమిటీ ప్రతినిధులు మత్తి శ్రీనివాస రావు, గుడివాక శివరావు, బండ్రెడ్డి హరి, మాజీ సర్పంచ్ సైకం నాగబాబు, ఫిషర్ మెన్ సొసైటీ చైర్మన్ చెన్ను వెంకటేశ్వరరావు, మాజీ ఎంపీటీసీ కన్నా రామ్మోహనరావు, సహకార సంఘ అధ్యక్షులు కొక్కిలిగడ్డ నాగరాజు, అగ్నికుల క్షత్రి య యూత్ నాయకులు నాయుడు కృష్ణ, బర్రం కుల సహకార సంఘ అధ్యక్షులు తోట శ్రీనివాసరావు, టీడీపీ నాగాయలంక టౌన్ అధ్యక్షులు ఉప్పల ప్రసాద్, మాజీ వైస్ ఎంపీపీ లుక్కా పిచ్చియ్య, భోగాది విష్ణు, తోట మానస, తానంకి చంటి తదితరులు పాల్గొన్నారు.

**ఉత్తమ విద్యార్థులకు సత్కారం**

ఎదురుమొండి జడ్పీ హైస్కూల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన పదవ తరగతి విద్యార్థులను, హెచ్ఎం బడే లలిత కుమారి, ఉపాధ్యాయులు సీహెచ్ నాగప్రసాదులను ఎమ్మెల్యే సత్కరించారు.

**ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన**

ఈ సందర్భంగా పళ్లెం పెద్దేశ్వర్ హాస్పిటల్, అమరావతి కంటి ఆసుపత్రి వారిచే నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాలకు విశేష స్పందన లభిం చింది. ఆయా శిబిరాల్లో 281 మందికి గుండె, ఎముకలు, కీళ్ళు, నేత్ర పరీక్షలు, సాధారణ వైద్య పరీక్షలు చేసి తదుపరి వైద్యం అవసరమైన వారికి సిఫార్సు చేశారు. కార్యక్ర మంలో వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

# అమలేశ్వర్వి అమ్మవారి జాతర మహోత్సవాలు

## ప్రత్యేక పూజా కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే సింహాద్రి



అవనిగడ్డ / ఘంటసాల ప్రజాభూమి ప్రతినిధి

ఘంటసాల మండలం, చిట్టూర్పు గ్రామ పంచాయతీ పరిధిలోని నేతగాని హరిజనవాడలో వేంచేసి యున్న శ్రీ అమలేశ్వరి అమ్మవారి జాతర మహోత్సవాలు సందర్భంగా అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజా కార్యక్రమంలో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు అందుకున్న అవనిగడ్డ నియోజకవర్గం మాజీ శాసనసభ్యులు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త, రాష్ట్ర రైతు విభాగం రీజనల్ వర్కింగ్ ప్రెసిడెంట్ సింహాద్రి రమేష్ బాబు ...ఈ కార్యక్రమంలో ఘంటసాల జడ్పీటీసీ తుమ్మల మురళీకృష్ణ, వైఎస్ఆర్సీపీ నాయకులు తాతినేని కృష్ణారావు, పరుచూరి రామకృష్ణ ప్రసాద్, దాసరి బసవ కుటుంబరావు, దాసరి శివ వెంకట సుబ్బయ్య, బూసి సుబ్రమణేశ్వరరావు, మరియు పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక గ్రామస్థులు, అమ్మవారు భక్తులు తదితరులు పాల్గొన్నారు.



# క్రీడా సంస్కృతితో ఆరోగ్యవంతమైన సమాజం

## – వేసవి క్రీడల శిక్షణ శిబిరాన్ని సందర్శించిన కలెక్టర్ డా. జి.లక్ష్మీశ



ప్రజాభూమి ప్రతినిధి,విజయవాడ:

క్రీడా సంస్కృతి ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి ఉపయోగపడుతుందని.. క్రీడలను ప్రతి ఒక్కరూ తమ జీవనశైలిలో భా గంగా చేసుకో వాలని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు.ఎన్టీఆర్ జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ (డీఎస్ఏ) ఆధ్వర్యంలో జిల్లావ్యాప్తంగా 50 సమ్మర్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ కోచింగ్ క్యాంపులు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా గురువారం నగరంలోని ఇందిరాగాంధీ మునిసిపల్ మైదానంలో జరుగుతున్న క్రీడల శిబిరాన్ని కలెక్టర్ లక్ష్మీశ సందర్శించారు. చిన్నా రులతో కలిసి ఆటలాడి వారిని ఉత్సాహపరిచారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ పిల్లల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయడంలో ఇటువంటి శిక్షణ శిబిరాలు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. క్రీడలు శారీరక దృఢత్వాన్ని పెంపొందించడమే కాకుండా, క్రమశిక్షణ, జట్టు భావన, ఆత్మవిశ్వాసాన్ని పెంచుతాయని అన్నారు. చిన్నారులు, యువత మొబైల్ ఫోన్లు, టీవీలకు పరిమితం కాకుండా క్రీడల వైపు కూడా అడుగులు వేయాలని సూచించారు. వేసవి సెలవులను విద్యార్థులు సద్వినియోగం చేసుకొని క్రీడల్లో నైపుణ్యాలను పెంపొందించుకోవాలనే ఉద్దేశంలో ఈ నెల 31వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా 27 క్రీడా విభాగాల్లో కోచింగ్ క్యాంపులు ఉదయం, సాయంత్రం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు.కార్యక్రమంలో జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి (డీఎస్డీవో) కె.కోటేశ్వరరావు పాల్గొన్నారు.

# పీఎం సూర్యఘర్‌లో ప్రగతి కనిపించాల్సిందే



- ప్రతి వారం సమీక్షా సమావేశాలు నిర్వహణ
- సోలార్ ప్యానెళ్ల ఏర్పాటు ప్రక్రియను వేగవంతం చేయాలి
- పీఎం కుసుమ్ పథకంపైనా ప్రత్యేకంగా దృష్టి పెట్టాలి: జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

ప్రజాభూమి ప్రతినిధి,విజయవాడ:

పీఎం సూర్యఘర్ పథకం అమల్లో స్పష్టమైన పురోగతి కనిపించాల్సిందేనని, ప్రతివారం సమీక్షా సమావేశాలు నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ తెలిపారు.కలెక్టర్ లక్ష్మీశ గురువారం కలెక్టరేట్ శ్రీ ఏవీఎస్ రెడ్డి హాల్‌లో పీఎం సూర్యఘర్, పీఎం కుసుమ్ పథకాల అమలుపై సమా వేశం నిర్వహించారు. మండలాలు, డివిజన్లు, నియోజకవర్గాల వారీగా ప్రగతిని సమీక్షించారు. జనరల్ కేటగిరీలో ఇప్పటివరకు 44,292 దరఖాస్తులు వచ్చాయని.. వీటిలో 44,256 దరఖాస్తులకు సంబంధించి సాంకేతిక సాధ్యత (Feasibility) పరిశీలన పారదర్శకంగా నిర్వహించి, 37,716 దరఖాస్తులకు వెండర్లతో మ్యాప్ చేశామని, వీటిలో 6,228 దరఖాస్తులకు సంబంధించి సింక్రనైజ్డ్ పూర్తయినట్లు అధికారులు వివరించారు. అదేవిధంగా ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులకు సంబంధించి రూఫ్ టాప్ ఇన్‌స్టలేషన్‌కు 35,445 మందిని తొలిదశలో గుర్తించి, దాదాపు 5 వేల ఇన్‌స్టలేషన్లు అయినట్లు వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ గౌరవ ప్రధాని, గౌరవ ముఖ్యమంత్రి, గౌరవ ఉపముఖ్యమంతి ఇంధన భద్రత, పొదుపునకు ప్రాధాన్యమిస్తున్నారని, ఈ నేపథ్యంలో పీఎం సూర్యఘర్ పథకాన్ని వడివడిగా ముందుకు తీసుకెళ్లేందుకు కృషిచేయాలని, స్పెషల్ డ్రైవ్స్ నిర్వహించాలని ఆదేశించారు. అదేవిధంగా వ్యవసాయ రంగంలో పునరుత్పాదక ఇంధన వినియోగాన్ని ప్రోత్సహిస్తూ రైతులకు సౌర విద్యుత్ ప్రయోజనాలు చేరవేర్చే పీఎం కుసుమ్ పథకంపైనా ప్రత్యేకంగా దృష్టిసారించాలని సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేసి పథకం అమల్లో స్పష్టమైన పురోగతి సాధించాలని కలెక్టర్ లక్ష్మీశ ఆదేశించారు.సమావేశంలో విద్యుత్ శాఖ సూపరింటెండెంట్ ఇంజనీర్ యు.హనుమయ్య, ఈఈలు శ్రీనివాసరావు, ఏడుకొండలుతో పాటు కోసోల్ ఎనర్జీ, ఎకో రన్ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

# అంతర్రాష్ట్ర దొంగల ముఠా గుట్టు రట్టు

## కళ్యాణ మండపాలను లక్ష్యంగా చేసుకొని దొంగతనాలకు పాల్పడుతు.. గంజాయి అమ్ముతున్న అంతర్రాష్ట్ర దొంగల ముఠా గుట్టు రట్టు చేసిన పోలీసులు

మచిలీపట్నం/ప్రజాభూమి క్రైమ్



చిలీపట్నం లోకళ్యాణ మండపాలే ధ్యేయంగా దొంగతనాలకు పాల్పడుతూ అదే సమయంలో గం జాయి విక్రయాలు చేస్తున్నటువంటి అంతర్రాష్ట్ర దొంగల ముఠా గుట్టు బట్టబయలు చేసిన కృష్ణాజిల్లా పోలీసులు.నిందితుల వద్ద నుండి 52.8 గ్రాముల బంగారు ఆభరణాలు వెండి వస్తువులు, మరియు 3.9 కిలోల గంజాయి స్వాధీనంఅనికేష్ కుమార్, రితీష్, మధ్యప్రదేశ్ రాష్ట్రనికి చెందిన ఇద్దరు నిందితులను మీడియా సమావేశంలో వెల్లడి చేసిన కృష్ణా జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయు డుఎస్పి విద్యాసాగర్ నాయుడు మాట్లాడుతూఈ మధ్య కాలంలో నగరంలో వివాహ వేడుకలలో వివాహ ఇరు కుటుంబాల వారు అప్రమత్తంగా ఉండాలని నగర ప్రజలకు వివరించారు.

# సత్ఫలితాలు ఇస్తున్న ఎన్రోల్మెంట్ డ్రైవ్

## సమగ్ర శిక్ష ఏ.పీ.ఓ మరియు సహిత విద్య జిల్లా సమన్వయకర్త కళ్ళేపల్లి ఏడుకొండలు



అవనిగడ్డ / చల్లపల్లి ప్రజాభూమి ప్రతినిధి

2026 -27 విద్యా సంవత్సరానికి విద్యాశాఖ చేపడుతున్న నేస్తమా బడికి రా అనే కార్యక్రమంలో భాగంగా చల్లపల్లి మండలంలోని మండల పరిషత్ ప్రాథమిక మోడల్ ప్రైమరీ పాఠశాల నారాయణరావు నగర్ ఏరియా. జగనన్న కాలనీ నారాయణ రావు నగర్ నందు చేపట్టిన స్పెషల్ ఎన్రోల్మెంట్ డ్రైవ్ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన సమగ్ర శిక్ష ఎ .పి.ఓ.మరియు జిల్లా సహిత విద్యా సమన్వయకర్త కళ్ళేపల్లి ఏడుకొండలు గారు మాట్లాడుతూ ఈరోజు నారాయణరావు నగర్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత కైతేపల్లి దాస్ మరియు హై స్కూల్ ప్రధానోపాధ్యాయులు మట్ట రాజా గారి ఆధ్వర్యంలో చేపట్టిన ఎన్రోల్మెంట్ డ్రైవ్ సత్ఫలితాన్ని ఇస్తుందని ప్రైవేట్ పాఠశాలల్లో చదివే విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలలలో చేర్పిస్తున్న తల్లిదండ్రుల దీనికి నిదర్శనమని సంతృప్తిని వ్యక్తపరిచారు .నారాయణ రావు నగర్ ప్రధానోపాధ్యాయులు ముద్రించిన ప్రభుత్వ పాఠశాలలో సదుపాయాలను తెలియజేసే కరపత్రం తల్లిదండ్రులను ఆలోచింప చేస్తుందని దాస్ మాస్టర్ గారిని అభినందించారు. ఈరోజు ప్రాథమిక పాఠశాలలో స్థాయిలో ఏడుగురు ప్రైవేట్ పాఠశాల నుండి ప్రభుత్వ పాఠశాలలో ఎన్రోల్మెంట్ చేయడానికి తల్లిదం డ్రులు అడ్మిషన్ ఫారాలు మీద సంతకాలు చేయడం జరిగింది. అంతేకాకుండా హైస్కూల్ స్థాయిలో ఐదుగురు మొత్తం 12 మంది ప్రైవేటు పాఠశాలల విద్యార్థులను ఈ డ్రైవ్ ద్వారా ప్రభుత్వ పాఠ శాలలో చేర్చుకోవడం సంతోషం మని ఈ డ్రైవ్ లో పాల్గొన్న చల్లపల్లి మండల విద్యాశాఖ అధికారి కందుల సుజాత, పి. వెంకటేశ్వరరావు లను.ఏడుకొండలు అభినందిస్తూ, మండలం మొత్తాన్ని టీం వర్క్ గా చేసుకుని ప్రభుత్వ ము ఇ చ్చిన ఎన్రోల్మెంట్ టార్గెట్ ను పూర్తి చేయాలని సూచించడం జరిగినది. ఈ సందర్భంగా దాస్ మాస్టర్ ముద్రించిన కరప త్రాలు ఇంటింటికి పంచుతూ ప్రభుత్వ పథకాల బ్యానర్స్ ను రిక్షా కు కట్టుకొని స్వయంగా ఆయనే రిక్షా తొక్కు తూ మైక్ పట్టుకుని ప్రైవేటు పాఠశాలలు వద్దు- ప్రభుత్వ పాఠశాలలో ముద్దు.మీ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించండి, ప్రభుత్వ పథకాలను పొందుకోండి అని పురవీధుల్లో ప్రచారం చేయడం ద్వారా ప్రజలకు ప్రభుత్వ పాఠశాలల పట్ల నమ్మకం కలుగుతుందని ఏడుకొండలు సంతృప్తిని వ్యక్తపరచినారు.ఈ సందర్భంగా ఎంఇఓ 1. కె.సుజాత మాట్లాడుతూ ఎన్రోల్మెంట్ డ్రైవ్ ను ప్రతి ఉపాధ్యాయుడు బాధ్యత తీసుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఎంఇఓ 2 వెంకటేశ్వరావు మాట్లాడుతూ స్కూల్ స్కూల్లో విద్యార్థులు ఉంటేనే ఉపాధ్యాయ పోస్టులు నిలబడతాయని అందువల్ల ప్రతి ఉపాధ్యాయుడు బాధ్యతగా ఎన్రోల్మెంట్ డ్రైవ్ లో పాల్గొని తమ పాఠశాల రోలు పెంచడానికి కృషి చేయాలని తెలిపిరి. నారాయణ రావు నగర్ ఉపాధ్యాయులు టీం వర్క్ గా చేస్తున్న ఎన్రోల్మెంట్ డ్రైవ్ ఇతర ఉపాధ్యాయులకు ఆదర్శంగా ఉందని ,అంతేకాకుండా ఉపాధ్యాయ బృందాన్ని సమన్వయం పరుస్తూ మండలంలో అన్ని గ్రామాల ఎన్రోల్మెంట్ డ్రైవ్ పాల్గొంటున్నా దాస్ మాస్టర్ ఇతరుల ఉపాధ్యాయులకు ఆదర్శమన్నారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు , కైతేపల్లి దాస్,తిరుమల శెట్టి విజయ దుర్గ ,చిలకలపూడి రాధా రాణి, పాగోలు దుర్గాప్రసాద్, పు లివర్తి బుల్లియ్య,ఎస్ఎంసి సభ్యులు తల్లిదండ్రులు మరియు జిల్లా పరిషత్ హై స్కూల్ ప్రధానోపాధ్యాయులు మట్టా రాజా సహోపాధ్యాయులు తమ్ము మాధవరావు ఓట్ల కృష్ణారావు ,సిరివెళ్ల సమత అంబేద్కర్ ,అశోక్ ,సి ఆర్ పి బేతపూడి సునీత ,శ్రీహరి అనిల్ ,విద్యార్థులు తదితరులు పాల్గొని విస్తృతంగా ప్రభుత్వ పాఠశాలల గురించి ప్రచారం చేయడమైనది. ఈ సందర్భంగా ప్రభుత్వ పాఠశాలలో చేర్పిస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులకు దాస్ మాస్టర్ కృతజ్ఞతలు తెలియజేసినారు. సభ్యులు తల్లిదండ్రులు ఎక్కువ సంఖ్యలో పాల్గొన్నారు.



# పర్యావరణ హిత జీవనమే భావితరాలకు భద్రత

- సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌కు పూర్తిగా చెక్ పెట్టాలి
- స్వచ్ఛతలో విజయవాడను అగ్రస్థానంలో నిలబెట్టాలి
- ప్రజలకు ఉచితంగా గుడ్డ సంచులు పంపిణీ చేసిన కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

ప్రజాభూమి ప్రతినిధి,విజయవాడ:

సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగం వల్ల పర్యావరణంతో పాటు ప్రజల ఆరోగ్యానికి కూడా తీవ్ర ముప్పు వాటిల్లే అవకాశముందని, ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్ కవర్ల వినియోగాన్ని పూర్తిగా మానేసి పర్యావరణహితమైన గుడ్డ సంచులను ఉపయోగించాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ మరియు విజయ వాడ నగరపాలక సంస్థ స్పెషల్ ఆఫీసర్ డాక్టర్ జి. లక్ష్మీశ పేర్కొన్నారు. గురువారం ఉదయం నిర్వహించిన నగర పర్యటనలో భాగంగా చిట్టినగర్, కొత్తపేట ప్రాంతాలను కలెక్టర్ విస్తృతంగా పర్యటించి క్షేత్రస్థాయిలో పరిశీలనలు నిర్వహించారు. ఈ సందర్భంగా పారిశుధ్యం, సింగిల్ యూ స్ ప్లాస్టిక్ నిషేధ అమలుపై ప్రజల్లో అవగాహన కల్పించారు. పర్యటనలో భాగంగా కొండ ప్రాం తంలోని ఒక దుకాణంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ కవర్లు విక్రయిస్తున్న విషయాన్ని గమనించిన కలెక్టర్, వెంటనే వ్యాపారులతో మాట్లాడి ప్లాస్టిక్ కవర్ల వినియోగం పూర్తిగా నిషేధమని స్పష్టం చేశారు. దుకాణాలకు వచ్చే వినియోగదారులను గుడ్డ సంచులు తీసుకొచ్చేలా ప్రోత్సహించాలని వ్యాపారులకు సూచించారు. అదేవిధంగా, షాపుకు వచ్చిన ఒక వ్యక్తి చేతిలో ఉన్న ప్లాస్టిక్ కవరును స్వయంగా తీసుకొని, తన వద్ద ఉన్న గుడ్డ సంచిని అందజేసి ప్రజల్లో అవగాహన కల్పించారు. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, గుడ్డ సంచులు వంటి పర్యావరణ హిత మార్గాల ద్వారా ప్లాస్టిక్ కాలుష్యాన్ని గణనీయంగా తగ్గించవచ్చని తెలిపారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్వచ్ఛ సర్వేక్షన్ ఓటింగ్ ప్రక్రియలో ప్రతి పౌరుడు తప్పనిసరిగా పాల్గొనాలని కోరారు. ప్రజలతో ప్రత్యక్షంగా మాట్లాడి స్వయంగా క్యూ ఆర్ కోడ్ స్కాన్ చేయించి వారి అభిప్రాయాలను నమోదు చేయించారు. విజయవాడ నగర పరిశుభ్రతపై తమ అభిప్రాయాలను స్వచ్ఛ సర్వేక్షన్ ఫీడ్‌బ్యాక్ ద్వారా తెలియజేయాలని, జాతీయ స్థాయి ర్యాంకుల్లో విజయవాడను ఉత్తమ స్థానంలో నిలిపేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు.ఈ పర్యటనలో చీఫ్ మెడికల్ అండ్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కె. అర్జునరావు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీనివాస్, అసిస్టెంట్ మెడికల్ అండ్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ అన్నపూర్ణ తదితర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రజాభూమి

ఏలూరు, పశ్చిమగోదావరి



## ప్రజల ఆరోగ్య సంరక్షణే లక్ష్యంగా ఉచిత వైద్య శిబిరాలు

### ఎమ్మెల్యే బడేటి చంటి

**ప్రజా భూమి ప్రతినిధి-ఏలూరు**

సంపూర్ణ అవగాహనతోనే స్వీయ ఆరోగ్య సంరక్షణ సాధ్యమని జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి పేర్కొన్నారు.ప్రజల్లో ఆరోగ్యంపై చైతన్యం కల్పించడంతో పాటు వైద్య సేవలను అందుబాటులోకి తీసుకురావాలనే ఉద్దేశంతో ప్రతి గురువారం ఉచిత వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నామని తెలిపారు.ఏలూరు పవర్‌పేటలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గురువారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని అవసరార్థులు సద్వినియోగం చేసుకున్నారు. సాధారణ వ్యాధులతో వచ్చిన వారికి వైద్యులు పరీక్షలు నిర్వహించి చికిత్స అందించారు.



అవసరమైన వారికి రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో 40 రకాల రక్త పరీక్షలను ఉచితంగా నిర్వహించారు. అనంతరం మందులను కూడా ఉచితంగా పంపిణీ చేశారు.ఈ సందర్భంగా వైద్య శిబిరాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే బడేటి చంటి మాట్లాడుతూ, ఆరోగ్య సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా నిష్ణాతులైన వైద్యులను సంప్రదించాలని ప్రజలకు సూచించారు.అత్యవసర వైద్య సేవలు అవసరమైన వారిని అత్యాధునిక సౌకర్యాలు కలిగిన ఆసుపత్రులకు రిఫర్ చేయాలని వైద్య సిబ్బందికి సూచనలు ఇచ్చారు.ప్రజా అవసరాలను తీర్చే బాధ్యతను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఎప్పటికప్పుడు గుర్తుచేస్తూ స్ఫూర్తినిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. అదే స్ఫూర్తితో ఉచిత వైద్య శిబిరాలకు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. నిష్ణాతులైన వైద్యులతో సేవలు అం దించేలా చర్యలు తీసుకున్నామని, అత్యవసర పరిస్థితుల్లో మెరుగైన ఆసుపత్రులకు పంపించే ఏర్పాట్లు కూడా చేశామని వెల్లడించారు.ప్రతి గురువారం తన క్యాంపు కార్యాలయంలో నిర్వహించే ఉచిత వైద్య సేవలను ప్రజలు సద్వినియో గం చేసుకోవాలని ఎమ్మెల్యే బడేటి చంటి కోరారు.ఈ కార్యక్రమంలో టిడిపి నగర అధ్య క్షులు చోడే వెంకటరత్నం, కార్యదర్శి రెడ్డి నాగరాజు, నాయకులు బెల్లపుకొండ కిషోర్, అమరావతి అశోక్, లంకపల్లి మాణిక్యాలరా వు, పిల్లారిశెట్టి సంధ్య, మల్లెపు రాము తదితరులు పాల్గొన్నారు.

## మైనారిటీ గురుకుల పాఠశాలలో అడ్మిషన్లకు ఆహ్వానం

**ప్రజా భూమి ప్రతినిధి-ఆగిరిపల్లి**



ఆగిరిపల్లి మండలం బొద్దనపల్లి గ్రామంలోని ఆంధ్రప్రదేశ్ మైనారిటీ గురుకుల బాలికల పాఠశా లలో ఈ నెల 15వ తేదీ నుంచి 25వ తేదీ వరకు 5, 6, 7, 8 తరగతులలో ప్రవేశాల కోసం అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు మండల విద్యాశాఖాధికారులు ఎస్. హేబేలు, కె. ఆనంద్ కుమార్ తెలిపారు.ముస్లిం కమ్యూనిటీతో పాటు క్రిస్టియన్ (బీసీ-సీ) కమ్యూనిటీకి చెందిన బాలికలకు ప్రవేశ పరీక్ష లేకుండానే అడ్మిషన్ అవకాశం కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. అర్హులైన విద్యార్థినుల తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.అడ్మిషన్లకు సంబంధించిన పూర్తి వివరాల కోసం పాఠశాల ప్రిన్సిపాల్ కె. గీతాంజలిని 8712625036 నంబర్‌లో సంప్రదించాలని తెలిపారు.

## పుస్తక పఠనంతో పెరుగుతున్న పఠనాభిరుచి




**ప్రజా భూమి ప్రతినిధి-ఆగిరిపల్లి**

ఆగిరిపల్లి శాఖా గ్రంథాలయంలో ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొంటున్నారు. పిల్లలు కథా, విజ్ఞాన పుస్తకాలు చదువుతూ పఠనాభిరుచిని పెంపొందించుకుంటుండగా, చదరంగం వంటి బుద్ధి క్రీడల్లో కూడా పాల్గొంటున్నారు.ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎలక్ట్రీషియన్ టి. సాంబ శివరావు మాట్లాడుతూ చిన్నతనం నుంచే పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలని సూచించారు. పిల్లల్లో పఠనాభిరుచి, ఏకాగ్రత, సృజనాత్మకత పెంపొందించడమే శిబిరం లక్ష్యమని గ్రంథాలయ అధికారి ఈ.జి.ఎస్.వి. కుమార్ తెలిపారు.

## 15వ తేదీ న ఏలూరులో 22ఏ మెగా పరిష్కార మేళా

### జిల్లా ఇంచార్జ్ మంత్రి నాదెండ్ల మనోహర్ ఆధ్వర్యంలో మేళా నిర్వహణ

**ప్రజా భూమి ప్రతినిధి-ఏలూరు జిల్లా**



ఏలూరు కలెక్టరేట్ లోని గోదావరి సమావేశపు హాలులో ఈనెల 15వ తేదీ శుక్రవారం ఉదయం 10 గంటల నుండి '22ఏ మెగా పరిష్కార మేళా' నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ కె. వెట్రి సెల్వి తెలియజేసారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మరియు జిల్లా ఇంచార్జ్ మంత్రి నాదెండ్ల మనోహర్ పాల్గొని, ప్రజల నుండి వినతులను స్వీకరిస్తారన్నారు. సంబంధిత శాఖల అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొంటారని, కావున 22ఏ భూ సమస్యలకు సంబంధించి వినతులను పరిష్కరించుకునేందుకు 22ఏ మెగా పరిష్కార మేళా ను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ వెట్రిసెల్వి ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

## నేడు వట్లూరులో డి ఆర్ డి ఏ ఆధ్వర్యంలో జాబ్ మేళా

**ప్రజాభూమి ప్రతినిధి-పెదపాడు**

ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ,సీడప్, డి. అర్.డి.ఎ అధ్వర్యంలో దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ వారి అధ్వర్యంలో సీడప్ స్కిల్ కాలేజీ, టి.టి.డి.సి, సత్రంపాడు, ఏలూరు జిల్లా నందు 15-05-2026 (శుక్రవారం) న జాబ్ మేళను నిర్వహిస్తున్నట్లు ఏలూరు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి ఎన్. జితేంద్ర బాబు తెలిపారు. ఈ జాబ్ ఫెయిర్ నందు సుమారు 14 కంపెనీ ల ప్రతినిధులు పాల్గొంటరని, అలాగే సుమారు 1020 మంది నిరుద్యోగ యువతీ యువకులకు ఉద్యోగ అవకాశలు కల్పించడం జరుగుతుందన్నారు. ఈ జాబ్ మేళా కు పదవ తరగతి, ఇంటర్, ఐ.టి.ఐ, డిప్లొమా, డిగ్రీ, యమ్.బి.ఎ, పి.జి, బి.టెక్, డి/బి/ఎం ఫార్మసీ వంటి విద్యార్హతలు ఉండి 18-35 సం. వయసు గల వారు అర్హులని తెలియజేశారు. ఇతర వివరాలకు 8184887146, 9502798793 ను (9988853335 - టోల్ ఫ్రీ) ఈ జాబ్ మేళాకు హాజరు అయ్యే అభ్యర్థులు తమ బయడేటా మరియు సర్టిఫికెట్స్ జీరాక్స్ లతో హాజరు కావాలన్నారు.

## జలధార - జలహారతి ద్వారా తామర చెరువు, అమ్మ చెరువులకు పునర్జీవం

### -వందలాది ఎకరాలకు సాగునీరు.

**ప్రజా భూమి ప్రతినిధి-ఏలూరు జిల్లా.**

ఏలూరు జిల్లాలో జలధార - జలహారతి కార్యక్రమం ద్వారా జల సంరక్షణ పనులు వేగం అందుకుంటున్నాయి. కురిసిన ప్రతీ నీటి చుక్కను సద్వినియోగం చేసుకునేలా రాష్ట్ర ప్రభుత్వం 'జలధార జలహారతి' కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ప్రభుత్వ ఆశయాల మేరకు కాల్వలు, చెరువులు, చానెల్స్, డ్రైన్లలో పూడికతీత, అభివృద్ధి పనులను 100 రోజుల్లో చేపట్టి నీటి నిల్వ సామర్థ్యం పెంపొందించేందుకు జిల్లా యంత్రాంగం కృషి చేస్తోంది. దెందులూరు మండలం మసీదుపాడు గ్రామంలోని తామర చెరువు, అమ్మ చెరువులకు జలధార-జలహారతి కార్యక్రమం ద్వారా అభివృద్ధి పనులు చేపట్టారు. తామర చెరువులో పూడిక తీసి, గట్లు పటిష్టం చేయడం వంటి పనులు చేపట్టడంతో నీటి నిల్వ సామర్థ్యం పెరుగుతుంది. దీనిద్వారా పరిసర ప్రాంతాలలోని పొలాలకు సాగునీరు, ప్రజలకు త్రాగునీరు అందించేందుకు వీలు కలుగుతుంది. జలధార-జలహారతి కార్యక్రమం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం తామర చెరువు, అమ్మ చెరువులకు అభివృద్ధి పనులు చేపట్టడంపై మసీదుపాడు గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తూ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

## కేంద్ర ఎన్నికల సంఘం జిల్లా ఎన్నికల అధికారులతో ఇంటెన్సివ్ రివిజన్

**ప్రజా భూమి ప్రతినిధి-ఏలూరు జిల్లా.**



కేంద్ర ఎన్నికల సంఘం ఢిల్లీ నుండి స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్, ఈసీఐ నెట్ పై చీఫ్ ఎలక్షన్ అధికారులు, జిల్లా ఎన్నికల అధికారులతో గురువారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఎన్నికలకు సంబంధించిన అన్ని కార్యకలాపాల కోసం భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) త్వరలో సింగిల్-పాయింట్ యాప్?ను ప్రారంభించనుంది. (ఈసీఐ నెట్) పేరుతో తీసుకురానున్న డిజిటల్ ప్లాట్ ఫారం ద్వారా 40 మొబైల్ అండ్ వెబ్ అప్లికే షన్‌లను ఒకే చోట అందిస్తుంది. ఈసీఐ నెట్ ద్వారా అందించే సేవల వివరాలను కేంద్ర ఎన్నికల సంఘం అధికారులు తెలియజేసారు.ఏలూరు కలెక్టరేట్ నుండి వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా కలెక్టర్ , జిల్లా ఎన్నికల అధికారి కె. వెట్రిసెల్వి, డి ఆర్ ఓ. దేవకీదేవి, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు

## వేసవి శిక్షణ తరగతుల్లో విద్యార్థులకు విజ్ఞానం - చరిత్రపై అవగాహన

**ప్రజా భూమి ప్రతినిధి-ఏలూరు**

బాలల గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా గురువారం విద్యార్థులకు విజ్ఞానం, ఆరోగ్యం, చరిత్రపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ముందుగా గ్రంథాలయ నిర్వాహకురాలు పుస్తక పఠనం కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం రిసోర్స్ పర్సన్‌గా హాజరైన ప్రముఖ న్యాయవాది, ఏ వి ఆర్ విజ్ఞాన కేంద్రం కార్యదర్శి జివిఎల్ నరసింహారావు మాట్లాడుతూ వేసవికాలంలో కూల్ డ్రింక్స్‌కు దూరంగా ఉండాలని సూచించారు.వాటిలో పురుగుమందుల అవశేషాలు ఉండే అవకాశముందని, అవి ఆరోగ్యానికి హానికరమని వివరించారు. విద్యార్థి దశ నుంచే మూఢనమ్మకాలను విడనాడి, శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. భవిష్యత్తులో విద్యార్థులు సైంటిస్టులుగా ఎదిగి దేశాభివృద్ధికి తోడ్పడాలని ఆకాంక్షించారు.అనంతరం విద్యార్థులతో క్యారమ్స్ ఆటలు నిర్వహించగా, విరామ సమయంలో స్నాక్స్ అందించారు. తరువాత పురావస్తు శాఖ టెక్నికల్ అసిస్టెంట్ ఎస్ సత్యవతి ఆధ్వర్యంలో విద్యార్థులకు స్థానిక మ్యూజియంలో ఉచిత ప్రవేశం కల్పించారు. మ్యూజియంలోని చారిత్రక విశేషాలను విద్యార్థులకు సమగ్రంగా వివరించారు. భారత దేశ చరిత్ర ఎంతో పురాతనమైనదని, మన చరిత్రే మన అసలైన సంపదని




పేర్కొన్నారు.భారత చరిత్ర అధ్యయనం కోసం విదేశీయులు సైతం మన దేశానికి వస్తున్నారని తెలిపారు. విద్యార్థులు చరిత్రపై మక్కువ పెంచుకోవాలని సూచించారు.విద్యార్థులు ఎంతో ఆసక్తితో మ్యూజియంలోని విశేషాలను తిలకించారు.ఈ కార్యక్రమంలో గ్రంథాలయ కమిటీ సభ్యులు కారం శెట్టి రమేష్ బాబు, మధ్యాహ్నపు పద్మనాభరావు, గోగు నరసింహారావు, లంకపల్లి చాముండేశ్వరిరావు,వర్రె కొండలరావు పాల్గొన్నారు.గ్రంథాలయ నిర్వాహకురాలు మణిపూరి శోభ ఆధ్వర్యంలో కార్యక్రమం విజయవంతంగా నిర్వహించబడింది.

## నాణ్యమైన ఆహార పదార్థాలు అందించాలి

### న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి శ్రీలక్ష్మి.

**ప్రజా భూమి ప్రతినిధి-ఏలూరు జిల్లా**

రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ అమరావతి వారి ఆదేశాలు ప్రకారం ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి యన్.శ్రీలక్ష్మి శనివారంపేటలోని ప్రభుత్వ బాలుర వసతి గృహాన్ని, శ్రీరామ నగరు ఆరవరోడ్డు లోని సైనిక వెల్ఫేరు ఆఫీసు నందు ఉన్న లీగల్ ఎయిడ్ క్లినిక్ ను, జిల్లా కారాగారాన్ని గురువారం సందర్శించారు. శనివారపేటలోని బాలుర వసతి గృహంలో బాలలకు అందిస్తున్న ఆహార పదార్థాలు నాణ్యత, మంచినీటి సౌకర్యం పరిసరాల పరిశుభ్రత పైన వివరాలు అడిగి తెలుసుకున్నారు. అలాగే అబ్జర్వేషన్ హోమ్ లోని బాలలకు ఉచిత న్యాయ సహాయము పైన అవగాహన కల్పించారు. తదనంతరం శ్రీరామనగరు 6వ రోడ్డులోని సైనిక సంక్షేమ కార్యాలయము నందు ఏర్పాటు చేసిన లీగల్ ఎయిడ్ క్లినికల్ ను సందర్శించి, క్లినిక్ యొక్క పనితీరు మాజీ సైనికులకు అందుతున్న న్యాయ సహాయంపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అవసరమైన పక్షంలో అన్ని పని దినాలలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించవచ్చని తెలియజేశారు.

జిల్లా కారాగారంలోని ఖైదీలకు అందుతున్న సౌకర్యాలుపై వివరాలను అడిగి తెలుసుకున్నారు ఖైదీలతో మాట్లాడుతూ న్యాయవాదిని



నియమించు కోలేని ఖైదీలకు జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఉచిత న్యాయవాదిని నియమించి కేసులను ఉచితముగా వాదించడం జరుగుతుందని, అలాగే వారి కుటుంబ సభ్యులు ప్రభుత్వ సంక్షేమ పథకాలను పొందటంలో సమస్యలు ఎదురైనా అవసరమైన న్యాయ సహాయాన్ని ఉపయోగించుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి నరసింహమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

## తునిలో నేడు "వన్ మంత్ - వన్ విలేజ్ - ఫోర్ విజిట్స్"



**ప్రజాభూమి ప్రతినిధి - కాకినాడ**

"ఒక నెల - ఒక గ్రామం - నాలుగు సందర్శనలు" కార్యక్రమంలో భాగంగా ఈ నెల 15న తుని మండలం ఎంపీడీవో కార్యాలయంలో ప్రజల నుంచి అర్జీలు, వినతులు స్వీకరించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు "ఒక నెల - ఒక గ్రామం - నాలుగు సందర్శనలు" జిల్లాలో ప్రతి శుక్రవారం నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమాన్ని ఈ నెల 15న శుక్రవారం తుని ఎంపీడీవో కార్యాలయంలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు వివిధ ప్రజా సమస్యలపై అర్జీలు స్వీకరించడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమానికి డివిజన్, మండల స్థాయి అన్ని శాఖల అధికారులు 9:30 నిమిషాలకే తుని ఎంపీడీవో కార్యాలయానికి విధిగా చేరుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు.

## దివ్యాంగుల ఆర్థిక స్వావలంబనకే ప్రభుత్వం మొగ్గు: ఎమ్మెల్యే యనమల దివ్య

**ప్రజాభూమి ప్రతినిధి - తుని**

తేటగుంట క్యాంప్ కార్యాలయంలో ప్రభుత్వ విఫ్, తుని ఎమ్మెల్యే యనమల దివ్య ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించబడ్డాయి. విభిన్న ప్రతిభావంతులు ఆర్థికంగా ఎదిగి స్వశక్తితో జీవించాలన్న ఆకాంక్షతో నియోజకవర్గంలోని తొమ్మిది మంది దివ్యాంగులకు లక్షా ఇరవై వేల రూపాయల విలువైన మూడు చక్రాల స్కూటీలను ఆమె పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం దివ్యాంగుల సంక్షేమం కోసం అనేక పథకాలను అమలు చేస్తోందని, ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ



సదుపాయం కల్పించడం అందులో భాగమేనని పేర్కొన్నారు. ప్రభుత్వ ప్రోత్సాహకాలను అందిపుచ్చుకుని దివ్యాంగులు ఆర్థిక స్వావలంబన దిశగా పయనించాలని ఆమె కోరారు. అదేవిధంగా ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఆపదలో ఉన్న నిరుపేదలకు అండగా నిలుస్తూ ఎమ్మెల్యే తన ప్రత్యేకతను చాటుకున్నారు. గత రెండేళ్లలో ఎమ్మెల్యే కృషి ఫలితంగా తుని నియోజకవర్గంలో 391 మంది లబ్ధిదారులు సుమారు 2 కోట్ల 90 లక్షల రూపాయల మేర వైద్య ఖర్చుల నిమిత్తం ఆర్థిక సాయం పొందారు. నేడు జరిగిన కార్యక్రమంలో సీనియర్ నేత యనమల రాజేష్‌తో కలిసి 70 మంది బాధితులకు 31 లక్షల రూపాయల విలువైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. కష్టాల్లో ఉన్న నిరుపేదలను ఆదుకోవడంలో కూటమి ప్రభుత్వం ఎల్లప్పుడూ ముందుంటుందని ఆమె స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ స్థాయి టీడీపీ నాయకులు, వివిధ మండలాల అధ్యక్షులు మరియు ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

## మాదకద్రవ్యాల దుర్వినియోగం, మహిళల భద్రత, సైబర్ నేరాలపై అవగాహన

**ప్రజాభూమి ప్రతినిధి - అయినవిల్లి**

అయినవిల్లి మండలం తొత్తరముడి పెదపాలెం గ్రామంలో అయినవిల్లి పోలీస్ వారు, ఈగల్ డిపార్ట్మెంట్ వారు ఉపాధి హామీ కార్మికులకు మాదకద్రవ్యాల దుర్వినియోగం, మహిళల భద్రత, సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించినారు. ఈ సందర్భంగా అయినవిల్లి ఎస్. ఐ.వై. జ్యోతి మాట్లాడుతూ మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని ఏదయినా సమాచారం ఉంటే 1972 టోల్ ఫ్రీ నంబర్ కు తెలియచేయాలని తెలియచేశారు. అయినవిల్లి ఎస్. ఐ , స్టేషన్ సిబ్బంది, ఈగల్ డిపార్ట్మెంట్ వారు ఉపాధిహామీ కార్మికులు పాల్గొన్నారు.

## మూడో దశ ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణకు కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటన

**ప్రజాభూమి ప్రతినిధి - అమలాపురం**

మూడో దశ ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణకు కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటన జారీ చేసిందని జిల్లా కలెక్టర్ ఆర్. మహేష్ కుమార్ వెల్లడించారు. ఏపీ, తెలంగాణతో పాటు 16 రాష్ట్రాలు, మూడు కేంద్రపాలిత ప్రాంతాల్లో ఈ ప్రక్రియ నిర్వహించనుందన్నారు. తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక, మహారాష్ట్ర, అరుణాచల్ ప్రదేశ్, హరియాణా, ఝార్ఖండ్, మణిపూర్, మేఘాలయ, మిజోరం,



నాగాలాండ్, ఒడిశా, పంజాబ్, సిక్కిం, ఉత్తరాఖండ్, త్రిపుర ఉన్నాయన్నారు. ప్రత్యేక సమగ్ర సవరణకు సహ కరించాలని అన్ని రాజకీయ పార్టీలకు భారత ఎన్నికల సంఘం విజ్ఞప్తి చేసిందన్నారు. ఏపీ లో జూన్ 5 నుంచి 14 వరకు ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ కోసం సిబ్బందికి శిక్షణ ఇవ్వ నున్నారన్నారు. జూన్ 15 నుంచి జులై 14 వరకు సిబ్బంది ఇంటింటికీ వెళ్లి వివరాలను సేకరించినున్నారన్నారు. అనంతరం జులై 21న ఓటర్ల ముసాయిదా జాబితా ప్రకటిస్తార న్నారు. జులై 21 నుంచి ఆగస్టు 20 వరకు అభ్యంతరాలను స్వీకరించనున్నారన్నారు. సెప్టెంబర్ 22న తుది ఓటరు జాబితా ప్రకటి స్తారని జిల్లా కలెక్టర్ ఆర్. మహేష్ కుమార్ ప్రకటనలో తెలిపారు

## ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తమ విద్యాబోధన

- బడి ఈడు చిన్నారులను బడిలోనే చేర్పించండి
- విద్యార్థుల చేరికలపై అధికారుల సమీక్ష సమావేశం

**ప్రజాభూమి ప్రతినిధి - కొత్తపేట**

బడి ఈడు చిన్నారులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించే దిశగా ఎంఈవోలు, ఉపాధ్యాయులు ప్రత్యేక చర్యలు చేపట్టాలని జిల్లా విద్యాశాఖాధికారి పి. నాగేశ్వరరావు, సమగ్ర శిక్షా ఏపీసీ జి. మమ్మీలు పిలుపునిచ్చారు. గురువారం రావులపాలెం ఎంఈవో కార్యాలయ సమావేశ మందిరంలో ఎంఈవోలు ఆర్. నాగకుమార్, బి. శ్రీనివాసరాజుల ఆధ్వర్యంలో విద్యార్థుల చేరికలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. రాష్ట్ర పరిశీలకులు గుమ్మ రమ్యశ్రీ, ఎండ్లూరి ఫణికుమారిలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీఈవో పి. నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల చేరికలు తగ్గుముఖం పడటం వల్ల భవిష్యత్తులో ఉపాధ్యాయ పోస్టులపై ప్రభావం పడే అవకాశముందని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలకు ఎలాంటి కొరతలేదని, తల్లిదండ్రులలో ప్రభుత్వ విద్యపై విశ్వాసం పెంపొందించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. సమగ్ర శిక్షా ఏపీసీ జి. మమ్మీలు మాట్లాడుతూ ప్రతి గ్రామంలో బడి ఈడు పిల్లలను గుర్తించి ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేలా ప్రత్యేక ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్‌లు నిర్వహించాలని సూచించారు. విద్యార్థుల చేరికలను పెంచేందుకు ఉపాధ్యాయులు సమన్వయంతో పనిచేయాలని కోరారు. కె. గంగవరం, రామచంద్రపురం, రావులపాలెం, కొత్తపేట, ఆలమూరు, ఆత్రేయపురం మండలాలకు చెందిన ఎంఈవోలు, క్లస్టర్ ప్రధానోపాధ్యాయులు, సీఆర్‌ఎంటీలు, ఐటీ సిబ్బందితో సమావేశంలో పలు అంశాలపై సమీక్ష నిర్వహించారు. అంతకుముందు రావులపాలెం మండల పరిషత్ మోడల్ ప్రాథమిక పాఠశాల పరిధిలో విద్యార్థుల నమోదు కార్యక్రమాన్ని చేపట్టి, తల్లిదండ్రులకు ప్రభుత్వ పాఠశాలల ప్రాధాన్యతను




వివరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన అవగాహన ర్యాలీ ఆకట్టుకుంది. ర్యాలీలో డీఈవో పి. నాగేశ్వరరావు, రాష్ట్ర పరిశీలకులు గుమ్మ రమ్యశ్రీ, ఎండ్లూరి ఫణికుమారి, డీవైఈవో కడలి వెంకటేశ్వరరావు, సమగ్ర శిక్షా ఏఎంఓ పి. రాంబాబు, ఎఎల్ఎస్సి కోఆర్డినేటర్ రమేష్‌బాబు, ఐఈ కోఆర్డినేటర్ ఎంవీవీ సత్యనారాయణ, జీసీడీవో రమాదేవి, సీఆర్‌ఎంటీలు ఎం. నాగరాజు, ఎం. రాజేంద్ర ప్రసాద్, ఎం. శ్రీనివాస్, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రజాభూమి

కాకినాడ, తూర్పుగోదావరి 5

శుక్రవారం 15, మే 2026

# జయహో చిత్రం పాటను విడుదల చేసిన మంత్రి కందుల దుర్గేష్



- ఓ నాన్న... నువ్వంటే' అంటూ ఎమోషనల్ గా సాగే గీతం విని భావోద్వేగానికి లోనైన మంత్రి కందుల దుర్గేష్
- సామాజిక నేపథ్యంలో చిత్రాన్ని నిర్మించిన టీమ్ కు అభినందన..ఆల్ ది బెస్ట్ చెబుతూ ఈ చిత్రం అఖండ విజయం సాధించాలని ఆకాంక్షించిన మంత్రి దుర్గేష్

ప్రజాభూమి ప్రతినిధి – అమరావతి

నేటి తరానికి సామాజిక సందేశాన్నిస్తూ.. మానవతా, నైతిక విలువలు కథాంశంగా తెరకెక్కుతున్న "జయహో" చిత్రంలోని 'ఓ నాన్న... నువ్వంటే' అంటూ ఎమోషనల్ గా సాగే గీతాన్ని మంత్రి కందుల దుర్గేష్ గురువారం సచివాలయంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా సీనియర్ జర్నలిస్ట్ నేతాజీ కొడియార్ ఆధ్వర్యంలో జయహో చిత్ర టీమ్ మంత్రి కందుల దుర్గేష్‌ను సచివాలయంలోని ఛాంబర్‌లో కలవగా ఆయన వెంటనే స్పందించి ఆ పాటను విని భావోద్వేగానికి లోనయ్యారు. ఈ సందర్భంగా చిత్ర బృందాన్ని అడిగి సినిమా వివరాలు తెలుసుకున్నారు. యువతరానికి మంచి సందేశాన్నిస్తూ నిర్మాణాత్మక విలువలతో రూపొందిస్తున్న సినిమాను ప్రతి ఒక్కరూ తప్పకుండా చూడాలని కోరారు. తాను విన్న ఓ నాన్న... నువ్వంటే పాట తన మనసును హత్తుకుందన్నారు. ఇలాంటి చిత్రాలు మరిన్ని రావాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. సోషల్ మీడియా ప్రభావం, ఫోన్ అడిక్షన్, డ్రగ్స్, మద్యం వంటి చెడు అలవాట్లతో పెడదోవ పడుతున్న నేటి యువత భవిష్యత్ కోసం, వాళ్ళ కలల సాకారం కోసం, తల్లిదండ్రులను, గురువులను గౌరవించాలని అంతర్లీనంగా చెబుతూ మంచి సందేశాత్మక చిత్రాన్ని అందించే ప్రయత్నం చేసిన నంది అవార్డు గ్రహీత, దర్శకుడు దుద్యాల కోటేంద్రను ప్రత్యేకంగా అభినందించారు. గతంలో అనితా ఓ అనితా అంటూ విరహ గీతంతో ఫేమస్ అయి, రైల్వే ట్రాక్ అనే ఫీచర్ ఫిల్మ్‌తో నంది అవార్డు అందుకున్న దర్శకుడు దుద్యాల కోటేంద్రను ప్రత్యేకంగా ప్రశంసించారు. చిత్రంలో సీనియర్ నటి ఇంద్రజ లీడ్ రోల్‌లో నటిస్తున్నారని, జయ సూర్య పిక్చర్స్ బ్యానర్‌పై డి.జయ పామమ్మ నిర్మాతగా రూపొందుతున్న ఈ సినిమా అఖండ విజయం సాధించాలని ఆకాంక్షించారు. ఇప్పటికే రెండు షెడ్యూల్స్ ను పూర్తి చేసుకున్న ఈ సినిమా... తదుపరి షెడ్యూల్ ను ఈనెల చివరి వారం నుంచి మొదలు పెట్టనుందని చిత్ర యూనిట్ తెలిపారు. ఏపీలోని నంద్యాలలో షూటింగ్ జరుపుకుంటున్న ఈ చిత్రానికి, అదే విధంగా ఆంధ్రప్రదేశ్ లో చిత్రీకరించే సినిమాలకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఖచ్చితంగా సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని భరోసానిచ్చారు. ఈ సందర్భంగా మూవీ యూనిట్ కు బెస్ట్ విషెస్ తెలియజేశారు.

## రత్నగిరిపై 'చల్లని' సేవలు

- అన్నవరం భక్తులకు మజ్జిగ, తాగునీరు పంపిణీ
- వేసవి తాపం దృష్ట్యా దేవస్థానం ప్రత్యేక ఏర్పాట్లు



ప్రజా భూమి(అన్నవరం) – ప్రత్తిపాడు

రత్నగిరి సత్యదేవుని దర్శనార్థం వచ్చే భక్తులకు వేసవి తాపం నుండి ఉపశమనం కలిగించేందుకు దేవస్థానం యంత్రాంగం ప్రత్యేక చర్యలు చేపట్టింది. భానుడి భగభగలతో ఇబ్బంది పడుతున్న యాత్రికుల కోసం కొండపై ప్రధాన ప్రాంతాల్లో చల్లటి మజ్జిగ, తాగునీటి పంపిణీని ముమ్మరం చేసింది.

**క్యూలైన్లలోనే దప్పిక తీర్చి :** స్వామివారి దర్శనం కోసం క్యూలైన్లలో గంటల తరబడి వేచి ఉండే భక్తులు ఉక్కపోతకు గురికాకుండా సిబ్బంది ఎప్పటికప్పుడు చల్లటి మజ్జిగను అందజేస్తున్నారు. అలాగే గోశాల ప్రాంగణం, సర్కులర్ మండపం, ఉత్తర గోపురం ఎదురుగా ఉన్న షెడ్డు వద్ద భక్తుల రద్దీని బట్టి తాగునీటి కేంద్రాలను ఏర్పాటు చేశారు.

**అన్నదానంలో ప్రత్యేక వసతి :** నిత్య అన్నదాన పథకంలో భోజనం చేసే భక్తులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా భోజనశాలలో చల్లని మంచినీటిని సిద్ధంగా ఉంచుతున్నారు. ఎండ తీవ్రత దృష్ట్యా భక్తుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. రత్నగిరిపై ఎక్కడ చూసినా భక్తులకు చల్లని నీరు అందుబాటులో ఉండేలా పర్యవేక్షిస్తున్నామని వారు పేర్కొన్నారు.

## ఏలూరు అభివృద్ధికి భారీ నిధులు... మంత్రి నారాయణతో ఎమ్మెల్యే బడేటి చంటి భేటీ

ప్రజాభూమి – ఏలూరు



ఏలూరు నియోజకవర్గ అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని రాష్ట్ర మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, అర్బన్ డెవలప్‌మెంట్ శాఖ మంత్రి పొంగూరు నారాయణను ఎమ్మెల్యే బడేటి చంటి అమరావతిలో కలిసి పలు అంశాలపై చర్చించారు. టిడ్కో గృహాల కోసం డిడిల ద్వారా చెల్లించిన సొమ్మును లబ్దిదారులకు తిరిగి ఇవ్వాలని ఎమ్మెల్యే కోరగా, మంత్రి సానుకూలంగా స్పందించారు. ఈ నెల 16న చెక్కుల రూపంలో లబ్దిదారులకు నగదు పంపిణీ చేయనున్నారు. అలాగే టిడ్కో గృహాల నిర్మాణ పనులు వేగవంతం చేయాలని అధికారులకు మంత్రి ఆదేశాలు జారీ చేశారు. రోడ్ల అభివృద్ధి కోసం ఈడా ద్వారా ఏలూరు కార్పొరేషన్‌కు రూ. 5 కోట్లు మంజూరు చేయగా, ఎన్-క్యాప్ నిధుల కింద మరో రూ. 6.5 కోట్లు విడుదలకు ఆమోదం లభించింది. ఈడా లే-అవుట్ల సమస్యల పరిష్కారంపై కూడా మంత్రి జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి త్వరిత చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సందర్భంగా సహకరించిన మంత్రి నారాయణకు ఎమ్మెల్యే బడేటి చంటి ధన్యవాదాలు తెలిపారు.

## ఉప్పాడ కొత్తపల్లి మండల రైతులకు ఆయిల్ పామ్ సాగు వైపు ఆకర్షణ





- ఉద్యాన శాఖ ప్రోత్సాహకాలు
- పతంజలి ఫుడ్స్ లిమిటెడ్ ప్రత్యేక సహకారం

ప్రజాభూమి బ్యూరో – కాకినాడ

కాకినాడ జిల్లా ఉప్పాడ కొత్తపల్లి మండలంలోని రైతులు సంప్రదాయ వరి సాగుకు ప్రత్యామ్నాయంగా అధిక ఆదాయం అందించే ఆయిల్ పామ్ సాగు వైపు ముందుకు రావాలని ఉద్యాన శాఖ అధికారులు, సంస్థ ప్రతినిధులు పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం ఆయిల్ పామ్ విస్తరణకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ పలు రకాల సబ్సిడీలు, ప్రోత్సాహకాలు అందిస్తున్న నేపథ్యంలో రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రస్తుతం వరి సాగులో పెరుగుతున్న సాగు ఖర్చులు, నీటి కొరత, కార్మిక వ్యయాలు రైతులను ఆర్థికంగా ఇబ్బందులకు గురిచేస్తున్నాయని పేర్కొన్నారు. ఈ పరిస్థితుల్లో తక్కువ నిర్వహణ వ్యయంతో దీర్ఘకాలిక స్థిర ఆదాయం అందించే ఆయిల్ పామ్ సాగు రైతులకు లాభదాయకమైన ప్రత్యామ్నాయ పంటగా మారుతుందని తెలిపారు. ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీలు మరియు కంపెనీ సహకారంతో ఆయిల్ పామ్ సాగు భవిష్యత్తులో రైతులకు ఆర్థిక భద్రత కల్పించే పంటగా మారుతుందని ఉద్యాన అధికారి వై.సోమ రాజశేఖర్ వివరించారు. ముఖ్యంగా నీటి వనరులు అందుబాటులో ఉన్న రైతులు వరి పంటకు బదులుగా కొంత భూమిలో అయినా ఆయిల్ పామ్ సాగు చేపట్టాలని సూచించారు. రైతుల ప్రోత్సాహార్థం ముందస్తు చెల్లింపులు లేకుండా నాణ్యమైన విదేశీ రకం ఆయిల్ పామ్ మొక్కలను ఉచితంగా సరఫరా చేస్తోందని వెల్లడించారు. అదనంగా, ఉప్పాడ కొత్తపల్లి మండలానికి ప్రత్యేక ఫీల్డ్ స్థాయి సిబ్బందిని నియమించి రైతులకు సాగు పద్ధతులు, ఎరువుల వినియోగం, నీటి నిర్వహణ, తెగుళ్ల నివారణ తదితర అంశాలలో నిరంతర సాంకేతిక మార్గదర్శకత్వం అందిస్తున్నట్లు పతంజలి క్లస్టర్ ఆఫీసర్ కామేష్ తెలిపారు. ఈ సందర్భంగా ఆసక్తి ఉన్న రైతులు తమ పరిధిలోని ఫీల్డ్ అధికారులను కానీ సచివాలయం సచివాలయం సిబ్బందిని కానీ సంప్రదించి నమోదు చేసుకోవాలని కోరారు. ఉప్పాడ కొత్తపల్లి మండలంలో ఆయిల్ పామ్ విస్తరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి రైతులందరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

## అన్నార్తుల చెంతకు.. 'అన్నా' క్యాంటీన్!

- రూ.5లకే కడుపునిండా భోజనం
- ఏజెన్సీ పేదలకు లభిస్తున్న ఊరట
- ప్రభుత్వ నిర్ణయంపై గిరిజనుల హర్షం



ప్రజాభూమి – రంపచోడవరం

ఆకలితో అలమటించే పేదల పాలిట 'అన్నా' క్యాంటీన్లు కల్పవల్లిలా మారుతున్నాయి. పోలవరం జిల్లా కేంద్రమైన రంపచోడవరంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన అన్నా క్యాంటీన్ ద్వారా ఎంతో మంది గిరిజనులు, నిరుపేదల ఆకలి తీరుతోంది. మారుమూల గ్రామాల నుంచి వివిధ పనుల నిమిత్తం జిల్లా కేంద్రానికి వచ్చే వారికి ఐదు రూపాయలకే రుచికరమైన భోజనం లభిస్తుండటంతో వారు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. పేదలకు ఆర్థిక భారం తప్పింది. బయట హోటళ్లలో భోజనం చేయాలంటే సామాన్యులకు భారం అవుతున్న తరుణంలో, నాణ్యమైన ఆహారాన్ని తక్కువ ధరకే అందించడంపై ప్రజల నుంచి ప్రశంసలు వ్యక్తమవుతున్నాయి. రాజవొమ్మంగికి చెందిన లక్ష్మి అనే మహిళ మాట్లాడుతూ.. "ప్రస్తుత రోజుల్లో బయట భోజనం చాలా ఖరీదైపోయింది. కానీ ఇక్కడ కేవలం ఐదు రూపాయలకే శుభ్రమైన, రుచికరమైన భోజనం పెడుతున్నారు. ఇది మాలాంటి పేదలకు ఎంతో అండగా ఉంది" అని తెలిపారు. ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రికి కృతజ్ఞతలురంపచోడవరం మండలానికి చెందిన శ్రీను మాట్లాడుతూ.. రోజువారీ పనుల కోసం పట్టణానికి వచ్చే కూలీలకు, గిరిజనులకు అన్నా క్యాంటీన్ ఆర్థిక భారాన్ని తగ్గిస్తోందన్నారు. పేదల ఆకలి తీరుస్తున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌లకు తాము రుణపడి ఉంటామని గిరిజనులు పేర్కొంటున్నారు.

## టౌన్ హాల్ అధ్యక్షుడిగా రాధాకృష్ణ



ప్రజాభూమి ప్రతినిధి – పాలకొల్లు

పాలకొల్లు పట్టణ టౌన్ హాల్ అధ్యక్షుడిగా ప్రముఖ హైకోర్టు న్యాయవాది పోలిశెట్టి రాధాకృష్ణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు ఎన్నికల అధికారి పిల్లా బాలాజీ ఒక ప్రకటనలో తెలిపారు. కార్యదర్శిగా కాజ సొసైటీ చైర్మన్ పంజా నరసింహారావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ట్రెజరర్ గా కంచర్ల మాణిక్యం, జాయింట్ సెక్రటరీగా గుణ్ణం వెంకటరత్నం నాయుడు, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా ఆడబాల సూర్యచంద్రరావు, చింత సోమయ్య, ద్వారంపూడి వెంకట సూర్యనారాయణ రెడ్డి, అబ్బిరెడ్డి వెంకట నాగేశ్వరరావు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు తెలిపారు.

## రైతు సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయం.. దెందులూరులో పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ



ప్రజా భూమి ప్రతినిధి – పెదవేగి

దెందులూరు నియోజకవర్గ రైతాంగ సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోందని శాసనసభ్యులు చింతమనేని ప్రభాకర్ స్పష్టం చేశారు. గురువారం దుగ్గిరాలలోని తన క్యాంపు కార్యాలయంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ కార్యక్రమాన్ని ఆయన లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని పలువురు రైతులకు ఆయన స్వయంగా విత్తన బస్తాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ మాట్లాడుతూ.. రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించి, భూసారాన్ని పెంచుకోవడంలో పచ్చిరొట్ట ఎరువులైన జనుము, పిల్లిపెసర వంటివి ఎంతో కీలమని తెలిపారు. వీటి సాగు వల్ల భూమికి అవసరమైన నత్రజని లభిస్తుందని, తద్వారా దిగుబడులు పెరుగుతాయని రైతులకు వివరించారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తక్కువ ఖర్చుతో నాణ్యమైన పంటలు పండించాలని కోరారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు నియోజకవర్గవ్యాప్తంగా అన్ని రైతు సేవ కేంద్రాల్లో విత్తనాలు అందుబాటులో ఉంచుతామన్నారు. ఈ విత్తనాల పంపిణీలో ఎటువంటి జాప్యం కలగకుండా చూడాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అదనపు డైరెక్టర్ హబీబ్ భాషా, అదనపు డైరెక్టర్ అనీల కుమారి సహా పలువురు వ్యవసాయ అధికారులు, కూటమి నాయకులు, రైతులు పాల్గొన్నారు..

## జనగణన బాధ్యతగా నిర్వహించాలి : ఎంపీడీవో రాంబాబు



ప్రజాభూమి ప్రతినిధి – కాజులూరు

ప్రభుత్వం ప్రతిష్టాత్మంగా చేపడుతున్న జనగణన ప్రతి ఒక్కరు బాధ్యతగా నిర్వహించాలని కాజులూరు ఎంపీడీవో జె. రాంబాబు సూచించారు. ఈ మేరకు గురువారం కాజులూరు మండలం చేదువాడ గ్రామపంచాయతి నందు జరుగుతున్న జనగణన ను మండల పరిషత్ అభివృద్ధి అధికారి రాంబాబు పర్యవేక్షించి సిబ్బందికి తగు సూచనలు జారి చేశారు. అదే విధంగా సెన్సస్, యు ఎఫ్ ఎస్ సర్వే ను త్వరిత గతిన పూర్తి చేయాల్సిందిగా సచివాలయం సిబ్బందికి ఆదేశములు జారి చేసారు. అనంతరం స్వర్ణ గ్రామ స్వర్ణ వార్డు డిపార్టుమెంటు నుండి మండలంలో 20 సచివాలయములకు మంజూరైన యూపీఎస్లను ఆయా పంచాయతీలకు ఎంపీడీవో రాంబాబు చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటి యం.పి.డి.ఒ యం. సత్యనారాయణ మూర్తి,మండల పరిషత్ కార్యాలయ పరిపాలనా అధికారిణి ఆర్. పద్మలత , పంచయతి సిబ్బంది , తదితరులు పాల్గొన్నారు..

## యాభై సంవత్సరాలు దాటిన బీసీ లకు పింఛన్లు ఇవ్వాలి

### యాట్ల నాగేశ్వరరావు



ప్రజాభూమి ప్రతినిధి – రామచంద్రపురం

50 సంవత్సరాలు దాటిన బీసీలకు పింఛన్లు మంజూరు చేయాలని రామచంద్రపురం నియోజకవర్గ ఎంబీసీ సంఘం అధ్యక్షులు యాట్ల నాగేశ్వరరావు కోరారు. ఈ మేరకు ఆయన గురువారం మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండు సంవత్సరాలు దాటినప్పటికీ నేటి వరకు కొత్త పింఛన్ ఇస్తారని వృద్ధులు, దివ్యాంగులు,వితంతులు , యాభై సంవత్సరాలు దాటిన బీసీ కులాలకు చెందిన అర్హులైన పింఛనుదారులు వెయ్యి కళ్ళతో ఎదురు చూస్తున్నారని పేర్కొన్నారు . ఇప్పటి వరకూ కొత్త పింఛన్ ఊసే లేదని నియోజకవర్గం ఎం.బి.సి సంఘం అధ్యక్షుడు యాట్ల నాగేశ్వరరావు అన్నారు. కనీసం ఇప్పటి వరకూ కొత్త పింఛన్ దరఖాస్తులు కూడా స్వీకరించలేదని కొంతమంది ఆశావాహులు జిల్లా కలెక్టర్ కార్యాలయాలకు తమ దరఖాస్తులను అందజేస్తున్నారని పేర్కొన్నారు .మరి కొంతమంది అయితే గ్రామ సచివాలయాలు చుట్టూ తిరుగుతున్నారని అయితే ప్రభుత్వం నుండి ఎటువంటి స్పందన లేదని ఈ సందర్భంగా ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ యాభై సంవత్సరాలు దాటిన ప్రతీ బీసీ కి పింఛన్ ఇస్తా నని చెప్పిన హామీని తక్షణం అమలు చేయాలని ఈసంధర్భంగా నాగేశ్వరరావు డిమాండ్ చేశారు.

## హెల్మెట్‌తో సుఖమయ పర్యాయాన్ని సాగించండి

### పెదపాడు ఎస్సై ఆర్, శ్రీను



ప్రజాభూమి ప్రతినిధి – పెదపాడు

ఏలూరు జిల్లా పెదపాడు మండలం 16 నెంబర్ జాతీయ రహదారి కలపర్రు టోల్గేట్ వద్ద పెదపాడు ఎస్సై ఆర్ శీను ఆధ్వర్యంలో వాహన దారులకు హెల్మెట్ వాడకంపై అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా హెల్మెట్ లేని వాహనం దారులకు హెల్మెట్ కొనుగోలు చేయించి ధరింపజేసి ప్రయాణం చేయడం వల్ల కలిగే ప్రజా ప్రయోజనాలు ఉపయోగాలను వివరిస్తున్నారు. వాహనదారులు తమ ప్రయాణాల్లో తప్పనిసరిగా హెల్మెట్ ని ఉపయోగించి అనుకోని ప్రమాదాల సంభవించినప్పుడు ప్రాణాపాయ స్థితిలో ఏ విధంగా లబ్ధిని పొందాలో తెలియజేస్తున్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది వాహనదారులు తదితరులు పాల్గొన్నారు.

## శరభవరం 'ఆరోగ్య మందిర్'కు జాతీయ గుర్తింపు

- ఎన్‌క్యూఏఎస్ తనిఖీల్లో 83.13 శాతం మార్కులు
- హర్షం వ్యక్తం చేసిన వైద్యాధికారిణి సుష్మ



ప్రజాభూమి – రాజవొమ్మంగి

మండల పరిధిలోని శరభవరం ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ జాతీయ స్థాయిలో సత్తా చాటింది. నాణ్యమైన వైద్య సేవలు అందిస్తున్నందుకు గాను ఈ కేంద్రం 'నేషనల్ క్వాలిటీ అస్సూరెన్స్ స్టాండర్డ్స్' (చీూఖూ) గుర్తింపును సాధించింది. గత నెల ఏప్రిల్ 2న నిర్వహించిన తనిఖీల్లో ఈ కేంద్రం 83.13 శాతం స్కోరును సాధించి క్వాలిటీ సర్టిఫికెట్‌ను కైవసం చేసుకుంది.సమిష్టి కృషితోనే విజయం:పోలవరం జిల్లా వైద్యాధికారిణి (ఖవీడఝా) డాక్టర్ సరిత గారి పర్యవేక్షణలో ఈ అరుదైన గుర్తింపు రావడం పట్ల రాజవొమ్మంగి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారిణి డాక్టర్ సుష్మ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నాణ్యమైన వైద్య సేవలు, రికార్డుల నిర్వహణ, రోగులకు కల్పిస్తున్న వసతుల ఆధారంగా జాతీయ బృందం ఈ మార్కులను కేటాయించిందని తెలిపారు.సిబ్బందికి అభినందనలు:ఈ విజయంలో కీలక పాత్ర పోషించిన టీమ్ లీడర్ డాక్టర్ రాకేష్, సీహెచ్ఓ (జఝా), హెల్త్ సూపర్వైజర్లు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు మరియు పురుష హెల్త్ అసిస్టెంట్లకు డాక్టర్ సుష్మ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. సమిష్టి కృషితోనే శరభవరం ఆరోగ్య కేంద్రం జాతీయ ప్రమాణాలను అందుకోగలిగిందని ఆమె పేర్కొన్నారు.

## బైక్‌ను ఢీకొట్టిన కారు.. వ్యక్తికి తీవ్ర గాయాలు



ప్రజాభూమి ప్రతినిధి – ఆగిరిపల్లి

ఆగిరిపల్లి మండలం సింగన్నగూడెం గ్రామ పరిధిలోని ఎస్.ఎస్. రెస్టారెంట్ సమీపంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో జువ్వనబోయిన గోపి (35) తీవ్రంగా గాయపడ్డారని పోలీసులు తెలిపారు. పోలీసుల వివరాల ప్రకారం.. గోపి తన బైక్ నెం. ఇూ16ఖూ/7 ు/= 7879పై ఆగిరిపల్లి నుంచి విజయవాడ వైపు వెళ్తుండగా, ఎదురుగా వచ్చిన కారు నెం. AP16DZ3675 అతివేగంగా, నిర్లక్ష్యంగా వచ్చి బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో గోపికి తీవ్ర గాయాలు కావడంతో వెంటనే విజయవాడలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. గోపికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారని, ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.

ప్రజాభూమి
వైఎస్ఆర్ కడప, శ్రీ అన్నమ్మయ్య 7
శుక్రవారం 15 మే 2026

# ఆర్డీవో సాక్షిగా ఇరు పార్టీ కార్యకర్తల మధ్య వివాదం

## బాధితులకు న్యాయం చేయాలి...వైకాపా - ఆ భూమి తమది .....టిడిపి



ప్రజాభూమి,పులివెందుల

పులివెందుల ఆర్డీవో కార్యాలయంలో ఆర్డిఓ సాక్షిగా వైకాపా టిడిపి కార్యకర్తల మధ్య వివాదం చోటు చేసుకుంది. ఈ వివాదంలో ఒకరినొకరు దూషించు కోవడంతో ఆర్డీవో కార్యాలయంలో ఉద్రిక్తత పరిస్థితి చోటుచేసుకుంది. పట్టణంలోని పార్నపల్లె రోడ్డు కోతి సమాధి సమీపంలో 2014 సంవత్సరంలో పేద ప్రజలకు స్థలాన్ని కేటాయించి అప్పట్లో డి పట్టాను అందజేశారు. దీంతో ప్రజలు ఆ స్థలంలో బేస్ మట్టం లను నిర్మించుకున్నారు. అయితే టిడిపి నాయకుడు ఆ భూమి తమది అంటూ బేస్ మట్టం లను జెసిబి సాయంతో తొలగిస్తామని చెప్పడంతో బాధితులు ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి వద్ద తమ గోడును వెల్లబుచ్చుకున్నారు. ఎంపీ ఆదేశాల మేరకు వైకాపా నాయకులు బాధితులతో కలిసి ఆర్డిఓ కార్యాలయంలో ఆర్డిఓ చిన్నయ్యకు వినతి పత్రం అందజేసేందుకు వెళ్లడంతో ఈ విషయం తెలుసుకున్న తెలుగుదేశం పార్టీ నాయకు లు భూమికి సంబంధించిన పత్రాలను తీసుకొని ఆర్డిఓ కార్యాలయం చేరుకున్నారు. దీంతో ఆర్డీవో సమక్షంలోనే ఇరు పార్టీ కార్యకర్తలు ఒకరినొకరు దూషించుకోవడంతో ఘర్షణ వాతావరణం చోటు చేసుకుంది. ఈ విషయం తెలుసుకున్న ఎస్ఐలు మధుసూదన్ రెడ్డి, తిమోతి లు సిబ్బందితో కలిసి ఆర్డీవో కార్యాలయం చేరుకొని ఇరువర్గాలకు సర్ది చెప్పి అక్కడి నుంచి పంపించి వేశారు. ఈ వార్త పట్టణంలో దావనంల వ్యాపించడంతో వైకాపా నాయకులు ఆర్డీవో కార్యాలయానికి చేరుకున్నారు. ఎప్పుడు ఏం జరుగుతుందో అని అధిక అధికారు లు భయబ్రాంతులకు గురయ్యారు.



**డి పట్టాలను పరిశీలించి, సర్వే చేయించి న్యాయం చేస్తాం**

ఆర్డీవో కార్యాలయంలో ఇరు పార్టీల మధ్య వివాదం చోటు చేసుకోవడంతో ఆర్డీవో చిన్నయ్య స్పందించారు. 2014 సంవత్సరంలో పార్నపల్లి రోడ్డు కోతి సమాధి వద్ద స్థలం కేటాయించి అప్పట్లో డి పట్టాలు అందజేశారని,అయితే ఆ భూమి తమదే అంటూ తెలుగుదేశం పార్టీకి చెందిన ఒక వ్యక్తి తమకు భూమికి సంబంధించిన పత్రాలను అందజే శారని ఆర్డీవో చిన్నయ్య తెలిపారు. ముందుగా భూమికి సంబంధించిన పత్రాలను కూడా పరిశీలి స్తామన్నారు. అలాగే డి పట్టాలను పరిశీలించి ఆ పట్టాలు ఒరిజినల్ అయితే సర్వే చేయించి కచ్చితంగా న్యాయం చేస్తామని ఆయన తెలిపారు.

# సిద్ధవటంలో వైద్య సిబ్బంది ఇంటింటా సర్వే

## -వ్యక్తిగత పరిశుభ్రతతోనే వైరల్ జ్వరాలకు అడ్డుకట్ట

ప్రజాభూమి, సిద్ధవటం: మండల కేంద్రమైన సిద్ధవటంలో వైరల్ జ్వరాల నివారణపై వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేక దృష్టి సారించింది. ఈ మేరకు గురువారం సిద్ధవటం పరిధిలోని ఎగువపేట, బ్రాహ్మణ వీధి, బీసీ కాలనీ, మెయిన్ బజార్, మరియు దిగువపేటలోని ఆకుల వీధి వంటి పలు ప్రాంతాలలో వైద్య సిబ్బంది విస్తృతంగా ఇంటింటా సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా మలేరియా సబ్ యూనిట్ అధికారి ఇండ్ల సుబ్బరాయుడు మాట్లాడుతూ, వైరల్ జ్వరాల పట్ల ప్రజలు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతను



విధిగా పాటిస్తే జ్వరాలు దరిచేరవని ఆయన స్పష్టం చేశారు. ముఖ్యంగా గృహాల చుట్టూ మురుగునీరు, వర్షపు నీరు నిల్వ లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. నీరు నిల్వ ఉంటే దోమల లార్వా ఉత్పత్తి పెరిగి, వ్యాధు లు వేగంగా ప్రబలే అవకాశం ఉందన్నారు. వైరల్ ఫీవర్ బారిన పడిన వారిలో తీవ్రమైన జ్వరం, ఒళ్ళు నొప్పులు, మరియు జలుబు వంటి లక్షణాలు కనిపిస్తాయని, అలాంటి వారు వెంటనే వైద్యులను సంప్రదించాలని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల ప్రజలు పరిశుభ్రతపై మరింత అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఈ ముందస్తు నివారణా చర్యల కార్యక్రమంలో పి.కొత్తపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య అధికారి డాక్టర్ రంగలక్ష్మి, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ లక్ష్మీనరసమ్మ, హెల్త్ సూపర్వైజర్లు గట్టుపల్లి వెంకటసుబ్బయ్య, శారదా దేవి పాల్గొన్నారు. అలాగే ఆరోగ్య కార్యకర్తలు అంజనమ్మ, శారద, మరియు ఆశా వర్కర్ ఓబులమ్మ తదితర వైద్య బృందం సభ్యులు పాల్గొని ప్రజలకు అవగాహన కల్పించారు.

# మన కడప -- స్వచ్ఛ కడప.. మన పరిసరాల పరిశుభ్రత మన బాధ్యత

## కడప మున్సిపల్ అడిషనల్ కమిషనర్ రాకేష్ చంద్ర

ప్రజా భూమి,కడప సిటీ:

గురువారం ఉదయం కడప నగరపాలక మున్సిపల్ అడి షనల్ కమిషనర్ రాకేష్ చంద్ర ఆధ్వర్యంలో 36వ డివిజన్లో మన కడప స్వచ్ఛ కడప అనే సంకల్పంతో కడపనగరపాలక సంస్థ ఆధ్వర్యంలో నగర పరి శుభ్రతను మరింత బలోపేతం చేయుటకు వినూత్న కార్యక్ర మంగా మెగా మాస్ గ్యాంగ్ వర్క్ నిర్వహించబడింది. ఈ సందర్భంగా సుమారు 100 మంది పారిశుద్ధ్య కార్మికులను ఒకేచోట సమీకరించి,ఒక వా ర్డు పరిధిలోని ప్రధాన రహదా రులు,కాలనీలు, అంతర్గత వీ ధులు,డ్రైనేజీలు,ఖాళీ ప్రదేశా లు తదితర ప్రాంతాలలో సమ గ్ర పరి శుభ్రత కార్యక్ర మాలు నిర్వహించబడినవి. ప్రత్యేకంగా చెత్త పేరుకుపోయిన ప్రదే శాలు,డ్రైనేజీ వ్యవస్థలు,బహిరంగంగా చెత్త వేయబడు తున్న ప్రాంతాలను గుర్తించి, యంత్రాలు, మానవ వనరులను వినియోగించి వేగవంత గా శుభ్రపరిచే చర్యలు




చేపట్ట డం జరిగింది. ఈ కార్యక్రమం ద్వారా తక్కువ సమయంలో గరిష్ట స్థాయిలో పరిశుభ్రత సాధించడం ప్రధాన ఉద్దేశం గా నిర్ణయించబడింది. ఘన వ్యర్థాల నిర్వహణలో భాగంగా తడి చెత్త,పొడి చెత్త వేరు చే యుట యొక్క ప్రాముఖ్యతపై ప్రజలకు అవగాహన కల్పించబడింది. ఈ సందర్భంగా గృహా లకు గ్రీన్,బ్లూ కలర్ డస్ట్ బిన్లు పంపిణీ చేయబడినవి. తడి చే త్తను గ్రీన్ బిన్లో,పొడి చెత్తన బ్లూ బిన్లో వేయవలసిందిగా సూచనలు అందించబడినవి. కమిషనర్ ఈ సందర్భంగా మాట్లాడుతూ,నగర పరిశు భ్ర తలో ప్రజల భాగస్వామ్యం అత్యంత కీలకమని,ప్రతి పౌర డు తన పరిసరాలను శుభ్రంగ ఉంచుకోవడం ద్వారా మాత్ర మే స్వచ్ఛ కడప లక్ష్యం సాధ్య మవుతుందని,ఈ దిశగా నగ రంలోని అన్ని వార్డులలో ఈ మెగా మాస్ గ్యాంగ్ వర్క్ కార క్రమాలను దశలవారీగా నిర్వ హించి,నగరవ్యాప్తంగా పరిశు భ్రతను మరింత మెరుగుపర చడానికిచర్యలుచేపడతామని తెలియజేశారు. ఈ



కార్య క్రమంలో మున్సిపల్ హెల్త్ ఆఫీసర్, నగరపాలక సంస్థ అధికారులు, సిబ్బంది, పారిశుద్ధ్య కార్మికులు, స్థానిక ప్రజ లు పాల్గొన్నారు.

# భక్తిశ్రద్ధలతో షిరిడి సాయిబాబాకి విశేష పూజలు

## ప్రత్యేక అలంకారంలో సాయినాధుడు -ఆలయ అభివృద్ధికి సహకరించండి

ప్రజాభూమి,పులివెందుల

పులివెందుల పట్టణంలోని పార్నపల్లి రోడ్డు సమీపం లో మొట్టమొదటిగా కొలువైన శ్రీ షిరిడి సాయి బాబా ఆలయంలో గురువారం విశేష పూజలు నిర్వహించారు. ఉదయాస్తమాన స్వామివారికి ఆలయ ప్రధాన అర్చకులు మురళి స్వామి ఆధ్వర్యంలో సాయినాధునికి ఉదయం కాగడ హారతి, పంచామృతాభిషేకం, సహస్రనామార్చన, అష్టోత్తర శతనామావళి, తదితర పూజా కార్యక్ర మాల అనంతరం స్వామి వారు ప్రత్యేక అలంకారం లో భక్తులకు దర్శనమిచ్చారు . మధ్యాహ్నం 12 గంటలకు మధ్యాహ్నం హారతి సాయంకాలం 6 గంటలకు సంధ్య హారతి రాత్రి 9 గంటలకు శేజ హారతులు స్వామివారికి అర్పించారు. ఈ సందర్భం గా ఆలయ చైర్మన్ శ్రీరామ సుబ్బయ్య మాట్లాడు తూ ప్రతి గురువారం ఆలయంలో భక్తుల సహాయ సహకారాలతో అన్నదాన కార్యక్రమాలు విశేషంగా నిర్వహించడం జరుగుతుందని అందులో భాగంగా ప్రతి గురువారం పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారికి మొక్కులు చెల్లించుకోవడం జరుగుతోందని తెలియజేశారు.

**ఆలయ అభివృద్ధికి సహకరించండి**

ఆలయ ప్రాంగణంలో ఆలయ అభివృద్ధిలో భాగంగా కళ్యాణ మండపం గదులు వంటి నిర్మాణా లు చేపట్టడం జరుగుతుంది ఎవరైనా దాతలు ముందుకు వచ్చి షిరిడి సాయి బాబా ఆలయ అభివృద్ధికి సహకరించాలని ఆలయ చైర్మన్ శ్రీరామ సుబ్బయ్య పిలుపునిచ్చారు. సహాయ సహకారా లు అందించిన దాతల పేర్లు ఆలయంలో శిలా ఫలకం వేయించి శాశ్వతంగా ఉండే విధంగా చర్య లు చేపడతారని, ప్రతి సంవత్సరం గురు పౌర్ణమి లో దాతలకు విశేష పూజలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.



అనంతరం ఆలయ నిర్వాహకులు ఏర్పాటుచేసిన తీర్థ ప్రసాదాలను భక్తులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో షిరిడి సాయి సేవ సమితి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రశ్నిస్తే కేసులు పెడతారా?

## కూటమి ప్రభుత్వం చేస్తున్న అనైతిక చర్యలను వైఎస్ఆర్సిపి పూర్తిగా ఖండిస్తుంది

## బీసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొట్లూరు సుదర్శన్

ప్రజాభూమి,పులివెందుల

గ్రామ పంచాయతీలకు కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.1,120 కోట్లు ఎలా ఖర్చు చేశారు! ఆ నిధులను పంచాయతీలకే మళ్ళించారా?? అని ప్రశ్నించిన వైఎస్ఆర్సిపి నాయకుల మీద కేసులు పెట్టడం ఎందుకు అని ప్రశ్నిస్తే కేసులు పెడతారా అని బిసి జిల్లా ప్రధాన కార్యదర్శి కొట్లూరు సుదర్శన్ అన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వచ్చిన ఆ నిధులను దేనికి మళ్ళించామన్నది చెబితే సరిపోయేది కదా అన్నారు. ప్రతి రూపాయికి లెక్కలు చెబుతాం, జవాబు దారీతనానికి పెద్దపీట వేస్తామని కాకినాడలో జనవాహిని కార్యక్రమంలో పవన్ కళ్యాణ్ చేసిన వ్యాఖ్యలు నిజం కాదా అని ప్రశ్నించారు. పంచాయతీ రాజ్ శాఖకు సంబంధిం చిన నిధులు చెప్పాల్సిన బాధ్యత ఆ శాఖ మంత్రికి ఉంది కదా అన్నారు. ఈ విషయాన్ని మరింత సాగదీస్తే నిజంగానే అవినీతి జరిగిందని ప్రశ్న ప్రజల్లో ఉత్పన్నమవుతుంది అని ఆయన అన్నారు. ప్రభుత్వము ప్రతిపక్ష నాయకుల మీద అక్రమ కేసులు పెట్టడం జరుగుతుందా లేక ఈ ప్రశ్నలకు ప్రభుత్వం సమాధానం చెప్పాల్సిన అవసరం లేదు అనే ఒక నియంత్రత్వ ధోరణితో అవలంబిస్తుందా అన్నారు. ఈ నిధులు ఏమయ్యాయి? దీనికి ప్రభుత్వం ఎందుకు సమాధానం చెప్ప లేకపోతోంది అనే చర్చ అందరిలోనూ జరుగుతుం ది అన్నారు. ఇలా కేసులు పెట్టడం చూస్తుంటే ప్రభుత్వం ఈ నిధులను ఏమి చేశామన్నది చెప్పలేక ఇలా ప్రశ్నించిన వారిని అణచివేస్తుంది అని అర్థమవుతుందన్నారు . ఇది తప్పు కదా అనే ప్రశ్న రాష్ట్ర ప్రజలలో ఉత్పన్నమవుతుందిఅన్నారు. అందుచేత ప్రభుత్వానికి ఒక విన్నపం ఏమిటి అంటే .కేంద్రం నుండి ఆ నిధులు వచ్చాయా లేదా అన్నది చెప్పండి చాలు అన్నారు..ఒకవేళ వస్తే ఆ నిధులు ఏమి చేశామన్నదిఒక్క మాట చెప్పండి సరిపోతుంది అన్నారు.మేము ఊరందరినీ ప్రశ్నిస్తాం... మమ్మల్ని ప్రశ్నించిన వారిని లోపల వేస్తాం అంటే ఎలామిమ్మల్ని ప్రశ్నించిన ప్రతి ఒక్కరి ని లోపల వేస్తే ప్రశ్నలు ఎలా ఆగిపోతాయి అన్నారు. ఇదే ప్రశ్న మరొకరు వేస్తారు లక్షల మంది వేస్తారు,ఎంత మందిని లోపల వేస్తారు మీరు అని ప్రశ్నించారు. ఇదే ప్రశ్న ఏదో ఒకనాడుమేము ఇచ్చిన డబ్బులు ఏమయ్యాయి, ఎక్కడ ఖర్చు పెట్టారు అని కేంద్రం కూడా మీకు ప్రశ్న వేసే రోజులు వస్తా యన్నారు .ఈ విషయాన్ని మీరు మర్చిపోతే ఎలా, కూటమి ప్రభుత్వం చేస్తున్న అనైతిక చర్యలను వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పూర్తిగా ఖండిస్తుందని అన్నారు.




### గంగమ్మను దర్శించుకున్న హైకోర్టు న్యాయమూర్తి ధనశేఖర్

ప్రజా భూమి ప్రతినిధి సత్యవేడు.



సత్యవేడు పట్టణంలోని గంగ మిట్ట వద్ద మహిషాసుర మర్దిని స్వరూపంగా కొలువుతీరిన గంగమ్మను రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి ధనశేఖర్ దర్శించుకున్నారు. గంగ జాతరను పురస్కరించుకుని గురువారం స్థానిక జ్యుడీషియల్ కోర్టు న్యాయమూర్తి వెంకటనాగరాజు వెంట రాగా హైకోర్టు న్యాయమూర్తి ధనశేఖర్ కుటుంబ సభ్యులతో కలిసి గంగమిట్ట వద్దకు చేరుకున్నారు. ఈ నేపథ్యంలో ఉత్సవ కమిటీ సభ్యులు అడ్వకేట్ గోపీనాథ్ న్యాయమూర్తికి ఘన స్వాగతం పలికారు. అనంతరం న్యాయమూర్తి ధనశేఖర్ కుటుంబ సభ్యులతో కలిసి అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. తదనంతరం ఉత్సవ కమిటీ సభ్యులు గోపీనాథ్ న్యాయమూర్తికి అమ్మవారి చిత్రపటాన్ని అందించారు.

# బ్రెయిన్ స్ట్రోక్‌తో మంచానపడ్డ బేల్దారి కార్మికుడు

## మానవత్వం చాటుకున్న 'మనఊరికోసం' స్వచ్ఛంద సంస్థ



ప్రజాభూమి, సిద్ధవటం: మండలంలోని మాధవరం-1 గ్రామ పంచాయతీ పరిధిలోని రామక్రిష్ణాపురం గ్రామానికి చెందిన బేల్దారి కార్మికుడు బత్తల మట్టహన్ మూడు నెలల క్రితం బ్రెయిన్ స్ట్రోక్‌కు గురయ్యారు. చికిత్స కోసం కుటుంబ సభ్యులు దాదాపు రూ.7 లక్షల వరకు అప్పులు చేసినా ఫలితం లేకపోయింది. మరింత వైద్యం చేయించడానికి ఆర్థిక శక్తి లేక, అప్పు పుట్టక మట్టహన్ తల్లి నడిపమ్మ, భార్య పార్వతీ కన్నీరుమున్నీరవుతున్నారు. బాధిత కుటుంబ పరిస్థితిని తెలుసుకున్న 'మనఊరికోసం' స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు మానవత్వంతో స్పందించారు. దాతల సహకారంతో రూ.18,000 విరాళాలు సేకరించి, అందులో రూ.5,500 విలువైన నిత్యావసర, రూ.12,500 నగదును బాధిత కుటుంబానికి అందజేశారు. ఈ సందర్భంగా సంస్థ చైర్మన్ అవ్వారు రవిశంకర్ మాట్లాడుతూ.. అనారోగ్యంతో బాధపడుతున్న ఈ నిరుపేద కుటుంబాన్ని ఆదుకోవడానికి మరికొంత మంది దాతలు ముందుకు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు పుత్తా సుధీర్ రాయల్, సామల చెంగయ్య, టి. పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

# భాకరాపేటలో నిలిచిన మురుగునీరు

## రెండు రోజుల్లో సమస్య పరిష్కరిస్తాం

ప్రజాభూమి, సిద్ధవటం: మండలంలోని భాకరాపేట గ్రామంలో కడప-చెన్నై జాతీయ రహదారి పక్కన డ్రైనేజీ పూడికతో మురుగునీరు స్తంభించిపోయింది. దీనివల్ల తీవ్ర దుర్వాసన వస్తోందని, అంటురోగాలు ప్రబలే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. స్పెషల్ ఆఫీసర్ తక్షణమే స్పందించి ఈ సమస్యను పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు. ఈ విషయమై పంచాయతీ సెక్రటరీ సుధీర్ వివరణ ఇస్తూ.. మురుగునీరు నిలిచిన మాట వాస్తవమేనని అంగీకరించారు. చిరు వ్యాపారులు, ప్రజలు ప్లాస్టిక్ వ్యర్థాలను డ్రైనేజీలో వేయడం వల్లే ఈ సమస్య తలెత్తిందని ఆయన పేర్కొన్నారు. స్పెషల్ ఆఫీసర్ సహకారంతో పారిశుద్ధ్య కార్మికులను రంగంలోకి దించి, రెండు రోజుల్లో సమస్యను పూర్తిగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ప్రజలు కూడా చెత్తను డ్రైనేజీల్లో వేయకుండా సహకరించాలని ఆయన కోరారు



# క్షయ వ్యాధిపై ఆందోళన వద్దు

## మాస్కులు ధరించి, జాగ్రత్తలు పాటించాలి

ప్రజాభూమి, సిద్ధవటం: క్షయ వ్యాధి పట్ల ప్రజలు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, సరైన జాగ్రత్తలు, సలహాలు పాటిస్తే ఈ వ్యాధి దరిదాపుల్లోకి రాదని వైద్య సిబ్బంది స్పష్టం చేశారు. సిద్ధవటం మండలంలోని వెలుగుపల్లి గ్రామంలో గురువారం 'ముక్త భారత్ అభియాన్', క్షయ వ్యాధి నిర్మూలన అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పి.కొత్తపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ రంగలక్ష్మి మాట్లాడుతూ.. క్షయ వ్యాధి సోకిన రోగులు తుమ్మినప్పుడు వచ్చే తుంపర్ల ద్వారా ఈ వైరస్ ఇతరులకు వ్యాప్తి చెందే ప్రమాదం ఉందన్నారు. ముఖ్యంగా రైల్వే స్టేషన్లు, బస్టాండ్లు, దేవాలయాలు, చర్చిలు వంటి జనసమర్థం ఉన్న ప్రాంతాలలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా మాస్కులు ధరించాలని ఆమె సూచించారు. క్షయ వ్యాధి నిర్మూలనలో భాగంగా ప్రజలకు ఉచితంగా ఎక్స్‌రే పరీక్షలు చేయిస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు. అనంతరం మలేరియా సబ్ యూనిట్ అధికారి ఇండ్ల సుబ్బరాయుడు మాట్లాడుతూ.. టిబి వ్యాధి సోకే విధానం, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై గ్రామస్తులకు వివరించారు. వ్యాధి సోకిన రోగులు మంచి పౌష్టికాహారం తీసుకుంటూ, క్రమం తప్పకుండా ఆరు నెలల పాటు వైద్యుల పర్యవేక్షణలో చికిత్స పొందితే క్షయ వ్యాధి పూర్తిగా నయమవుతుందని తెలిపారు. ప్రజలు అనవసరంగా భయపడకుండా ఆరోగ్య సూత్రాలు పాటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సుబ్బారెడ్డి, సిహెచ్ఓ లక్ష్మీనరసమ్మ, హెల్త్ సూపర్వైజర్లు వెంకటసుబ్బయ్య, శారదా దేవి, ఆరోగ్య కార్యకర్తలు శారద, అంజనమ్మ మరియు ఆశా వర్కర్లు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.




# పంపు సెట్టు మార్చి రైతులకు సాగునీరు అందించాలి

**- ఇన్‌చార్జ్ మంత్రి సవితకు మండల కన్వీనర్ రామముని రెడ్డి వినతి**

ప్రజాభూమి, వేంపల్లె



మండలంలోని నెలవరం తాండ సమీపంలో ఉన్న పంపు సెట్టును మాలవంక వద్దకు మార్చి రైతులకు సాగునీటి ఇబ్బందులు తొలగించాలని కడప జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి, జౌళి శాఖ మంత్రి సవితకు టిడిపి మండల కన్వీనర్ రామముని రెడ్డి, టిడిపి ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు రాజా నాయక్, టౌన్ క్లస్టర్ ఇన్‌చార్జ్ మహమ్మద్ ఇనాయతుల్లా లు కలిసి వినతిపత్రం అందజేశారు. గురువారం విజయవాడలో మంత్రిని కలిసి పలు సమస్యలను ఆమె దృష్టికి తీసుకెళ్లారు. ముచ్చుకొన చెరువుకు నీటి సరఫరా సక్రమంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రస్తుతం పంపు సెట్టు నెలవరం తాండ వద్ద ఉండటంతో కాలువల ద్వారా నీటి పంపింగ్‌కు ఇబ్బందులు ఏర్పడుతున్నాయని తెలిపారు. దీంతో రైతులకు సాగునీరు, ప్రజలకు తాగునీటి సమస్యలు ఎదురవుతున్నాయని వివరించారు. నెలవరం తాండ నుంచి మాలవంక వరకు సుమారు 200 మీటర్ల పైప్‌లైన్ ఏర్పాటు చేసి, మాలవంక వద్ద పంపు సెట్టు ఏర్పాటు చేస్తే ముచ్చుకొన చెరువుకు సులభంగా నీటి సరఫరా అవుతుందని తెలిపారు. అలాగే మండలంలోని గ్రామాల్లో సిమెంట్ రోడ్లు, ఇతర మౌలిక వసతుల అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని కోరారు. సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చినట్లు రామముని రెడ్డి తెలిపారు.

# మార్కెట్ యార్డులో చోరీ

ప్రజాభూమి,పులివెందుల



పట్టణంలోని మార్కెట్ యార్డులో ఉన్న రూమ్ నెంబర్ 2 వెంకటేశ్వర మండిలో బీరువా పగలగొట్టి బీరువాలో ఉన్న 30వేల నగదును దోచుకెళ్లినట్లు మండి యజమాని రమణారెడ్డి తెలిపారు. మార్కెట్ యార్డ్‌లో అర్ధరాత్రి కూడా చీనా కాయలు అన్లోడ్ చేస్తుంటారు. మండీలకు తాళాలు కూడా వేయకపోవడంతో మండీలో ఉన్న బీరువాను రాడ్ల సహాయంతో పగలకొట్టి బీరువాలో ఉన్న 30వేల నగదును దుండగులు దోచుకెళ్లారు. తెల్లవారు జామున చోరీ జరిగిన సంఘటన తెలుసుకొని మండి యజమాని రమణారెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. తెలిసిన వ్యక్తుల చేసిన పనే అని కొందరు వ్యాపారస్తులు అంటున్నారు ఏదేమైనాప్పటికీ విచారణలో తెలియాల్సి ఉంది.

ప్రజాభూమి
తిరుపతి,చిత్తూరు 8
శుక్రవారం 15 మే 2026

# గంగమ్మను దర్శించుకున్న కూరపాటి శంకర్ రెడ్డి దంపతులు

ప్రజా భూమి ప్రతినిధి సత్యవేడు.





తిరుపతి జిల్లా సత్యవేడులో గంగ జాతర సందర్భంగా పట్టణంలోని గంగ మిట్ట వద్ద మహిషాసుర మర్దిని అవతారంలో భక్తులకు దర్శనమిస్తున్న గంగమ్మను నియోజకవర్గ టిడిపి ప్రోగ్రాం కోఆర్డినేటర్ కూరపాటి శంకర్ రెడ్డి దంపతులు దర్శించుకున్నారు. గురువారం మధ్యాహ్నం ఒక గంట సమయం లో టిడిపి మండల అధ్యక్షులు శివకుమార్ నాయుడు,జడ్పిటిసి విజయలక్ష్మి చంద్రశేఖర్ రెడ్డి,నాగలాపురం వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మురళి( చికెన్ చిన్న ) మోహన్ రెడ్డి,సునీల్ జైన్ తదితరులు వెంటరాగా కూరపాటి శంకర్ రెడ్డి దంపతులు గంగమ్మను దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఈ నేపథ్యంలో అర్చకులు గంగమ్మకు పూజలు చేసి అమ్మవారి గాజులను,పండ్లు పుష్పాలను శంకర్ రెడ్డి సతీమణికి అందించారు. ఈ క్రమంలో గంగ జాతర ఉత్సవ కమిటీ సభ్యులు అడ్వకేట్ గోపీనాథ్ కూరపాటి శంకర్ రెడ్డి ఇతర టిడిపి నాయకులను పూలమాలతో సత్కరించి అమ్మవారి చిత్రపటాలను అందించారు. సంస్కృతి సాంప్రదాయాలకు గంగ జాతర అద్దం పడుతుందని, ఐక్యతకు కూడా ఇది సంకేతకంగా నిలుస్తుందని ఈ సందర్భంగా టిడిపి నియోజకవర్గ ప్రోగ్రాం కోఆర్డినేటర్ కూరపాటి శంకర్ రెడ్డి తెలియజేశారు.

# పరిశుభ్రత మనందరి బాధ్యత

## -ఇంచార్జి కమిషనర్ శారదా దేవి

ప్రజాభూమి ప్రతినిధి తిరుపతి



మన ఇంటితో పాటు నగరాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత మనందరిడి ఖఅఱ నగరపాలక సంస్థ ఇంచార్జి కమిషనర్ శారదా దేవి అన్నారు. గురువారం ఉదయం నగర పాలక సంస్థ పరిధిలోని ఉపాధ్యాయ నగర్, అక్కరాంపల్లి నలంద స్కూల్, మారుతి నగర్ తదితర ప్రాంతాల్లో పారిశుధ్య పనులను పరిశీలించారు. నగరంలో పరిశుభ్రత పెంచడం, ప్రజల ఆరోగ్యాన్ని కాపాడుకోవడం మనందరి బాధ్యత ఖఅఱ తెలిపారు. నగరంలోని ఖాళీ స్థలాల్లో చెత్త వేస్తున్నారని దీని పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. కాలువల్లో, బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయడం వలన అపరిశుభ్రత ఎక్కువవుతోందని తెలిపారు. భవన నిర్మాణ వ్యర్థాలు వేయకుండా తగు చర్యలు తీసుకోవాలని తెలిపారు. త్రాగునీరు కలుషితం కాకుండా చర్యలు చేపట్టాలని తెలిపారు. ఇంచార్జి కమిషనర్ వెంట సర్వేయర్ కోటేశ్వరరావు, టీపీఓ వంశీ, స్వర్ణ వార్డు కార్యదర్శులు, తదితరులు ఉన్నారు.

# ది స్కూల్ బస్సులను తనిఖీ చేసిన మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్

ప్రజా భూమి ప్రతినిధి
:శ్రీకాళహస్తి




పట్టణంలోని ది స్కూల్ బస్సులను గురువారం శ్రీకాళహస్తి మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ బి.దామోదర నాయుడు తనిఖీ చేశారు. వచ్చే విద్యా సంవత్సరానికి గాను బస్సుల కండీషన్లు, ఫిట్ నెస్ , సంబంధిత పత్రాలను పరిశీలించారు. విద్యార్థులకు సంబంధించిన బస్సులను విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని మేనేజ్మెంట్ కు తెలిపారు. విద్యార్థులతో కూడిన బస్సులు నడిపే  సమయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని డ్రైవర్లకు సూచించారు. రాబోవు విద్యా సంవత్సరానికి వేసవి సెలవుల్లోనే బస్సుల కండీషన్లు, రిపేర్లు పట్ల మేనేజ్మెంట్ జాగ్రత్త వహించాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ బి. దామోదర నాయుడు, వారి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# బడుగుజీవిపై బడావ్యాపారి దాష్టీకం 'రోడ్డు'న పడ్డ ఒంటరి మహిళ జీవితం

ప్రజా భూమి ప్రతినిధి వరదయ్యపాలెం.

వరదయ్యపాళెం మండలం లోని బస్టాండ్ ఆవరణలో దుకాణం భర్త మరణంతో నా అన్నవారు లేక, రోడ్డు పక్కన పండ్లు అమ్ముకుంటూ జీవనాధారంగా సాగిస్తున్న ఓ బడుగు మహిళపై బడా రియల్ ఎస్టేట్ వ్యాపారి దాష్టీకంతో ఆమె బతుకు 'రోడ్డున' పడింది. అర్ధరాత్రి వేళ ఓ



రియల్ ఎస్టేట్ వ్యాపారి అధికారుల అండగా దౌర్జన్యంగా బాధిత ఎస్సీ మహిళకు చెందిన పండ్ల దుకాణపాకను జేసీబీతో ధ్వంసం చేసి, నేలమట్టం చేయడంతో వేలాది రూపాయల విలువ గల పండ్లు నేలపాలైంది. బాధితురాలి కథనం మేరకు వరదయ్యపాళెం ఎస్సీకాలనీకి చెందిన జయంతి అనే మహిళ కొన్నేళ్ల కిందట భర్త మరణించడంతో, మరో గత్యంతరం లేక రోడ్డు పక్కన పంచాయతీ దుకాణాల కాంప్లెక్సు వద్ద దాదాపు 20 ఏళ్లుగా ఓ చిన్న కొట్టు పెట్టుకుని పండ్లు అమ్ముకుంటూ జీవనాధారంగా చేసుకుని తన కుమార్తెను, కుటుంబాన్ని పోషిస్తోంది. పంచాయతీ కాంప్లెక్సు వెనుక ఓ సంపన్నురాలికి చెందిన వ్యవసాయభూములను రియల్ ఎస్టేట్ ప్లాట్లుగా విక్రయించేందుకు భూఅభివృద్ధి పనులను కాంట్రాక్టు తీసుకున్న ఓ రియల్ ఎస్టేట్ వ్యాపారి దారి అడ్డుగా ఉందనే నెపంతో ఆర్అండ??బ స్థలంలో పండ్ల కొట్టు నడుపుకుంటున్న ఎస్సీమహిళ జయంతికి చెందిన పండ్ల కొట్టును రాత్రికి రాత్రి జేసీబీతో నేలమట్టం చేయడంపై ఆమె జీవితం రోడ్డున పడింది. దారికి తన కొట్టు అడ్డులేకపోయినా, ముందస్తు సమాచారం లేకుండా ఆర్అండ్ స్థలంలో ఉన్న కొట్టును కూల్చడానికి రియల్ ఎస్టేట్ వ్యాపారికి అధికారం ఎక్కడదని ఆమె ప్రశ్నిస్తున్నా, పట్టించుకునే నాథుడు లేడు. ఆ రియల్ ఎస్టేట్ వ్యాపారికి చెందిన గృహసముదాయ భవనంలోనే ఓ పోలీస్ అధికారి నివాసం ఉండటం, ఆ వ్యాపారికి పోలీసులు అండదండ ఉండటంతోనే ఈ దాష్టీకానికి ఒడిగట్టాడని బాధితులు తమ గోడును ఎవరికి చెప్పుకోవాలో తెలియక కన్నీరు పెట్టుకుని మౌనవేదన అనుభవిస్తున్నారు.

# ఏపీ,ఆర్,జేసీ ప్రవేశ పరీక్షలో జువ్వల జస్విత్ రెడ్డి ఘన విజయం

## ఈఈటీ గ్రూప్‌లో రాష్ట్రస్థాయిలో 33వ ర్యాంక్ - పట్టుదల, క్రమశిక్షణతో విజయ శిఖరాలను అధిరోహించిన విద్యార్థి

ప్రజాభూమి ప్రతినిధి రేణిగుంట.



కష్టపడే తత్వం, లక్ష్యసాధనపై అచంచల నమ్మకం, తల్లిదండ్రుల ప్రోత్సాహం, ఉపాధ్యాయుల మార్గదర్శకత్వం ఉంటే విద్యార్థులు ఎంతటి విజయాలనైనా సొంతం చేసుకోవచ్చని మరోసారి నిరూపించాడు జువ్వల జస్విత్ రెడ్డి. ఆంధ్రప్రదేశ్ రెసిడెన్షియల్ జూనియర్ కాలేజీ (ఏ.పి.ఆర్.జె.సి) ప్రవేశ పరీక్ష–2026లో అద్భుత ప్రతిభ కనబరిచి ఈఈటీ గ్రూప్‌లో రాష్ట్రస్థాయిలో 33వ ర్యాంక్ సాధించి గర్వకారణంగా నిలిచాడు. రేణిగుంట మండలం గాజులమండ్యం గ్రామానికి చెందిన జువ్వల దయాకర్ రెడ్డి కుమారుడైన జస్విత్ రెడ్డి చిన్నప్పటి నుంచే చదువుపై ప్రత్యేక ఆసక్తి కనబరుస్తూ ప్రతిభావంతుడిగా గుర్తింపు పొందాడు. తరగతి గదిలోనే కాకుండా పోటీ పరీక్షల్లో కూడా రాణించాలని లక్ష్యంగా పెట్టుకుని క్రమశిక్షణతో చదువుకుంటూ ఈ విజయాన్ని అందుకున్నాడు. ఏ.పీ.ఆర్.జె.సి ప్రవేశ పరీక్ష రాష్ట్రవ్యాప్తంగా ఎంతో పోటీతో కూడుకున్న పరీక్షగా గుర్తింపు పొందింది. ప్రతి సంవత్సరం వేలాది మంది విద్యార్థులు ఈ పరీక్షకు హాజరవుతుంటారు. అలాంటి పోటీ వాతావరణంలో రాష్ట్రస్థాయిలో 33వ ర్యాంక్ సాధించడం సాధారణ విషయం కాదని ఉపాధ్యాయులు పేర్కొంటున్నారు. ముఖ్యంగా ఈఈటీ గ్రూప్‌లో జస్విత్ సాధించిన ర్యాంక్ కుటుంబ సభ్యులు, బంధువులు, ఉపాధ్యాయులు, స్నేహితుల్లో ఆనందోత్సాహాలు నింపింది. అతని విజయాన్ని తెలుసుకున్న స్థానికులు అభినందనలతో ముంచెత్తుతున్నారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు మాట్లాడుతూ జస్విత్ చిన్నప్పటి నుంచే చదువుపై ఎంతో శ్రద్ధ చూపేవాడన్నారు. సమయపాలన, క్రమశిక్షణతో చదువుకుంటూ ఎప్పుడూ మంచి ఫలితాలు సాధించేవాడు అని తెలిపారు. ఇప్పుడు రాష్ట్రస్థాయిలో ర్యాంక్ సాధించడం కుటుంబానికి ఎంతో గర్వకారణం అని ఆనందం వ్యక్తం చేశారు. ఉపాధ్యాయులు మాట్లాడుతూ జస్విత్ చాలా మృదుస్వభావి, క్రమశిక్షణ కలిగిన విద్యార్థి. తరగతిలో ఎప్పుడూ చురుకుగా పాల్గొంటూ ప్రతి అంశాన్ని అర్థం చేసుకునేందుకు ఆసక్తి చూపేవాడు. అతని పట్టుదలే ఈ విజయానికి ప్రధాన కారణం అని ప్రశంసించారు. విద్యార్థి విజయానికి తల్లిదండ్రుల ప్రోత్సాహం, ఉపా ధ్యాయుల సహకారం కూడా ముఖ్య కారణమని పలువురు అభిప్రాయపడ్డారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులు కూడా సరైన దిశలో కష్టపడితే రాష్ట్రస్థాయిలో ప్రతిభ చాటగలరని జస్విత్ విజయం మరోసారి నిరూపించిందన్నారు. స్థానికులు మాట్లాడుతూ ఇలాంటి విద్యార్థులు రేణిగుంట ప్రాంతానికి మంచి పేరు తీసుకువస్తున్నారు. భవిష్యత్తులో ఇంకా ఉన్నత స్థాయికి చేరుకొని సమాజానికి సేవ చేయాలని ఆకాంక్షించారు. జస్విత్ రెడ్డి మాట్లాడుతూ ఈ విజయానికి కారణమైన తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో ఇంకా కష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఉందని వినయంగా స్పందించాడు. అతని విజయం తెలుసుకున్న స్నేహితులు, బంధువులు, స్థానికులు ఇంటికి చేరుకుని అభినందనలు తెలిపారు. మిఠాయిలు పంచుకొని ఆనందాన్ని వ్యక్తం చేశారు. పట్టుదల ఉంటే అసాధ్యం అనేది ఉండదు అనే మాటకు జస్విత్ రెడ్డి నిలువెత్తు ఉదాహరణగా నిలిచాడని పలువురు పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో మరింత ఉన్నత విజయాలు సాధించి కుటుంబానికి, రేణిగుంట ప్రాంతానికి, రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని అందరూ ఆశీర్వదిస్తున్నారు.

# నాగలాపురం మండలంలో రూ.1.57 కోట్లతో 68 జల సంరక్షణ పనులు

- నీటి సంరక్షణ పనులతో మండలంలోని 3,612 ఎకరాలకు సాగునీటి లబ్ధి
- వెంబాకం, కొట్టాకాడు, నాగలాపురం, రాజులకండ్రిగ, సదాశివ శంకరాపురం పంచాయితీ రైతులకు సాగునీటి ప్రయోజనం
- జలధార--జలహారతితో రైతులకు రెట్టింపు ప్రయోజనం





ప్రజా భూమి ప్రతినిధి తిరుపతి.

ఎండలతో నిర్జీవమైన నేల పై వర్షపు చినుకు పడితే ఎలా జీవం మేల్కొంటుందో . . ఇప్పుడు జలధార--జలహారతి పనులతో తిరుపతి జిల్లా గ్రామాల్లో అదే దృశ్యం కనిపిస్తోంది. పూడికతీతతో మళ్లీ ఊపిరి పీల్చుకుంటున్న కాలువలు, నిండుకుండలా మారే చెరువులు, పెరుగుతున్న భూగర్భ జలాలు రైతు జీవితాల్లో కొత్త ఆశల విత్తనాలు నాటుతున్నాయి. ప్రతి నీటి బొట్టును భవిష్యత్తుకు భద్రపరిచే లక్ష్యంతో ప్రభుత్వం చేపట్టిన ఈ పనులు గ్రామీణ ప్రాంతాలకు సాగునీరు, ఉపాధి, ఆనందాన్ని ఒకేసారి అందిస్తున్నాయి. నాగలాపురం మండలంలో జలధార -- జలహారతి కార్యక్రమం క్రింద 1 కోటి 57 లక్షల రూపాయల అంచనా వ్యయంతో 68 పనులకు పరిపాలనా ఉత్తర్వులు జారీ చేశారు. ఇందులో 26 ఫీడర్ కాలువల పునరుద్ధరణ, 20 పీల్డ్ కాలువల పునరుద్ధరణ 6 చెక్ డ్యాంలలో పూడికతీత పనులు, 5 చెరువులలో పూడికతీత, 5 కందిత కందకాల నిర్మాణం, 6 నీటి కుంటలలో పూడికతీత పనులు చేపట్టనున్నారు. ఈ పనుల ద్వారా మండలంలోని 3,262 ఎకరాలకు లబ్ది కలగనుంది. నాగలాపురం మండలంలోని రాజులకండ్రిగ గ్రామ పంచాయితీలో 60 మంది ఉపాధి హామీ వేతనదారులతో 1,000 మీటర్ల పొడవు, 3.0 మీటర్ల వెడల్పు వంక నుండి రాజులకండ్రిగ చెరువు, 50 మంది ఉపాధి హామీ వేతనదారులతో 1,000 మీటర్ల పొడవు, 3.0 మీటర్ల వెడల్పు



అల్లపగుంట మిట్ట నుండి వజ్జవారికండ్రిగ చెరువు పూడికతీత పనులను రూ.5,17,519/- అంచనా విలువతో చేపడుతున్నారు. అటవీ ప్రాంతంలో కురిసే వర్షపు నీరు ఈ కాలువ ద్వారా రాజులకండ్రిగకు వెళ్తుంది. ఈ కాలువ పనులు చేపట్టడం ద్వారా రాజులకండ్రిగ పంచాయితీతో పాటు జానికాపురం, అనామతుకండ్రిగ, వజ్జవారికండ్రిగ ప్రాంతాలలోని రైతుల భూములకు సాగు నీరు అందనుంది. తద్వారా ఈ ప్రాంతంలో రైతులు సాగు చేస్తున్న వేరుశనగ, మామిడి, వరి పంటలకు నీరు సమృద్ధిగా చేకూరుతుంది. చెరువు పరిధిలో 250 ఎకరాలకు సాగునీరు, 35 బోర్లు, 10 బావుల్లో భూగర్భ జలాల పెరుగుదల రాజులకండ్రిగ ఉపాధి హామీ వేతనదారుడు మాధవరాజు మాట్లాడుతూ జలధార–జలహారతి పథకం క్రింద తమ గ్రామంలో వంక నుండి రాజులకండ్రిగ చెరువు కాలువ పనులను చేస్తున్నామన్నారు. అల్లపగుంట మిట్ట నుండి వజ్జవారికండ్రిగ చెరువు వరకు ఈ కాలువ పని కొనసాగి రాజులకండ్రిగ చెరువులోకి ఈ నీరు చేరుతుందన్నారు. ఈ చెరువు క్రింద 250 ఎకరాల భూములకు సాగు నీరు, 35 బోర్లు, 10 బావులలో భూగర్భ జలాలు పెరిగి వ్యసాయానికి మేలు కలుగుతుందన్నారు. ఈ పని చేపట్టడం వలన రైతులందరికీ మేలు జరగడంతో పాటు నీటి ఎద్దడి ఏర్పడకుండాఉంటుందన్నారు. ఈ పథకం ద్వారా తమకు ఉపాధి కల్పించే పనులు కల్పిస్తున్న భారత ప్రధాని నరేంద్ర మోడీ కి, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు.కి, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ గారికి ధన్యవాదాలు తెలిపారు.

**వేసవిలో వలసలు తగ్గించి గ్రామాల్లోనే ఉపాధి అవకాశాలు కల్పిస్తున్న ప్రభుత్వం**

రాజులకండ్రిగ ఉపాధి హామీ వేతనదారురాలు దివ్య మాట్లాడుతూ ఈ కాలువ పనులు చేపట్టడం ద్వారా రైతుల బోర్లు, బావులలో నీటి మట్టాలు పెరిగి వ్యవసాయం చేసుకునేందుకు ఎంతో దోహదపడుతుందన్నారు. అంతేకాకుండా పశువులు, గొర్రెలు, మేకలు లాంటి జీవాలకు త్రాగు నీటి కొరత కూడా తీరుతుందన్నారు. ఈ పని ద్వారా తమకు రోజుకు రూ.307/- వరకు వేతనం లభిస్తోందని ఆమె తెలిపారు. వేసవి కాలంలో బయట ప్రాంతాలకు వలస వెళ్ళకుండా ఉన్న ఊరిలోనే ఉపాధి కల్పించినందుకు ప్రధాన మంత్రికి, రాష్ట్ర ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలిపింది.  వర్షపు నీటి ప్రతి చుక్కను భూమి ఒడిలో దాచే జలధార -- జల హారతి పనులు గ్రామీణ జీవితాలకు కొత్త ఆశలను నింపుతున్నాయి. పూడికతీతతో మళ్లీ పరవళ్ళు తొక్కే కాలువలు, నిండుకుండలా మారే చెరువులు రైతు పొలాలకు జీవధారగా మారుతున్నాయి. ఉపాధితో గ్రామాలకు చిరునవ్వులు చేకూరుతుండగా, పెరుగుతున్న భూగర్భ జలాలు భవిష్యత్ తరాలకు భరోసానిస్తున్నాయి.

# ప్రజానేతకు జన్మదిన శుభాకాంక్షలు

- వేలాది కుటుంబాలలో వెలుగులు నింపిన జననాయకా
- వర్ధిల్లు నిండు నూరేళ్ళ
- అభివృద్ధి కార్యక్రమాలతో ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేసిన నాయకుడు
- నేడు మాజీ శాసనసభ్యులు బియ్యపు మధుసూదన్ రెడ్డి జన్మదిన వేడుకలు



ప్రత్యేక కథనం
పెరిమిడి రఘు ప్రజాభూమి శ్రీకాళహస్తి
నియోజకవర్గం ఆర్సి ఇన్చార్జి



వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున 2019లో శ్రీకాళహస్తి శాసనసభ నియోజకవర్గం నుంచి ఘన విజయం సాధించిన బియ్యపు మధుసూదన్ రెడ్డి తన జన్మదినాన్ని ప్రజల మద్దతుతో, ఆశీస్సులతో జరుపుకుంటున్నారు. శాసన సభ్యులుగా ఉన్న ఐదేళ్ల కాలంలో ఆయన చేపట్టిన అభివృద్ధి పనులు, ప్రజలతో ఏర్పరచుకున్న అనుబంధం, సంక్షేమ పథకాలు రాష్ట్ర రాజకీయాల్లో ఒక ప్రత్యేక ముద్ర వేశాయి.

**భక్తి పునాదుల పై అభివృద్ధి ప్రణాళికలు**

తిరుపతికి అతి సమీపంలో ఉన్న శ్రీకాళహస్తి క్షేత్రం పుణ్యభూమిలో పలు దేవాలయాల అభివృద్ధికి శ్రీకారం చుట్టిన మధుసూదన్ రెడ్డి 4 కోట్ల విలువైన ఆలయ అభివృద్ధి పనులకు భూమి పూజ చేయడం విశేషం. ఏడుగంగమ్మ ఆలయం, కుమారస్వామి దేవాలయం, ధర్మరాజు అల యాల అభివృద్ధితో పాటు మహా మండపాల నిర్మాణానికి నిధులు కేటాయించారు కరోనా సంక్షోభంలో నాయకత్వం 2020 కరోనా లాక్స్ సమయంలో నియోజకవర్గ ప్రజల కోసం 10,000 కుటుంబాలకు అన్నదానం చేశారు. ప్రతి ఇంటికీ బియ్యం, కూరగాయలు, పండ్లు పంపిణీ చేస్తూ తన సేవా మనోభావాన్ని చాటారు. సొంత నిధులతో, వైఎస్సార్సీపీ కార్యకర్తల సాయంతో ప్రజల మధ్య నిలిచారు. ఇది నియోజకవర్గంలో ఆయన్ని నిజమైన నాయకుడిగా నిలబెట్టింది.

**స్వంత నవరత్నాలు ప్రజల అభివృద్ధికి బియ్యపు బ్రాండ్**

నవరత్నాల కన్నా ముందే తన ప్రత్యేకంగా 9 సేవా పథకాలు రూపొందించి వాటిని స్వంత నవరత్నాలుగా అభివృద్ధి చేశారు. వీటిలో.. పుష్కార్డుల పంపిణీ, కళాకారులకు మద్దతు, విద్యార్థులకు కార్పొరేట్ విద్య, పేదలకు వైద్యసహాయం, వివాహాలకు ఆర్థికసాయం వంటి వాటితో అనేకరిని జీవితంలో ముందుకు నడిపించారు. ఈ పథకాలకు మొత్తం 70 కోట్లు తన సొంత నిధులతో ఖర్చు చేయడం ఆయన పెద్ద మనసుని సూచిస్తుంది.

రైతులకోసం సాగునీటి పోరాటం

**తెలుగు గంగా ప్రాజెక్టు ద్వారా 12,000 ఎకరాలకు**

సాగునీరు అందించే విధంగా మోటార్లు, పంప్ సెట్లు ఏర్పాటు చేయించారు. ఈ చర్య వలన రైతుల సాగునీటి అవసరాలు తీరగా, మధుసూదన్ రెడ్డి రైతుల మనసు గెలుచుకున్నారు.

**విద్య వైద్య రంగాల్లో ఆయన సాయం**

ప్రతి సంవత్సరం కార్పొరేట్ పాఠశాలల్లో  పేద విద్యార్థులకు ఉచిత విద్య అందించే విధంగా ఏర్పాట్లు చేశారు. అలాగే, కార్పొరేట్ ఆసుపత్రుల్లో వైద్య ఖర్చులు భరించలేని వారికి ఉచిత చికిత్స అందించేందుకు ఆయన ప్రత్యేక మునుగుగా నిలిచారు.

**జన్మదినం ఓ సేవా దినంగా**

బర్త్ వేడుకలను పెద్దగా చేయకుండా, ప్రతి సంవత్సరం తన అభిమానులతో కలిసి సేవా కార్యక్రమాలు నిర్వహించడం ఆయనకు ప్రత్యేకత. ఈసారి కూడా ఆయన జన్మదినాన్ని ప్రజల సమస్యలపై చర్చిస్తూ, సహాయక కార్యక్రమాలతో జరుపుకోవాలని నిర్ణయించారు. రాజకీయాల్లో పదవులు కంటే ప్రజల గుండెల్లో చోటు సంపాదించడమే నిజమైన గెలుపు. బియ్యపు మధుసూదన్ రెడ్డి మాజీ శాసనసభ్యులు ఐదేళ్ళ ప్రజలకు అందించిన సేవలు, అభివృద్ధి పనులు, సంక్షేమ చర్యలు ఇప్పటికీ ప్రజల నోటి మీద ఉన్నాయి. ఆయన జన్మదినం సందర్భంగా నియోజకవర్గం నలుమూలలా అభిమానులు, కార్యకర్తలు. ప్రజలు ఆయనకు శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు....

# ఏపీఆర్జేసీ ఫలితాలలో శ్రీ శివాని విద్యార్థుల ప్రతిభ

ప్రజా భూమి ప్రతినిధి తిరుపతి




విడుదలైన ఏపీఆర్జేసీ ఫలితాలలో గూడూరు శ్రీ శివాని స్టడీ సర్కిల్ విద్యార్థులు రాష్ట్రస్థాయిలో ర్యాంకుల ప్రభంజనం సృష్టించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అభినందన సభ ఏర్పాటు చేయడమైనది. కరస్పాండెంట్ శివకుమార్ రెడ్డి మాట్లాడుతూ శ్రీ శివాని స్టడీ సర్కిల్ విద్యార్థి వెంకట లోకేష్ రాష్ట్రస్థాయిలో 21 వ ర్యాంకు సాధించి గూడూరు కే గర్వకారణంగా నిలిచినట్లు తెలిపారు. అలాగే రాష్ట్రస్థాయిలో గణితజ్ఞశ్రీ 481 వ ర్యాంకు, సాత్విక్ 699 వ ర్యాంకు, వసంత కుమార్ 913 వ ర్యాంకు సాధించి విజయ దుందుభి మోగించినట్లు తెలిపారు అనంతరం విద్యార్థులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు చంద్రశేఖర్, రేవంతి, సుప్రజ, మస్తాన్ బి , నాజీరా , విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ప్రజాభూమి

తిరుపతి,చిత్తూరు 9

శుక్రవారం 15 మే 2026

# త్రుటిలో తప్పిన భారీ ప్రమాదం... 27 మంది ప్రయాణికులతో బస్సు బోల్తా

ప్రజా భూమి ప్రతినిధి తడ.
తిరుపతి జిల్లా తడ మండలం పరిధిలోని జాతీయ రహదారి ఎన్ హెచ్-16పై గురువారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదం స్థానికంగా కలకలం రేపింది. నాయుడుపేట నుంచి శ్రీసిటీ వైపు వెళ్తున్న టీవీఎస్/శ్రీసిటీ కంపెనీకి చెందిన బస్సు, తడలోని స్మార్ట్ సిటీ హోటల్ సమీపానికి చేరుకోగానే ప్రమాదానికి గురైంది. డ్రైవర్ ఒక్కసారిగా బస్సుపై నియంత్రణ కోల్పోవడంతో రహదారి పక్కనున్న కల్వర్టును బలంగా ఢీకొట్టి బస్సు బోల్తా పడింది. ప్రమాద సమయంలో బస్సులో మొత్తం 27 మంది ఉద్యోగులు మరియు ప్రయాణికులు ఉన్నట్లు సమాచారం. ప్రమాదం జరిగిన వెంటనే ప్రయాణికులు భయాందోళనలకు గురై కేకలు వేయడంతో స్థానికులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. బస్సులో చిక్కుకున్న వారిని బయటకు తీసేందుకు స్థానిక యువకులు, ప్రయాణికులు కలిసి సహాయం చేశారు. ఈ ప్రమాదంలో ఐదుగురికి స్వల్ప గాయాలు కాగా, వారిని సమీప ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. గాయపడిన వారి పరిస్థితి ప్రమాదకరం కాదని



వైద్యులు తెలిపారు. బస్సు బోల్తా పడిన ఘటనతో కొంతసేపు జాతీయ రహదారిపై ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. అనంతరం పోలీసులు, హైవే సిబ్బంది సహాయంతో బస్సును పక్కకు తొలగించి రాకపోకలను పునరుద్ధరించారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదానికి గల కారణాలపై విచారణ చేపట్టారు. డ్రైవర్ నిర్లక్ష్యంగా వాహనం నడపడం లేదా అతివేగమే ప్రమాదానికి కారణమై ఉండొచ్చని ప్రాథమికంగా భావిస్తున్నారు. ఈ మేరకు బస్సు డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు. అదృష్టవశాత్తూ ఈ ప్రమాదంలో ఎటువంటి ప్రాణనష్టం జరగకపోవడంతో ప్రయాణికుల కుటుంబ సభ్యులు ఊపిరిపీల్చుకున్నారు. తరచూ రద్దీగా ఉండే ఎన్ హెచ్-16పై ఇలాంటి ప్రమాదాలు జరుగుతుండటంతో వాహనదారులు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచిస్తున్నారు.

# ఆకాశరాజు నిర్మించిన నారాయణవనంలో బ్రహ్మోత్సవ వైభవం

- మే 28 నుంచి జూన్ 5 వరకు శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు
- జూన్ 4న కల్యాణోత్సవం -- జూన్ 5న చక్రస్నానంతో ముగింపు



ప్రజాభూమి ప్రతినిధి నారాయణవనం
ఆకాశరాజు నిర్మించిన పవిత్ర పుణ్యక్షేత్రమైన నారాయణవనంలోని శ్రీ పద్మావతి సమేత శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు మే 28 నుండి జూన్ 5వ తేదీ వరకు అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు. మే 27న అంకురార్పణ కార్యక్రమంతో ఉత్సవాలకు శ్రీకారం చుడనుండగా, మే 24న కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించనున్నారు. శ్రీ పద్మావతీ దేవి అవతరించిన పుణ్యభూమిగా నారాయణవనం ప్రసిద్ధి చెందింది. ఆకాశరాజు పుత్రకామేష్టి యాగ సమయంలో స్వర్ణహలంతో భూమిని



దున్నుతుండగా పద్మంపై వెలసిన దివ్య శిశువును కనుగొని "పద్మావతి" అని నామకరణం చేశారు. అనంతరం వేటకు విచ్చేసిన శ్రీనివాసుడు పద్మావతీదేవిని దర్శించి, ఆకాశరాజు అనుమతితో సకల దేవతల సమక్షంలో వివాహం జరిగింది. ఆ దివ్య కల్యాణ ఘట్టానికి చిరస్మరణగా ఆకాశరాజు నారాయణవనంలో ఈ ఆలయాన్ని నిర్మించారు. స్వామివారి వక్షస్థలంలో శ్రీ మహాలక్ష్మీదేవి కొలువై ఉండగా, ఆలయ ప్రాంగణంలో శ్రీ పద్మావతి అమ్మవారు, శ్రీ గోదాదేవి అమ్మవార్ల సన్నిధులు భక్తులకు దర్శనమిస్తాయి. అలాగే శ్రీ కోదండరామస్వామి, శ్రీ రంగనాథస్వామి, శ్రీ రాజమన్నార్‌స్వామి ఉపాలయాలు ఈ క్షేత్ర మహిమను మరింత పెంచుతున్నాయి. బ్రహ్మోత్సవాలకు ముందు మే 24న కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించనున్నారు. ఆలయ ప్రాంగణం, గోడలు, పైకప్పులు, పూజా సామగ్రిని పవిత్ర జలాలతో శుద్ధి చేసి, నామకోపు, శ్రీచూర్ణం, కస్తూరి, పసుపు, పచ్చాకు, గడ్డకర్పూరం, గంధం, కుంకుమ వంటి సుగంధ ద్రవ్యాలతో తయారుచేసిన పవిత్ర ద్రావణాన్ని ఆలయం అంతటా ప్రోక్షణం చేయనున్నారు. అనంతరం భక్తులకు దర్శనాన్ని కల్పిస్తారు. బ్రహ్మోత్సవాల్లో ప్రతి రోజు ఉదయం 7.30 నుండి 9.30 గంటల వరకు, రాత్రి 7 నుండి 9 గంటల వరకు వాహనసేవలు నిర్వహించనున్నారు. మే 28న ధ్వజారోహణం, పెద్దశేష వాహనం, మే 29న చిన్నశేష వాహనం, హంస వాహనం, మే 30న సింహ వాహనం, ముత్యపుపందిరి వాహనం, మే 31న కల్పవృక్ష వాహనం, సర్వభూపాల వాహనం, జూన్ 1న మోహినీ అవతారం, గరుడ వాహనం, జూన్ 2న హనుమంత వాహనం, గజ వాహనం, జూన్ 3న సూర్యప్రభ, చంద్రప్రభ వాహనసేవలు నిర్వహించనున్నారు. జూన్ 4న రథోత్సవం, అశ్వవాహనం, రాత్రి 8.30 గంటలకు స్వామివారి కల్యాణోత్సవం వైభవంగా జరుగనుంది. రూ.1000 టికెట్‌తో గృహస్తులు పాల్గొనవచ్చు. పాల్గొనే దంపతులకు ఉత్తరీయం, రవికె, లడ్డు, వడ, కుంకుమ ప్రసాదంగా అందజేయనున్నారు. జూన్ 5న చక్రస్నానం, ధ్వజావరోహణంతో బ్రహ్మోత్సవాలు ముగియనున్నాయి. బ్రహ్మోత్సవాల సందర్భంగా హిందూ ధర్మప్రచార పరిషత్, అన్నమాచార్య ప్రాజెక్టు, దాససాహిత్య ప్రాజెక్టుల ఆధ్వర్యంలో ప్రతిరోజూ భక్తి సంగీత, హరికథ, ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి స్వామివారి అనుగ్రహాన్ని పొందాలని టీటీడీ కోరింది.

# తిరుపతిలో భక్తులకు విస్తృత వసతి సౌకర్యాలు

## - పారదర్శక ఆన్‌లైన్ బుకింగ్‌తో టీటీడీ ప్రత్యేక ఏర్పాట్లు

ప్రజాభూమి ప్రతినిధి తిరుపతి
తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామివారిని దర్శించుకునేందుకు ప్రతిరోజూ దేశ విదేశాల నుండి లక్షలాది మంది భక్తులు తిరుపతికి విచ్చేస్తుండగా, భక్తుల సౌకర్యార్థం టీటీడీ తిరుపతిలో విస్తృత స్థాయిలో వసతి, విశ్రాంతి, లాకర్, స్నాన, అన్నప్రసాదం, వైద్య తదితర సౌకర్యాలను అందుబాటులో ఉంచింది.



నిబంధనల ప్రకారం పారదర్శకంగా ఆన్‌లైన్ బుకింగ్ విధానాన్ని అమలు చేస్తూ భక్తులకు సౌకర్యవంతమైన వసతి కల్పిస్తోంది. భక్తుల కోసం తిరుపతిలో శ్రీనివాసం, విష్ణునివాసం, మాధవం, ఎస్వీ గెస్ట్ హౌస్, పద్మావతీ గెస్ట్ హౌస్, తిరుచానూరు తోళ్లప్ప గార్డెన్స్ వంటి వసతి సముదాయాలను టీటీడీ నిర్వహిస్తోంది. వీటితో పాటు డార్మిటరీలు, ఉచిత లాకర్లు, మరుగుదొడ్లు, స్నాన గదులు, ప్రథమ చికిత్స కేంద్రాలు కూడా భక్తులకు అందుబాటులో ఉన్నాయి. ఏసీ గదులను ఆన్‌లైన్ మరియు రొటేషన్ విధానంలో కేటాయిస్తుండగా, నాన్ ఏసీ గదులను ముందు వచ్చిన వారికి ముందు ప్రాతిపదికన



కేటాయిస్తున్నారు. 2011లో ప్రారంభమైన విష్ణునివాసంలో 408 గదులు, 09 హాళ్లు, 706 లాకర్లు భక్తులకు అందుబాటులో ఉన్నాయి. ఏసీ, నాన్ ఏసీ గదులను ఆన్‌లైన్ మరియు రొటేషన్ విధానంలో కేటాయిస్తున్నారు. 2003లో ప్రారంభమైన శ్రీనివాసం కాంప్లెక్స్‌లో 552 గదులు, 09 డార్మిటరీలు, 1038 లాకర్లు ఉండగా, ఏసీ, నాన్ ఏసీ, డీలక్స్ గదులు భక్తులకు అందిస్తున్నారు. 2009లో ప్రారంభించిన మాధవం గెస్ట్ హౌస్‌లో 164 ఏసీ గదులు, డీలక్స్ సూట్లు ఉన్నాయి. 1955లో నిర్మించిన ఎస్వీ గెస్ట్ హౌస్‌లో ఏసీ, నాన్ ఏసీ కలిపి 31 గదులు భక్తులకు కేటాయిస్తున్నారు. వీటిని ముందు వచ్చిన వారికి ముందు ప్రాతిపదికన అందిస్తున్నారు. ఇతర వసతి కేంద్రాల్లో రేణిగుంట సమాచార కేంద్రంలో 4 గదులు, ఒక డార్మిటరీ, 18 లాకర్లు అందుబాటులో ఉన్నాయి. 2002లో ప్రారంభమైన భూదేవి కాంప్లెక్స్‌లో ఒక డార్మిటరీ, 100 లాకర్లు ఉన్నాయి. తిరుచానూరు తోళ్లప్ప గార్డెన్స్



లోని గెస్ట్ హౌస్‌లో 30 గదులను నిబంధనల ప్రకారం ఆన్‌లైన్‌లో ముందస్తుగా బుక్ చేసుకోవచ్చు. 1979లో ప్రారంభమైన పద్మావతీ గెస్ట్ హౌస్‌లోని 35 గదులు ప్రోటోకాల్ ప్రతినిధులకు కేటాయించబడుతున్నాయి. విష్ణునివాసం, శ్రీనివాసం, తోళ్లప్ప గార్డెన్స్‌లలో అన్నప్రసాదం సౌకర్యం కూడా భక్తులకు అందుబాటులో ఉంది. అదేవిధంగా శ్రీ గోవిందరాజ స్వామి సత్రాల స్థానంలోనిర్మాణంలో ఉన్న భవనాలు పూర్తయిన తర్వాత మరిన్ని గదులు, డార్మిటరీలు, లాకర్లు భక్తులకు అందుబాటులోకి రానున్నాయి. తిరుపతిలోని విష్ణునివాసంలో పరిమిత సంఖ్యలో గదుల కేటాయింపు కరెంట్ బుకింగ్ ద్వారా జరుగుతుండగా, మిగిలిన అన్ని వసతి కేంద్రాల్లో గదులను టీటీడీ అధికారిక వెబ్‌సైట్ ద్వారా ముందస్తుగా ఆన్‌లైన్‌లో బుక్ చేసుకోవాల్సి ఉంటుంది. ఒంటరి, అవివాహిత స్త్రీ, పురుషజంటలకు గదులు కేటాయించబడవని టీటీడీ స్పష్టం చేసింది. టీటీడీ కల్పిస్తున్న వసతి, లాకర్, విశ్రాంతి,అన్నప్రసాదం సదుపాయాలను భక్తులు వినియోగించుకుని స్వామివారి దర్శనాన్ని సౌకర్యవంతంగాపూర్తి చేసుకోవాలని కోరింది. దర్శనం అనంతరం గదులు, లాకర్లు వెంటనే ఖాళీ చేసి ఇతర భక్తులకు సహకరించాలని విజ్ఞప్తి చేసింది.

# తొండవాడలో భారీ స్పందనతో క్యాన్సర్ అవగాహన - ఉచిత స్క్రీనింగ్ శిబిరం

## గ్రామీణ ప్రజలకు ముందస్తు పరీక్షలతో ఆరోగ్య భరోసా

ప్రజాభూమి ప్రతినిధి చంద్రగిరి
చంద్రగిరి మండలం తొండవాడ గ్రామంలోని పాత పంచాయతీ కార్యాలయం వేదికగా "క్యాన్సర్ అవగాహన మరియు స్క్రీనింగ్ పరీక్షలు" ఉచిత వైద్య శిబిరం ఘనంగా నిర్వహించారు. యూనివర్సల్ కాస్మిక్ ఎనర్జీ ఎన్‌జీఓ, తిరుపతిలోని ఎస్‌వీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ క్యాన్సర్ అండ్ అడ్వాన్స్‌డ్ రీసెర్చ్ సెంటర్ (టాటా క్యాన్సర్ ఫౌండేషన్), ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ తిరుపతి జిల్లా శాఖ సంయుక్త




ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రీచ్ గ్లోబల్ ఫౌండేషన్ అధ్యక్షుడు డాక్టర్ రమేష్ నాథ్ లింగుట్ల, డిప్యూటీ ఎంపీడీఓ వెంకట రత్నంతో కలిసి శిబిరాన్ని ప్రారంభించారు. ఈ



సందర్భంగా డాక్టర్ రమేష్ నాథ్ మాట్లాడుతూ క్యాన్సర్‌ను ప్రాథమిక దశలోనే గుర్తిస్తే పూర్తిగా నయం చేసుకునే అవకాశం ఉందని, గ్రామీణ ప్రాంతాల్లో ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలు ప్రజలకు ఎంతో ఉపయోగకరమని తెలిపారు. ప్రజలు ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. టాటా క్యాన్సర్ హాస్పిటల్‌లో డైరెక్టర్ డాక్టర్ ప్రశాంత్ ఆధ్వర్యంలో వైద్యులు సంధ్య, నాగేశ్వర రెడ్డి, కార్తిక్, రవికుమార్ తదితరులు అంకితభావంతో తక్కువ ఖర్చుతో వైద్య సేవలు అందిస్తున్నారని కొనియాడారు. ఈ సేవా కార్యక్రమాన్ని నిర్వహించిన భానుశ్రీని అభినందించారు. డిప్యూటీ ఎంపీడీఓ వెంకట రత్నం, తొండవాడ గ్రామ పంచాయతీ కార్యదర్శి నాగరాజులు, గ్రామ పెద్దలు అరుణాచల రెడ్డి, మోహన్ రెడ్డి, ఉమాపతి రెడ్డి మాట్లాడుతూ తొండవాడలో ఈ శిబిరం నిర్వహించడం సంతోషకరమని తెలిపారు. పీ4 మార్గదర్శిగా డాక్టర్ రమేష్ నాథ్ లింగుట్ల చేస్తున్న సేవలు అభినందనీయమని పేర్కొన్నారు. శిబిరంలో టాటా క్యాన్సర్ హాస్పిటల్‌కు చెందిన హేమంత్ ఆధ్వర్యంలో నిపుణులైన వైద్యులు, పారామెడికల్ సిబ్బంది 20 నుండి 65 సంవత్సరాల మధ్య వయస్సు గల మహిళలు, పురుషులకు ఉచిత స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించి క్యాన్సర్ నివారణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో తొండవాడ మాజీ సర్పంచ్ ఎం. దీపిక, రెడ్ క్రాస్ ప్రతినిధి డాక్టర్ సాయి దేదీప్య, యూనివర్సల్ కాస్మిక్ ఎనర్జీ ఎన్‌జీఓ కార్యదర్శి పీ. భానుశ్రీ, సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు. శిబిరానికి విచ్చేసిన వారికి ఉచిత భోజన సౌకర్యం కల్పించారు.

# ఛత్రపతి శంభాజీ మహారాజ్ త్యాగం దేశానికి స్ఫూర్తి

**జయంతి సందర్భంగా నివాళులర్పించిన ఫైట్ ఫర్ సోషల్ జస్టిస్ వ్యవస్థాపకుడు పొన్నా రవికుమార్.**

ప్రజా భూమి ప్రతినిధి తిరుపతి
భారతీయ చరిత్రలో ధైర్యసాహసాలకు, అజేయ సంకల్పానికి ప్రతీకగా నిలిచిన ఛత్రపతి శంభాజీ మహారాజ్ జీవితం ప్రతి భారతీయుడికి స్ఫూర్తిదాయకమని ఫైట్ ఫర్ సోషల్ జస్టిస్ వ్యవస్థాపకుడు పొన్నా రవికుమార్ పేర్కొన్నారు. శంభాజీ మహారాజ్ జయంతి సందర్భంగా విడుదల చేసిన ప్రకటనలో ఆయన ఆ మహనీయునికి ఘన నివాళులు అర్పించారు. మరాఠా సామ్రాజ్య స్థాపకుడు ఛత్రపతి శివాజీ మహారాజ్ జ్యేష్ఠ పుత్రుడైన శంభాజీ మహారాజ్ 1657 మే 14న పురందర్ కోటలో జన్మించారని తెలిపారు. చిన్న వయసులోనే తల్లిని కోల్పోయిన శంభాజీ, రాజమాత జిజాబాయి పర్యవేక్షణలో పెరిగి ధైర్యం, దేశభక్తి, క్రమశిక్షణను అలవర్చుకున్నారని గుర్తుచేశారు. 1681లో సింహాసనాన్ని అధిష్టించిన శంభాజీ మహారాజ్ తన తండ్రి ఆశయమైన "హైందవి స్వరాజ్యాన్ని" కాపాడేందుకు ప్రాణాలను పణంగా పెట్టి పోరాడారని పేర్కొన్నారు. కేవలం యుద్ధ వీరుడిగానే కాకుండా అనేక భాషల్లో ప్రావీణ్యం కలిగిన గొప్ప పండితుడిగా ఆయన చరిత్రలో నిలిచిపోయారని తెలిపారు. ఔరంగజేబు దక్కన్ ప్రాంతాన్ని ఆక్రమించకుండా అడ్డుకోవడంలో శంభాజీ కీలక పాత్ర పోషించారని, ముఖ్యంగా బుర్హాన్‌పూర్‌పై చేసిన దాడి మొఘల్ సామ్రాజ్యాన్ని వణికించిందని వివరించారు. తనపై కుట్రలు జరిగినా వెనుకడుగు వేయకుండా సామ్రాజ్యాన్ని కాపాడిన శంభాజీ మహారాజ్‌ను 1689లో ఔరంగజేబు బందీగా పట్టుకుని మతమార్పిడి కోసం చిత్రహింసలు పెట్టాడని, అయినప్పటికీ ఆయన తన విశ్వాసాన్ని, ఆత్మగౌరవాన్ని విడిచిపెట్టలేదని పేర్కొన్నారు. చివరకు 1689 మార్చి 11న మొఘలులు అత్యంత కిరాతకంగా హత్య చేసినప్పటికీ ఆయన చూపిన ధైర్యం దేశ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిందన్నారు. శంభాజీ మహారాజ్ జీవితం నేటి యువతకు మార్గదర్శకమని, కష్టకాలంలో ధైర్యంగా నిలబడే మనస్తత్వాన్ని ఆయన జీవితం నేర్పిస్తుందని పొన్నా రవికుమార్ తెలిపారు. దేశభక్తి, విద్య, ఆత్మగౌరవం, త్యాగస్ఫూర్తి వంటి విలువలను ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు. శంభాజీ మహారాజ్ వీరగాథను నేటి తరానికి పరిచయం చేస్తూ రూపొందిన "ఛావా" సినిమా మరాఠా సామ్రాజ్య వైభవాన్ని ప్రతిబింబించిందని, ఇలాంటి చారిత్రక గాథలు యువతలో స్ఫూర్తిని నింపుతాయని పేర్కొన్నారు. ఛత్రపతి శంభాజీ మహారాజ్ చూపిన ధైర్యం, పట్టుదల, త్యాగం ప్రతి భారతీయుడి గుండెల్లో చిరస్థాయిగా నిలిచి తరతరాలకు స్ఫూర్తినిస్తూనే ఉంటాయని తెలిపారు.



# పవన్ కళ్యాణ్ ఆశయాలతో శ్రీకాళహస్తిలో 81వ వారం అన్నదాన సేవ

**-డొక్కా సీతమ్మ స్ఫూర్తితో జనసేన నాయకుల ఆధ్వర్యంలో కార్యక్రమం**

ప్రజాభూమి ప్రతినిధి శ్రీకాళహస్తి
తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి నియోజకవర్గంలో జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ఆశయాలలో భాగంగా శ్రీకాళహస్తి ఆర్టీసీ బస్టాండ్ సర్కిల్ వద్ద పేట బ్రదర్స్ ఆధ్వర్యంలో 81వ వారం డొక్కా సీతమ్మ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆకలితో ఉన్న వారికి అన్నం పెట్టడం మహాదానమనే సంకల్పంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు






నిర్వాహకులు తెలిపారు. పవన్ కళ్యాణ్ సూచించిన సేవా కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లే లక్ష్యంతో ప్రతి వారం నిరంతరంగా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని జనసేన నాయకులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా పేదలు, ప్రయాణికులు, అవసరమైన వారికి అన్నప్రసాదాన్ని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు పేట చంద్రశేఖర్, పేట చిరంజీవి, గంధం శ్రీను, మనీ, డాక్టర్ నక్కా ప్రసాద్, దినేష్, లక్ష్మణ్, కల్లిపూడి వెంకటేష్, నవీన్, మహర్షి రెడ్డి, మునిచంద్ర, చందు, సాయి పాల్గొన్నారు. వీర మహిళలు పేట శారద, నారాయణ గాయత్రి, బత్తెమ్మ, శకుంతలమ్మ తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి ఆదేశాలతో,అభివృద్ధి దిశగా పద్మానగర్

ప్రజా భూమి ప్రతినిధి రేణిగుంట.
రేణిగుంట మండలంలోని జీపాలెం పంచాయితీ పద్మా నగర్‌లో నూతనంగా ఏర్పాటు చేయనున్న వెల్నెస్ హెల్త్ క్లినిక్ నిర్మాణానికి జీపాలెం రాజశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో గురువారం ఉదయం భూమి పూజ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి





ముఖ్యఅతిథిగా మండల అధ్యక్షుడు మునిచంద్రారెడ్డి, సీనియర్ నాయకులు, చెర్లోపల్లిసుబ్రహ్మణ్యం రెడ్డి, పట్టణ అధ్యక్షులు మహబూబ్ బాషా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... స్థానిక ప్రజలకు మెరుగైన వైద్య సేవలు తక్కువ దూరంలో అందుబాటులోకి రావాలనే ఉద్దేశంతో హెల్త్ క్లినిక్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ సుబ్బారెడ్డి, వీఆర్వో నలిని, హెల్త్ సూపర్వైజర్ నాగరాజు, టిడిపి కార్యకర్తలు, గ్రామస్తులు,స్థానికులు తదితరులు,పాల్గొన్నారు.

# మురికి గుంటగా మారిన తాగునీటి గుంట

ప్రజా భూమి ప్రతినిధి బుచ్చినాయుడు కండ్రిగ
తిరుపతి జిల్లా బి.ఎన్. కండ్రిగ మండలంలోని నెలవాయి గ్రామంలో ఒకప్పుడు తాగునీటి అవసరాలకు ఉపయోగించిన గుంట ప్రస్తుతం మురికి గుంటగా మారి ప్రజలకు ఆందోళన కలిగిస్తోంది. యానాది కాలనీ సమీపంలో ఉన్న ఈ గుంటలో చెత్త,



మురుగునీరు చేరడంతో దుర్వాసన వ్యాపిస్తోంది. చుట్టుపక్కల వారు గుంటలో చెత్తాచెదారం వేయడంతో పరిస్థితి మరింత దారుణంగా మారిందని గ్రామస్తులు వాపోతున్నారు. వర్షాకాలంలో గుంట పూర్తిగా నీటితో నిండిపోయి దోమలకు నిలయంగా మారే ప్రమాదం ఉందని తెలిపారు. దీంతో మలేరియా, డెంగ్యూ వంటి వ్యాధులు వ్యాపించే అవకాశం ఎక్కువగా ఉందని కాలనీవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గుంట పక్కనే చిన్నపిల్లలు, బర్రెలు, దూడలు నిత్యం సంచరిస్తుండటంతో ప్రమాద భయం నెలకొంది. ముఖ్యంగా యానాది కాలనీ చిన్నారులు ఆడుకునే ప్రదేశం కావడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గుంట చుట్టూ ఎలాంటి రక్షణ చర్యలు లేకపోవడంతో ప్రమాద అవకాశం మరింత పెరిగిందని గ్రామస్తులు తెలిపారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి గుంటను పూర్తిగా పూడ్చివేసి, పరిశుభ్రత చర్యలు చేపట్టి కాలనీ ప్రజలకు భద్రత కల్పించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

# బజాజ్ ఫైనాన్స్‌లో సేల్స్ ఆఫీసర్ పోస్టులకు 86 మంది ఎంపిక

## స్వర్ణ గ్రామం - స్వర్ణ వార్డు ఆధ్వర్యంలో విజయవంతమైన నియామక ప్రక్రియ

ప్రజా భూమి ప్రతినిధి తిరుపతి.
స్వర్ణ గ్రామం -- స్వర్ణ వార్డు శాఖ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా నిర్వహించిన నియామక ప్రక్రియలో భాగంగా, బజాజ్ ఫైనాన్స్ లిమిటెడ్ సంస్థలో సేల్స్ ఆఫీసర్ పోస్టులకు అభ్యర్థుల ఇంటర్వ్యూలు విజయవంతంగా నిర్వహించబడ్డాయి. స్వర్ణ గ్రామం -- స్వర్ణ వార్డుల ద్వారా కౌశలం ఆన్‌లైన్ పరీక్షలు రాసి షార్ట్‌లిస్ట్ అయిన నిరుద్యోగ యువతకు తిరుపతి కలెక్టరేట్‌లోని పి జి ఆర్ ఎస్ హాల్‌లో మే 13 మరియు 14 తేదీల్లో ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ ఇంటర్వ్యూలకు తిరుపతి, చిత్తూరు, వైఎస్సార్ కడప, అన్నమయ్య, నెల్లూరు మరియు శ్రీ సత్యసాయి జిల్లాలకు చెందిన మొత్తం 102 మంది అభ్యర్థులు హాజరయ్యారు. ఇంటర్వ్యూల అనంతరం 86 మంది అభ్యర్థులు ఎంపికైనట్లు బజాజ్ ఫైనాన్స్ లిమిటెడ్ హెచ్‌ఆర్ ప్రతినిధులు తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు త్వరలోనే నియామక ప్రక్రియ పూర్తి చేయనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్వర్ణ గ్రామం - స్వర్ణ వార్డు అధికారి శ్రీమతి బి. గంగా భవాని, జిల్లా స్వర్ణ గ్రామం ౘ స్వర్ణ వార్డు కో-ఆర్డినేటర్ పి.వి. జగదీష్ తదితరులు పాల్గొన్నారు.



# ప్రభుత్వ బడుల్లోనే ఉన్నత స్థాయి విద్యా ప్రమాణాలు - మండల విద్యాశాఖ అధికారి దయాకర్

### “బడి పిలుస్తోంది” ఎన్రోల్మెంట్ డ్రైవ్ ను నిర్వహించిన ఎం.ఈ.ఓ దయాకర్.

ప్రజా భూమి ప్రతినిధి ఏర్పేడు.



14 మే 2026 వ తేదీన పంగూరు నందు “బడి పిలుస్తోంది” విద్యార్థుల నమోదు కార్యక్రమాన్ని ఏర్పేడు మండల విద్యాశాఖ అధికారి ఏ. దయాకర్ నిర్వహించారు. పంగూరు గ్రామం నందు ఐదు సంవత్సరముల వయసు ఉన్న పిల్లలను వంగూరు ఆదర్శ ప్రాథమిక పాఠశాల నందు ఒకటవ తరగతిలో నమోదు చేయించారు.వారు ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో నిష్ణాతులైన ఉపాధ్యాయులు మరియు మంచి మౌలిక సదుపాయాలు ఉన్నాయని, పదవ తరగతి ఫలితాలలో కూడా రాష్ట్రస్థాయి ఉత్తమ ర్యాంకులు ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు సాధించారని తెలియజేశారు. ఏర్పేడు మండల స్థాయిలో మొదటి ర్యాంకును పల్లాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన బి. హేమ 576 మార్కులతో కైవసం చేసుకుందని తెలియజేశారు. కావున విద్యార్థుల తల్లిదండ్రులు తమ సమీప ప్రభుత్వ పాఠశాలల నందు తమ పిల్లలను నమోదు చేయించి వారి విద్యాభివృద్ధికి సహకరించాలని తెలియజేశారు. అనంతరం వంగూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు పదవ తరగతి ఫెయిల్ అయిన విద్యార్థుల తల్లిదండ్రుల మొబైల్ ఫోన్ల నందు “లీప్” ఆండ్రాయిడ్ అప్లికేషన్ ను ఇన్స్టాల్ చేయించి దానిని ఉపయోగించే విధానాన్ని మరియు అప్లికేషన్లో ఉన్నటువంటి పదవ తరగతి స్టడీ మెటీరియల్ను డౌన్లోడ్ చేయించి తమ పిల్లలు ఆ స్టడీ మెటీరియల్ ను ఉపయోగించునట్లు గా చూడవలసినదిగా తద్వారా మే నెల 25 వతేదీ నుంచి జరగబోయేటటువంటి పదవ తరగతి అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షల నందువిద్యార్థుల ఉత్తీర్ణతకు తల్లిదండ్రులు సహకరించాలని తెలియజేశారు. పాఠశాల విద్యాశాఖ మంత్రి నారా లోకేష్. మరియు తిరుపతి జిల్లా విద్యాశాఖ అధికారి ఆదేశాల మేరకు ఏర్పేడు మండలం నందు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఏర్పేడు, పల్లాం మరియు పాపా నాయుడుపేట మూడు కేంద్రాల నందు పదవ తరగతి ఫెయిల్ అయిన విద్యార్థులకు రెమెడియల్ తరగతులు మే నెల 3 వ తేదీ నుంచి 23 వ తేదీ వరకు నిర్వహించుచున్నామని తెలియజేశారు. పదవ తరగతి ఫెయిల్ అయిన విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలను సమీప పదవ తరగతి రెమెడియల్ తరగతి నిర్వహణ కేంద్రాలకు తప్పనిసరిగా హాజరగుటకు సహకరించి తద్వారా వారి ఉత్తీర్ణతకు సహకరించాలని విద్యార్థుల తల్లిదండ్రులకు తెలియజేశారు. ఈ కార్యక్రమం నందు వంగూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నాసిర్, పంగూరు ఆదర్శ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు చిరంజీవి, ఉపాధ్యాయులు వాసయ్య, మునిరత్నం, రమేష్ మరియు సిఆర్పి సురేష్ పాల్గొన్నారు.



# ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ట్రాన్స్‌జెండర్ సంక్షేమ బోర్డు ఏర్పాటు

### రాయలసీమ ప్రాంత ప్రతినిధిగా తిరుపతి జిల్లా కలెక్టర్‌కు సభ్యత్వం

ప్రజా భూమి ప్రతినిధి తిరుపతి.



తిరుపతి, రాష్ట్ర ట్రాన్స్‌జెండర్ సంక్షేమ బోర్డు తొలి సమావేశం అమరావతిలోని ఏపీ సెక్రటేరియట్ కాన్ఫరెన్స్ హాల్‌లో మంత్రి దోలా వీరాంజనేయ స్వామి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో సెక్రటరీ ఎ. సూర్యకుమారి, ఐఏఎస్‌తో పాటు వివిధ శాఖల అధికారులు, ట్రాన్స్‌జెండర్ ప్రతినిధులు పాల్గొనగా జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ గురువారం సాయంత్రం వర్చువల్ విధానంలో కలెక్టర్ బంగ్లా నుండి పాల్గొన్నారు. ట్రాన్స్‌జెండర్ వ్యక్తుల హక్కుల పరిరక్షణ, సంక్షేమం మరియు సమగ్ర అభివృద్ధి లక్ష్యంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాష్ట్ర స్థాయి ట్రాన్స్‌జెండర్ సంక్షేమ బోర్డును ఏర్పాటు చేసింది. ట్రాన్స్‌జెండర్ పర్సన్స్ (ప్రొటెక్షన్ ఆఫ్ రైట్స్) యాక్ట్--2019 మరియు రూల్స్--2020 నిబంధనలను అనుసరించి జీవో ఎంఎస్ నంబర్.14, తేదీ:12-05-2026 మేరకు ఏర్పాటు చేయబడిన బోర్డు రాయలసీమ ప్రతినిధిగా తిరుపతి జిల్లా కలెక్టర్ ఎస్. వెంకటేశ్వర్ కు సభ్యత్వం కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ బోర్డు ఛైర్‌పర్సన్‌గా విభిన్న ప్రభావంతులు, ట్రాన్స్‌జెండర్ ఢ వయోవృద్ధుల సంక్షేమ శాఖ మంత్రి దోలా వీరాంజనేయ స్వామి వ్యవహరిస్తుండగా, మెంబర్ సెక్రటరీగా మహిళలు, శిశువులు, విభిన్న ప్రభావంతులు వయోవృద్ధుల సంక్షేమ శాఖ కార్యదర్శి ఎ.సూర్యకుమారి వ్యవహరిస్తారు. తిరుపతి జిల్లా కలెక్టర్ - డిస్ట్రిక్ట్ మేజిస్ట్రేట్ -- రాయలసీమ ప్రాంత ప్రతినిధిగా, విశాఖపట్నం జిల్లా కలెక్టర్ -- ఆంధ్ర ప్రాంత ప్రతినిధిగా నియమించారు. ట్రాన్స్‌జెండర్ ప్రతినిధులుగా కోట ప్రేమ్ సాగర్ రాయ్, నక్కా జీవన్ కుమారి, బోను దుర్గ ఉన్నారు. ఈ బోర్డు ట్రాన్స్‌జెండర్ వ్యక్తుల సంక్షేమానికి సంబంధించిన పథకాలు, చట్టాలు మరియు కార్యక్రమాల రూపకల్పనలో ప్రభుత్వానికి సలహాలు అందించడం, అమలు అవుతున్న సంక్షేమ పథకాల ప్రభావాన్ని మూల్యాంకనం చేయడం, వివిధ శాఖల మధ్య సమన్వయం పెంపొందించడం, ట్రాన్స్‌జెండర్ వ్యక్తుల సమస్యలు, ఫిర్యాదుల పరిష్కారానికి చర్యలు చేపట్టడం ద్వారా రాష్ట్రంలోని ట్రాన్స్‌జెండర్ సమాజానికి సామాజిక, ఆర్థిక, విద్యా రంగాల్లో మరింత సాధికారత కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉంటుంది.

# స్వచ్ఛ సర్వేక్షన్ లో తిరుపతిని ప్రథమ స్థానంలో నిలుపుదాం -కమిషనర్ శారదా దేవి

ప్రజాభూమి ప్రతినిధి తిరుపతి

జాతీయ స్థాయిలో నిర్వహించే స్వచ్ఛ సర్వేక్షన్ పోటీల్లో తిరుపతిని ప్రథమ స్థానంలో నిలిపేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని నగరపాలక సంస్థ ఇంచార్జి కమిషనర్ శారదా దేవి పిలుపునిచ్చారు. స్వచ్ఛ సర్వేక్షన్ పోటీల్లో పాల్గొనేందుకు చేయాల్సిన ఏర్పాట్లపై ఇంజినీరింగ్, ఆరోగ్యశాఖ అధికారులు, సిబ్బందితో గురువారం నగరపాలక సంస్థ కార్యాలయంలో ఇంచార్జి కమిషనర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంచార్జి కమిషనర్ మాట్లాడుతూ తిరుపతి నగరం స్వచ్ఛ సర్వేక్షన్ 2026 లో ప్రథమ స్థానంలో నిలిచేందుకు ప్రజలు, అధికారులు, సిబ్బంది అందరూ సహకరించాలని పిలుపునిచ్చారు. గత ఏడాది చేసిన తప్పులు పునరావృతం కాకుండా అందరూ సమిష్టిగా పని చేయాలని పిలుపునిచ్చారు. చెత్తను వేరు చేయడం, తరలింపు, ప్రజల నుండి ఫీడ్ బ్యాక్ తీసుకోవడం, పలు ప్రాంతాలను సుందరీకరణ చేయడంలో వెనుకబడ్డామని తెలిపారు. ముఖ్యంగా చెత్త సేకరణ కు వెళ్లే సిబ్బంది ప్రజలతో మర్యాదపూర్వకంగా మెలగాలని తెలిపారు. తడి, పొడి చెత్త వేరు చేసే విధానంపైన, ఫీడ్ బ్యాక్ ఇచ్చే విధానంపైన ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. పారిశుధ్యం, సుందరీకరణ, మరుగుదొడ్ల నిర్వహణ, డ్రైనేజి శుభ్రం చేయడం వంటివి బాగా చేయాలని అన్నారు. ఈ సంవత్సరం ఉత్తమ స్థానం సాధించేందుకు అందరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం లో డిప్యూటీ కమిషనర్ అమరయ్య, సూపరింటెండెంట్ ఇంజనీర్ శ్యాంసుందర్, మునిసిపల్ ఇంజినీర్లు తులసి కుమార్, గోమతి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, డిసిపి. ఖాన్, రెవిన్యూ అధికారులు సేతు మాధవ్, రవి, డి.ఈ. లు, శానిటరీ సూపర్ వైజర్లు చెంచయ్య, సుమతి, మేస్త్రి లు, తదితరులు పాల్గొన్నారు.



# గ్రామాల్లో పోలీసుల అవగాహన కార్యక్రమాలు

### మహిళల భద్రత, సైబర్ మోసాలు, గంజాయి నివారణపై ప్రజలకు సూచనలు

ప్రజాభూమి ప్రతినిధి తిరుపతి

తిరుపతి జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో కాగితాల గ్రామంలో మహిళలు, చిన్నారుల భద్రత, సైబర్ నేరాల నివారణ, గంజాయి దుష్ప్రభావాలు, ట్రాఫిక్ నియమాలపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు ఆదేశాల మేరకు జిల్లా పోలీసు అధికారులు గ్రామాన్ని సందర్శించి ప్రజలకు వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మహిళలు, చిన్నారులపై జరిగే నేరాల నివారణ, మహిళల భద్రత, బాలల రక్షణకు సంబంధించిన అంశాలపై ప్రజలకు వివరించారు. మహిళలు ఎలాంటి వేధింపులు ఎదుర్కొన్నా వెంటనే పోలీసులను సంప్రదించాలని సూచించారు. అలాగే సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాలు, తెలియని లింకులు ఓపెన్ చేయడం వల్ల కలిగే నష్టాలు, ఓటీపీ మోసాలు, డిజిటల్ అరెస్ట్ స్కామ్‌లు వంటి అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. అనుమానాస్పద ఫోన్ కాల్స్, మెసేజ్‌లకు స్పందించకుండా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. గంజాయి వినియోగం వల్ల యువత భవిష్యత్తు దెబ్బతింటుందని, చైన్ స్నాచింగ్ ఘటనల నివారణకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు తెలిపారు. అనుమానాస్పద వ్యక్తుల కదలికలను గమనించి వెంటనే సమాచారం ఇవ్వాలని కోరారు. రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని, అతివేగంగా వాహనాలు నడపకూడదని, మద్యం సేవించి డ్రైవింగ్ చేయరాదని సూచించారు. గ్రామ ప్రజలు, యువత, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని పోలీసుల సూచనలను ఆసక్తిగా విన్నారు. అత్యవసర సమయంలో డయల్ 112కు సమాచారం అందిస్తే తక్షణ చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు.



# శనివారం వైభవంగా శ్రీ శని జయంతి వేడుకలు

### ఉదయం 6 గంటల నుంచి స్వామివారికి తైలాభిషేకం :ఉంగరాల సుబ్రహ్మణ్యం శర్మ




ప్రజా భూమి ప్రతినిధి,రామచంద్రపురం



రామచంద్రపురం మండలం రాయల చెరువు పంచాయతీ చాయాపురంలో వెలిసి ఉన్న శ్రీ ఛాయామార్తాండ శ్రీ శనీశ్వరాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు.. శనివారం వైశాఖ బహుళ అమావాస్య(16 వ తేది) రోజున శ్రీ శనీశ్వర స్వామి వారి జయంతి సందర్భంగా సందర్భంగా ఆలయ అర్చకులు స్వామివారిని ప్రాతః కాలంలో సుప్రభాతం సేవతో మేల్కొల్పి. అనంతరం ఉదయం ఏడు గంటలకు స్వామివారికి అత్యంత ప్రీతికరమైన తైలాభిషేకం జరుగుతుంది. తదుపరి పాలు పెరుగు నెయ్యి పంచామృతం సుగంధ ద్రవ్యాలతో ప్రత్యేక అభిషేకం చేస్తారు. ఆలయానికి విచ్చేసిన భక్తులకు ఆలయ ధర్మాధికారి ఉంగరాల సుబ్రహ్మణ్యం శర్మ శాస్త్రోక్తంగా శని నివారణ, శాంతి హోమం, గణపతి హోమం, నవగ్రహ శాంతి నివారణ హోమం చేస్తారు. ఆలయ ప్రాంగణంలో వెలసి ఉన్న అభయ హస్త ఆంజనేయస్వామికి తమలపాకలతో ప్రత్యేక పూజలు చేసి భక్తులకు దర్శన భాగ్యం కల్పిస్తారు. సర్వ దోషాలకు నివారణ అయ్యేవిధంగాభక్తులచే గోపూజ కార్యక్రమం ఉంటుంది .ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వామివారి జయంతి రోజున శని ప్రభావం కలిగి ఉన్న భక్తులు అష్టమ శని, అర్ధాష్టమ శని, ఏనాటి శని, శాంతి హోమం, నవగ్రహ దోష నివారణ హోమం, గణపతి హోమం, చండీ హోమం వారి వారి గ్రహ స్థితులను అనుసరించి ప్రతి శనివారం ప్రత్యేక పూజలు చేస్తామని తెలిపారు. స్వామివారికి అత్యంత వైభవంగా ప్రాకారోత్సవం చేస్తామన్నారు.ముఖ్యంగా శ్రీ శనీశ్వర స్వామి వారికి 19 ప్రదక్షిణలు అత్యంత ప్రీతికరమని, శని దశ 19 సంవత్సరాలు జీవిత కాలంలో ఉంటుందని, ఆ సమయంలో మనం చేసే ప్రతి కార్యము పుణ్యదాయకమై ఉండాలని, కర్మఫల దాత శనీశ్వరుని అత్యంత పుణ్యకాలమని తెలిపారు. అనంతరం వచ్చిన భక్తులకు స్వామివారి దర్శన భాగ్యం కల్పించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయానికి విచ్చేసిన భక్తులందరికీ అన్నదాన వితరణ చేశారు. శని జయంతి రోజున స్వామివారి పూజలో పాల్గొని భక్తులందరూ స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు

# కుప్పం గంగమ్మ జాతరకు పటిష్ట బందోబస్తు

### జాతర ప్రాంతాలను పరిశీలించిన ఎస్పీ తుషార్ డూడి

ప్రజాభూమి ప్రతినిధి చిత్తూరు



కుప్పంలో ఈ నెల 18 నుండి 20వ తేదీ వరకు అంగరంగ వైభవంగా జరగనున్న గంగమ్మ జాతర ఏర్పాట్లను జిల్లా ఎస్పీ తుషార్ డూడి పరిశీలించారు. ఆలయ అధికారులు, కుప్పం డీఎస్పీ పార్థసారధితో కలిసి గంగమ్మ దేవాలయం, అగ్నిగుండం, బలిపీఠం, ట్రాఫిక్ మళ్లింపు ప్రాంతాలను సందర్శించి భద్రతా ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ తుషార్ డూడి మాట్లాడుతూ ప్రతి సంవత్సరం కుప్పం గంగమ్మ జాతర వైభవంగా జరుగుతుందని, ఈసారి కూడా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా భారీ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అదనపు బలగాలతో పాటు ప్రత్యేక క్రైమ్ బృందాలను నియమించి పిక్‌పాకెటింగ్, ఆకతాయిల వెకిలి చేష్టలను అరికట్టేందుకు నిరంతర నిఘా ఉంచుతామని చెప్పారు. జాతర సమయంలో ట్రాఫిక్ రద్దీని దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక ట్రాఫిక్ మళ్లింపు చర్యలు చేపడుతున్నామని, భక్తులకు మంచినీరు, వైద్య సహాయ కేంద్రాలు, శౌచాలయాలు వంటి మౌలిక సదుపాయాలు స్థానిక అధికారుల సమన్వయంతో ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. పిల్లలు తప్పిపోయిన సందర్భాలు లేదా అత్యవసర పరిస్థితుల్లో సహాయం అందించేందుకు ప్రత్యేక హెల్ప్‌డెస్క్‌లు కూడా ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. జాతర ప్రాంతమంతటా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి ప్రత్యేక కంట్రోల్ రూమ్ ద్వారా పర్యవేక్షణ చేపడతామని, డ్రోన్ కెమెరాలతో గగనతల నిఘా కూడా కొనసాగుతుందని తెలిపారు. అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసు సిబ్బంది 24 గంటలు అప్రమత్తంగా విధులు నిర్వహిస్తారని చెప్పారు. జాతర సమయంలో ఎలాంటి చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడకుండా శాంతి భద్రతలకు సహకరించాలని పట్టణ ప్రజలను ఎస్పీ కోరారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ తరుణ్ పహ్వా, కుప్పం రూరల్ ఇన్స్పెక్టర్ మల్లేష్ యాదవ్, ఎస్బీ ఇన్స్పెక్టర్ మురళీమోహన్, ఆలయ చైర్మన్ రవిచంద్ర, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



# నీట్ పరీక్షల రద్దు పై కాంగ్రెస్ పార్టీ నిరసన

ప్రజాభూమి ప్రతినిధి :శ్రీకాళహస్తి




తిరుపతి జిల్లా డీసీసీ అధ్యక్షులు బాలగురవం బాబు ఆధ్వర్యంలో తిరుపతి ప్రెస్ క్లబ్ నందు ఏర్పాటు చేసినటువంటి మీడియా సమావేశము నకు ముఖ్య అతిథులుగా సి డబ్ల్యూ సి మెంబర్ మాజీ ఎమ్మెల్సీ గిడుగు రుద్రరాజు పాల్గొని నీట్ పరీక్షల రద్దు కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరికి అద్దం పడుతుందని సుమారుగా 22 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకము గా మారిందని దుయ్యబట్టారు. డీసీసీ అధ్యక్షులు బాలగురవం బాబు మాట్లాడుతూ ఇప్పటివరకు 89 సార్లు ప్రశ్నాపత్రాలు లీక్ అయ్యాయని ఇందులో 48 సార్లు ప్రశ్న పత్రాలు తిరిగి ముద్రించి పరీక్షలు నిర్వహించారన్నారు గతంలో కేంద్ర ప్రభుత్వాలు రాష్ట్ర ప్రభుత్వాలు విశ్వవిద్యాలయాలు ద్వారా ఎంతో పకడ్బందీగా పరీక్షలు నిర్వహించే వారిని కానీ ఇప్పుడు వాటికి భిన్నంగా ప్రైవేట్ సంస్థల ద్వారా పరీక్షలు నిర్వహించడం వల్లే ఇదంతా జరిగిందన్నారు. శ్రీకాళహస్తి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త తలపా దామోదరం రెడ్డి మాట్లాడుతూ భావి భారతదేశానికి యువకులే వెన్నెముకని అటువంటి యువకులు నేడు విద్య ద్వారానే ఉన్నత శిఖరాలు అధిరోహించగలరని కానీ నేటి కేంద్ర ప్రభుత్వం విద్య పట్ల ఉన్నటువంటి నిర్లక్ష్య ధోరణి వల్ల వారి భవిష్యత్తు అంధకారమవుతుందని నీట్ పరీక్షల అవకతవకలకు పాల్పడినటువంటి వ్యక్తులను వెంటనే కనుగొని వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పీసీసీ ఉపాధ్యక్షులు మాంగాటి గోపాల్ రెడ్డి, పీసీసీ ప్రధాన కార్యదర్శి తమటం వెంకట నరసింహులు,తిరుపతి నగర అధ్యక్షులు గౌడపేరు చిట్టిబాబు, చంద్రగిరి నియోజకవర్గ సమన్వయకర్త ఐరాల లోకేష్ రెడ్డి, తిరుపతి జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్ రెడ్డి, యార్లపల్లి గోపి, చిత్తూరు శివశంకర్,చీూఖ× జిల్లా అధ్యక్షుడు శివబాలాజీ, మూసినా బేగం, ఆమూరి కృష్ణమూర్తి, భాస్కరరావు, శ్రీకాళహస్తి మండల అధ్యక్షులు సురేంద్ర రెడ్డి, రేణిగుంట మండల అధ్యక్షులు రాహుల్ రాయల్, నరేంద్రబాబు, బాలకృష్ణ అమృతేజ్, డాక్టర్ అనుదీప్ తదితరులు పాల్గొన్నారు.

# గోగినేని భాస్కర్ నాయుడిని పరామర్శించిన -: మాజీ ఎమ్మెల్యే ఎస్సీవి నాయుడు

ప్రజా భూమి ప్రతినిధి: తొట్టంబేడు



తెలుగుదేశం నేత గోగినేని భాస్కర్ నాయుడిని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే ఎస్సీవి నాయుడు. తొట్టంబేడు మండలం తెలుగుదేశం పార్టీ నేత, మాజీ మండలం అధ్యక్షులు గోగినేని భాస్కర్ నాయుడు అనారోగ్యంతో ఆపరేషన్ చేసుకొని ఇంటి దగ్గర విశ్రాంతి తీసుకుంటు న్నారు. గురువారం శ్రీకాళహస్తి మాజీ శాసనసభ్యులు ఎస్సీ వి నాయుడు గోగినేని భాస్కర్ నాయుడు ను పరామర్శించి ఆరోగ్య విషయాలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో అంజూరు సుధాకర్. రాయపనేని వినయ్, గోగినేని రమేష్ నాయుడు తదితరులు పాల్గొన్నారు

# గుడిమల్లం దేవాలయాన్ని దర్శించుకున్న శ్రీకాళహస్తి ఆలయ కార్యనిర్వహణ అధికారి వెంకటేష్

ప్రజా భూమి ప్రతినిధి ఏర్పేడు.



ఈరోజు శ్రీ పరశురామేశ్వర స్వామి దేవస్థానం నందు శ్రీకాళహస్తి దేవస్థానం కార్యనిర్వాహణాధికారి వెంకటేష్ స్వామివారి దర్శనార్థం విచ్చేశారు వారికి ఆలయ చైర్మన్ బత్తల గిరినాయుడు.మరియు కార్యనిర్వహణాధికారి స్వాగత ఏర్పాట్లు చేసి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

# కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్యంతో 23 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తు అగమ్యగోచరం

### నీట్ ప్రశ్నాపత్రాల లీకేజీపై సమగ్ర దర్యాప్తు జరపాలి -సీపీఐ నాయకుడు కత్తి హేమచంద్ర

ప్రజా భూమి ప్రతినిధి బుచ్చినాయుడు కండ్రిగ



కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగానే దేశవ్యాప్తంగా నీట్ పరీక్ష రాసిన 23 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తు, మానసిక పరిస్థితి గందరగోళంగా మారిందని బి.ఎన్. కండ్రిగ మండల సీపీఐ ప్రధాన కార్యదర్శి కత్తి హేమచంద్ర ఆరోపించారు. దేశవ్యాప్తంగా నిర్వహించిన నీట్ పరీక్ష ప్రశ్నాపత్రాలు లీక్ కాకుండా అడ్డుకోవడంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. నీట్ ప్రశ్నాపత్రాల లీకేజీ వెనుక బీజేపీ యువమోర్చా నేతల ప్రమేయం ఉందని ప్రచార మాధ్యమాల ద్వారా తెలుస్తోందని ఆయన ఆరోపించారు. ఇప్పటివరకు దేశంలో 89 సార్లు ప్రశ్నాపత్రాలు లీక్ అయిన ఘటనలు చోటుచేసుకున్నాయని, అందులో 48 సార్లు ప్రశ్నాపత్రాలను తిరిగి ముద్రించి పరీక్షలు నిర్వహించాల్సి వచ్చిందని తెలిపారు. గతంలో రాష్ట్ర ప్రభుత్వాలు, విశ్వవిద్యాలయాల ఆధ్వర్యంలో పరీక్షలు ఎంతో పకడ్బందీగా జరిగేవని, కానీ ప్రైవేట్ ఏజెన్సీలకు బాధ్యతలు అప్పగించడంతో పరిస్థితి దారుణంగా మారిందన్నారు. 140 ప్రశ్నలకు గాను 130 ప్రశ్నలు లీకయ్యాయంటే పరిస్థితి ఎంత తీవ్రంగా ఉందో అర్థమవుతోందన్నారు. నీట్ పరీక్షలు నిర్వహించే ఎన్టీఏ ఎవరి పర్యవేక్షణలో పనిచేస్తుందో ప్రజలకు స్పష్టత లేదని విమర్శించారు. 2024లో నీట్ పరీక్షలను సక్రమంగా నిర్వహించలేకపోయిన అధికారిని తరువాత ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా నియమించారని, దీనివల్ల అక్రమాలకు పాల్పడిన వారికి బీజేపీ ప్రభుత్వం అండగా నిలుస్తోందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయని అన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం నీట్ ప్రశ్నాపత్రాల లీకేజీపై సమగ్ర దర్యాప్తు జరిపి, అసలు దోషులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని కత్తి హేమచంద్ర డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల సీపీఐ ప్రధాన కార్యదర్శి రమణయ్యతో పాటు పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# 20న ఛలో ఏపీఎండిసి సంతకాల సేకరణలో పాల్గొందాం!

**• మంగంపేట బైరెటీస్ ను కాపాడుకుందాం • రైల్వే కోడూరును రక్షించుకుందాం...**

**• బల్క్ టెండర్ విధానాన్ని రద్దు చేయాలి • మరో 20 ఏళ్ల ఏపీఎండిసి పనిచేయాలి**

ప్రజా భూమి ప్రతినిధి రైల్వేకోడూరు



తిరుపతి జిల్లా రైల్వే కోడూరులో గురువారం, ఏపీఎండిసి పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో, చలో ఏపీ ఎమ్ డి సి కరపత్రాలు విడుదల చేసిన సందర్భంగా, కన్వీనర్, కందారపు మురళి మాట్లాడుతూ, మంగంపేట బైరెటీస్ కు కోడూరు నియోజకవర్గ ప్రజలకు అవినాభావ సంబంధం ఉంది. ఇది భావోద్వేగంతో కూడింది. ఇక్కడి రాయి, రప్ప...చెట్టు, చేమతో విడదీయరాని బంధం ఇక్కడ జీవించిన వారిది. వేలాదిమంది ప్రజలకు తామున్న చోటే తెల్ల బంగారం నిల్వలు ఉన్నాయని తెలియదు. భవిష్యత్తులో ఈ రాయి రాష్ట్ర రాజకీయాలను, రాయలసీమను శాసిస్తుందని ఊహించలేదు. తమ ఊరి అభివృద్ధికై..ఈ మట్టితో తమకున్న బంధాన్ని వదిలి.. పరిశ్రమ అభివృద్ధికి ప్రజలు 'నేలను' ఇచ్చారు. నాటి ఆ త్యాగం వృధా అవుతుంటే చూస్తూ ఊరుకోవాలా? ఏడాదికి 1000 కోట్లకు పైగా టర్నోవర్, వేలాది కుటుంబాలు పరిశ్రమను ఆధారం చేసుకుని సాగిస్తున్న జీవనం బుగ్గి పాలు అయిపోతే మౌనం వహించాలా మన కళ్ళెదురుగా కనిపిస్తున్న 60 లక్షల టన్నుల నిల్వలను ప్రభుత్వ నియమ నిబంధనలకు విరుద్ధంగా పౌడర్ బదులు రాయినే విదేశాలకు ఎగుమతి చేసేస్తుంటే నిమ్మక నీరెత్తినట్టు సమాజం ఊరుకోవాలా? మరో 20 ఏళ్ల పాటు నడవాల్సిన పరిశ్రమ రానున్న రెండేళ్లకే ఖాళీ అయిపోతే ఉసూరుమంటూ.. బతికేందుకు ఇక్కడ ప్రజలు వలసలు పోవాలా? ఈ తప్పుడు విధానాన్ని ఆపండి! ప్రజల జీవితాలతో, ఉద్యోగుల ఉపాధితో, నిరుద్యోగుల ఆశలతో, విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడవద్దు.. అక్రమ ఎగుమతులు ఆపండి! అన్న నేరానికి ఇక్కడి కార్మిక నాయకులు పోలీస్ స్టేషన్ల చుట్టూ తిరుగుతూ.. పోలీసు వేధింపులకు గురి కావాలా? ఇది ఏ ఒక్కడి వ్యక్తిగత సమస్యా కాదు! ఓ కుటుంబానికి సంబంధించింది అంతకన్నా కాదు!! రైల్వే కోడూరు నియోజకవర్గానికి..ఇక్కడి ప్రజానీకానికి అన్నం పెట్టే అన్నపూర్ణ మన ఘాావీణజ పై జరుగుతున్న దాడిని ఎదుర్కోవటం. ఈ పని చేయకపోతే భవిష్యత్ తరాలుమనల్ని,నిలదీయవా? ఈపరిస్థితులన్నింటిపై కూలంకషంగా మన నియోజకవర్గంలోని పెద్దలతో చర్చలు జరిగాయి. పరిశ్రమ పరిరక్షణకు పోరాట కమిటీని ఏర్పరచుకున్నాము. ఇది ఏ రాజకీయ పార్టీకో, సంఘానికో అనుబంధమైంది కాదు.. పోరాడే శక్తులన్నింటిని ఒక తాటిపైకి తెచ్చి పరిశ్రమ మనుగడను కాపాడేందుకు చేస్తున్న ప్రయత్నం. ఈ ప్రయత్నంలో రాజకీయాలకు అతీతంగా భాగస్వాములు కావాలి. నియోజవర్గంలోని ప్రజలందరూ.. ఈ పోరాట కమిటీ పిలుపుకు స్పందించి సహకారం అందించాలని కోరుతున్నాము. మన పోరాటానికి జిల్లా వ్యాపిత మద్దతు లభించింది. రాష్ట్రమంతా చర్చనీయాంశం అయింది. పరిశ్రమ పరిరక్షణకు సంతకాల సేకరణ ఉద్యమంలా సాగుతున్నది. ఈ మహోద్యమానికి ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీలు, ఉద్యోగులు, కార్మికులు, మేధావులు ముఖ్యంగా యువత, విద్యార్థులు కదిలి ముందుకు రావాలి. సంతకాల సేకరణలో పాల్గొనాలని కోరుతున్నాము.మన ఏపీఎండిసి – మన భవిష్యత్తు నినాదంతో సమీకృతం అవుదాం. మే 20వ తేదీన వేలాదిమంది సంతకాలతో ఏపీఎండిసి ఉన్నతాధికారికి సంతకాల ప్రతులు అందజేసి, రాష్ట్ర ప్రభుత్వానికి పంపమని కోరుదాము.

**సంతకాల సేకరణలో పాల్గొనండి...**

మే 20న ఛలో ఏపీఎండీసీ కార్యక్రమానికి వేలాదిగా హాజరుకండి అని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో, ఏపీఎండిసీహా బైరైటీస్‌హా అసోసియేషన్, అధ్యక్షులు. మాచినేని,విశ్వేశ్వర నాయుడు, గజ్జల శ్రీనివాసులు రెడ్డి, కస్తూరి రాజయ్య, కౌలూరి రమణారెడ్డి, తల్లెం విష్ణువర్ధన్ రెడ్డి, సిఐటియు, జిల్లా ప్రధాన కార్యదర్శి, టి.సుబ్రమణ్యం, సిఐటియు, రాష్ట్ర కౌన్సిల్, నాయకులు సిహెచ్ చంద్రశేఖర్. ఆర్ వెంకటేష్, దేవ కుమార్ రెడ్డి, పి జాన్ ప్రసాద్,టి. కుమార్, కనుపర్తి కిరణ్ కుమార్. తదితరులు పాల్గొన్నారు.

# దర్శనం టికెట్ల పేరుతో భక్తులకు టోకరా.. నకిలీ టిటిడి ఉద్యోగి అరెస్ట్

ప్రజాభూమి ప్రతినిధి తిరుమల



తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు ఆదేశాల మేరకు, టిటిడి చీఫ్ విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ అధికారి మురళీకృష్ణ పర్యవేక్షణలో అమాయక భక్తులను లక్ష్యంగా చేసుకుని "శ్రీవారి దర్శనం టికెట్లు, వసతి గదులు ఏర్పాటు చేస్తాం" అంటూ మోసాలకు పాల్పడుతున్న వ్యక్తులపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో శ్రీవారి దర్శనం టికెట్లు ఇప్పిస్తానని భక్తులను నమ్మించి డబ్బులు వసూలు చేసి మోసం చేసిన పల్నాడు జిల్లా పెద్దకూరపాడు మండలం లింగంగుంట గ్రామానికి చెందిన బొడపాటి నవీన్ చౌదరి (33)ను తిరుమల టౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. దర్యాప్తులో భాగంగా నిందితుడు సోషల్ మీడియా మరియు ఫోన్ కాల్స్ ద్వారా తనను టిటిడి ఉద్యోగిగా పరిచయం చేసుకుని, ఎంప్లాయిస్ కోటాలో శ్రీవారి ప్రత్యేక దర్శనం టికెట్లు ఇప్పిస్తానని భక్తులను నమ్మించినట్లు తేలింది. హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ తెలుగు ఎలక్ట్రానిక్ మీడియా సంస్థలో పనిచేస్తున్న సూర్యకళ అనే మహిళను నమ్మించి, ఈ ఏడాది మార్చి నెలలో ఆరుగురికి శ్రీవాణి దర్శనం టికెట్లు ఏర్పాటు చేస్తానని చెప్పి పలు దఫాలుగా ఖూ× ద్వారా రూ.47,000 మరియు తిరుమలకు వచ్చిన అనంతరం మరో రూ.18,000 నగదు తీసుకుని మొత్తం రూ.65,000 స్వీకరించి ఎటువంటి దర్శనం టికెట్లు ఏర్పాటు చేయకుండా మోసం చేసినట్లు విచారణలో వెల్లడైంది. బాధితురాలి ఫిర్యాదు మేరకు తిరుమల టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టగా, ప్రత్యేక బృందం పల్నాడు జిల్లాలో నిందితుడిని గుర్తించి అదుపులోకి తీసుకుంది. విచారణలో నిందితుడు తన నేరాన్ని ఒప్పుకున్నాడు. నిందితుడి వద్ద నుంచి రూ.45,000 నగదు, ఒక కంపెనీ వైట్ కలర్ మొబైల్ ఫోన్ మరియు రెండు బ్యాంక్ పాస్‌బుక్కులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మొబైల్ ఫోన్‌లోని లావాదేవీలను పరిశీలించగా బాధితుల నుంచి నగదు బదిలీ అయిన వివరాలు నిర్ధారణ అయ్యాయి. నిందితుడి బ్యాంకు లావాదేవీలను పరిశీలించగా దాదాపు రూ.10 లక్షలకు పైగా లావాదేవీలు జరిగినట్లు గుర్తించారు. నిందితుడిపై 2021 నుంచి 2026 మధ్య గుంటూరు, ప్రకాశం, కృష్ణా జిల్లాల్లో నాలుగు చీటింగ్ కేసులు నమోదై విచారణ ఎదుర్కొంటున్నట్లు పోలీసులు వెల్లడించారు. అనంతరం నిందితుడిని న్యాయస్థానం ముందు హాజరుపరచగా, అతని గత నేర చరిత్రను పరిగణనలోకి తీసుకున్న కోర్టు 15 రోజుల జ్యుడీషియల్ కస్టడీ విధించింది. ఈ సందర్భంగా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు మాట్లాడుతూ భక్తుల అవసరాలను ఆసరాగా చేసుకుని దర్శనం టికెట్లు, వసతి, ప్రత్యేక ప్రవేశం పేరుతో సోషల్ మీడియా లేదా ఫోన్ కాల్స్ ద్వారాడబ్బులు డిమాండ్ చేసే వారిని నమ్మవద్దని, శ్రీవారి దర్శనం వసతి టికెట్లు కేవలంఅధికారిక టిటిడి వెబ్‌సైట్ మరియు అనుమతించబడిన కేంద్రాల ద్వారా మాత్రమే పొందాలని, మోసపూరిత ప్రకటనలు, సందేశాల పట్ల అప్రమత్తంగా ఉండి అనుమానాస్పద వ్యక్తులు లేదా లావాదేవీల గురించి వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.

## రెండు పేద కుటుంబాలకు ఆర్థిక చేయూత



ప్రజాభూమి ప్రతినిధి, వాకాడు

వాకాడు మండలం బాలిరెడ్డిపాళెం గ్రామంలో ఇంటి పెద్దలను కోల్పోయి ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న రెండు కుటుంబాలకు గురువారం శ్రీ పట్టాభిరామాలయంలో శ్రీ సీతారామధార్మిక సేవా సంస్థ వ్యవస్థాపకులు,ప్రోత్సాహకులు,ప్రవాస భారతీయులు రామిరెడ్డి వేంకటరామిరెడ్డి,హైమావతమ్మ,మధు కిరణ్ రెడ్డి ల ఆర్థిక సహకారంతో ఆలయ ధర్మకర్తలు మాజీ సొసైటీ చైర్మన్ కొడవలూరు దామోదర్ రెడ్డి చేతుల మీదుగా ఇరవై అయిదు వేల రూపాయలను అందజేశారు.ఈ సందర్భంగా దామోదరరెడ్డి మాట్లాడుతూ ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న రెండు కుటుంబాలకు విదేశాలలో ఉన్నప్పటికీ ఆర్థిక చేయూతనందించిన దాతలకు,సంస్థ ప్రతినిధులకు అభినందనలు తెలిపారు. సంస్థ ప్రతినిధి దీవి అనంతాచార్యులు మాట్లాడుతూ పుష్పగిరి రాధాకృష్ణమూర్తి అకాల మరణంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న వారి కుటుంబానికి సత్యసాత్విక్ కు పదిహేను వేల రూపాయలు, విస్సా సుబ్రహ్మణ్య శర్మ, నాగరత్నమ్మ దంపతుల మరణంతో ఆర్థికంగా అసౌకర్యంగా ఉన్న వారి కుటుంబానికి రూపేష్ శర్మకు పదివేల రూపాయలు దాతల దాతృత్వంతో అందించడం జరిగిందన్నారు.దాతలకు ధన్యవాదములు తెలిపారు. కార్యక్రమంలో ఆమంచర్ల అశోక్ కుమార్,నాసిన హరీష్,శిరీష,శ్రీరామసేన సభ్యులు హరీష్,శివకుమార్,వంశీ,పవన్,వినయ్, తేజ తదితరులు పాల్గొన్నారు.

## డక్కిలి మండలం కమ్మపల్లిలో తన ప్రభుత్వ పీఏ తండ్రి ఉత్తరక్రియల కార్యక్రమమునకు హాజరైన వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ



ప్రజా భూమి ప్రతినిధి వెంకటగిరి.

వెంకటగిరి శాసనసభ్యులు కురుగొండ్ల రామకృష్ణ. వ్యక్తిగత సహాయకులు ( పి ఏ ) ఎన్. కోటేశ్వరరావు. తండ్రి, కీ.శే. నర్రావుల కృష్ణమ నాయుడు.ఉత్తరక్రియలు (పెద్దకర్మ) గురువారం డక్కిలి మండలం, వెంబులూరు పంచాయతీ పరిధిలోని కమ్మపల్లి గ్రామంలో వారి స్వగృహంలో జరిగాయి. ఈ కార్యక్రమానికి వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ గారు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా కీ.శే. కృష్ణమ నాయుడు. చిత్రపటానికి పూలమాలలు వేసి, ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కోటేశ్వరరావు ని, వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. కృష్ణమ నాయుడు. పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో పలు మండలాల ప్రజాప్రతినిధులు, నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## చిన్నగొట్టిగల్లు అభివృద్ధికి వేగం.. పలు పనులకు నిధులు కేటాయింపు

ప్రజా భూమి ప్రతినిధి చిన్నగొట్టిగల్లు



చిన్నగొట్టిగల్లు మండల అభివృద్ధికి కీలకంగా నిలిచే పలు అభివృద్ధి పనులకు నిధులు కేటాయించిన చిత్తూరు పార్లమెంటు సభ్యుడు దగ్గుమళ్ల వరప్రసాద్ రావును బీజేపీ మండల పార్టీ అధ్యక్షుడు దండు కిషోర్ కుమార్ ఆధ్వర్యంలో కూటమి నాయకులు, కార్యకర్తలు మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మండల అభివృద్ధికి అవసరమైన రహదారులు, మౌలిక వసతులు మరియు ప్రజలకు ఉపయోగపడే పలు కార్యక్రమాలపై చర్చించారు. మండల ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. చిన్నగొట్టిగల్లు మండలాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లడమే తమ లక్ష్యమని, ప్రజల ఆశయాల సాధన కోసం నిరంతరం కృషి చేస్తామని దండు కిషోర్ కుమార్ తెలిపారు.

## 25 ఏళ్లకే అమెరికాలో అటార్నీగా పులివెందుల యువకుడు

**- సాయి శ్రీనివాస్ రెడ్డి విజయంపై కొండూరు చైతన్య కుమార్ హర్షం**



ప్రజాభూమి, వేంపల్లె

పులివెందుల వాసి, టిఎన్ఎస్ఎఫ్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు భూమిరెడ్డి సాయి శ్రీనివాస్ రెడ్డి అమెరికాలోని ఇండియానా రాష్ట్రంలో లైసెన్స్ పొందిన అటార్నీగా ప్రమాణ స్వీకారం చేయడం గర్వకారణమని పులివెందుల నియోజకవర్గ టిడిపి తెలుగు ప్రొఫెషనల్ వింగ్ మాజీ అధ్యక్షుడు, అఖిల భారత రజక సంఘం జిల్లా అధ్యక్షుడు కొండూరు చైతన్య కుమార్ హర్షం వ్యక్తం చేశారు. కేవలం 25 ఏళ్ల వయస్సులోనే మొదటి ప్రయత్నంలో ఈ అరుదైన విజయాన్ని సాధించడం ఆయన ప్రతిభ, పట్టుదల, కృషికి నిదర్శనమని కొనియాడారు. భారత్, అమెరికా దేశాల్లో డ్యూయల్ లైసెన్స్ పొందిన న్యాయవాదిగా నిలవడం విశేషమన్నారు. యువతకు సాయి శ్రీనివాస్ రెడ్డి ఆదర్శంగా నిలుస్తున్నారని, విద్యా, సామాజిక సేవా రంగాల్లో భూమిరెడ్డి కుటుంబం ప్రత్యేక గుర్తింపు పొందిందన్నారు. ఈ సందర్భంగా చైతన్య కుమార్ స్నేహితులతో కలిసి స్వీట్లు పంచుకుని ఆనందం వ్యక్తం చేశారు.

## శివయ్య సేవలో అరోమా సింగ్ ఠాగూర్ ఐపీఎస్ కుటుంబ సభ్యులు



ప్రజా భూమి ప్రతినిధి: శ్రీకాళహస్తి

దక్షిణ కాశీగా పేరుగాంచిన ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ వాయు లింగేశ్వర స్వామివారి దర్శనానికి అరోమా సింగ్ ఠాకూర్, ఐపీఎస్ , ఇన్స్పెక్టర్ జనరల్, సౌత్ సెంట్రల్ రైల్వే, సికింద్రాబాదు వారు కుటుంబ సమేతంగా ఈరోజు శ్రీకాళహస్తీశ్వర స్వామి వారి దర్శనానికి విచ్చేసి యున్నారు. ఆలయ అధికారులు వారిని సాదరంగా ఆహ్వానించి వారికి అంతరాలయ దర్శనం, వేద ఆశీర్వచనం తీర్థప్రసాదాలు అందజేశారు. సదరు కార్యక్రమంలో ఆలయ ప్రోటోకాల్ పిఆర్ ఓ మహేశ్, రాజగోపాల్ నాయుడు, అసిస్టెంట్ సెక్యూరిటీ కమిషనర్, రైల్వేస్, మాబు సుభాని, సీఐ , రైల్వేస్, శ్రీకాళహస్తి, కృష్ణయ్య, ఎస్సై , రైల్వేస్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారానికి బీజేపీ జనతా వారధి కార్యక్రమం

**జిల్లా పార్టీ కార్యాలయంలో మే 15న అర్జీల స్వీకరణ**

ప్రజా భూమి ప్రతినిధి తిరుపతి



ప్రజా సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయాలనే లక్ష్యంతో భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి "జనతా వారధి" కార్యక్రమాన్ని మే 15న నిర్వహించనున్నట్లు బీజేపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు సామంచి శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం ఉదయం 10 గంటలకు తిరుపతి జిల్లా పార్టీ కార్యాలయంలో జరిగే ఈ కార్యక్రమానికి నేషనల్ కౌన్సిల్ సభ్యుడు ఎస్. మునిసుబ్రమణ్యం ముఖ్య అతిథిగా హాజరవుతారని వెల్లడించారు. జిల్లాలోని వివిధ మండలాలు, గ్రామాల నుంచి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలకు సంబంధించిన అర్జీలను స్వీకరించి సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయనున్నట్లు తెలిపారు. తాగునీరు, రహదారులు, విద్యుత్, పెన్షన్లు, రేషన్, భూ సమస్యలు, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, ప్రజలకు అందని సేవలు తదితర అంశాలపై ప్రజలు తమ వినతిపత్రాలను తీసుకురావాలని కోరారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రజలకు అండగా నిలిచి సమస్యల పరిష్కారానికి వంతెనలా పనిచేస్తారని పేర్కొన్నారు. జిల్లాలోని ప్రతి మండలం, గ్రామం నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సామంచి శ్రీనివాస్ పిలుపునిచ్చారు.

## సుందరయ్య వర్ధంతి జయప్రదం చేయండి

**సిపిఎం జిల్లా కార్యదర్శి వనవాసం నాగరాజు**

ప్రజాభూమి ప్రతినిధి సత్యవేడు.



సిపిఎం పార్టీ దక్షిణ భారతదేశ ఉద్యమ నిర్మాత స్వాతంత్ర సమరయోధుడు ఆదర్శప్రాయుడు కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతిని ఈ నెల 19వ తేదీన వాడవాడల ఘనంగా నిర్వహించాలని సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి వందవాస నాగరాజు పిలుపునిచ్చారు గురువారం నాడు సత్యవేడులోని సిపిఎం పార్టీ కార్యాలయంలో ప్రాంతీయ కార్యదర్శి మెలుగు రమేష్ అధ్యక్షతన ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు మాట్లాడుతూ పీడత ప్రజల కోసం అహర్నిశలు పనిచేసిన స్వాతంత్ర సమరయోధుడు, దక్షిణ భారత కమ్యూనిస్టు నిర్మాత కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతిని ఈనెల 19వ తేదీన ఘనంగా నిర్వహించాలని ప్రజలను పిలుపునిచ్చారు. పేద ప్రజలు ఎదుర్కొంటున్న సాధారణ సమస్యలు ఇంటి స్థలాల సమస్య ,ఇళ్ళు నిర్మాణ సమస్య, త్రాగునీటి సమస్య, స్మశానాల సమస్య, గ్రామీణ ఉపాధి హామీ బిల్లుల సమస్యపై ప్రజలు తో కలసి ఆందోళన చేసి ప్రభుత్వాలు పరిష్కరించే వరకు పోరాటాలు నిర్వహించాలని శ్రేణులకు పిలుపునిచ్చారు. ఆనాడు పుచ్చలపల్లి సుందరయ్య తెలంగాణలో దొరలకు వ్యతిరేకంగా సాగించిన సాయుధ పోరాటంలో పది లక్షల ఎకరాలకు పైగా పేద ప్రజలకు పంచారని గుర్తు చేశారు. ఆయన అడుగుజాడల్లో నేటి తరం పయనించి కమ్యూనిస్టు విలువలను, భావాలను ప్రజల్లోకి వ్యాప్తి చేయాలని కోరారు. ప్రస్తుత కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్పొరేట్ కంపెనీలకు ఊడిగం చేస్తూ పేద ప్రజలు కార్మికులు రైతుల సమస్యలను పట్టించుకోవడంలేదని విమర్శించారు . ప్రజలు ఏదో ఒక రోజు తిరుగుబాటు చేస్తారని నాగరాజు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సత్యవేడు ఇన్చార్జి దాసరి జనార్ధన్, పార్టీ సభ్యులు తిరుమలరెడ్డి రాము మన స్వామి, కృష్ణయ్య సుశీలమ్మ ఎల్లయ్య భాస్కర్, అముద ఇతరులు పాల్గొన్నారు.

## మహిషాసురమర్దినిని( గంగమ్మ)

**దర్శించుకున్న నూక తోటి రాజేష్**

ప్రజా భూమి ప్రతినిధి సత్యవేడు.



సత్యవేడు గంగ జాతర నేపథ్యంలో మహి షాసుర మర్దిని స్వరూపంగా పట్టణంలోని గంగ మిట్ట వద్ద కొలువుతీరిన అమ్మ వారిని వైఎస్ఆర్సిపి నియోజకవర్గ ఇన్చార్జ్ నూక తోటి రాజేష్ దర్శించుకున్నారు. గురువారం ఆయన వైఎస్ఆర్సిపి మండల కన్వీనర్ సుశీల్ కుమార్ రెడ్డి, జిల్లా సీనియర్ నాయకులు బిరేంద్ర వర్మ, వైఎస్ఆర్సిపి రాష్ట్ర సంయుక్త కార్యదర్శి నిరంజన్ రెడ్డి, వైస్ ఎంపీపీ సరవన,బెల్ట్ రమేష్, సెంథిల్ కుమార్, సోమశేఖర్, పలని,శ్రీధర్ రెడ్డి , భాను ప్రకాష్ రెడ్డి,ధనపాల్ తదితరులతో కలిసి గంగమ్మను దర్శించుకుని పూజలు చేశారు. సకాలంలో వర్షాలు కురిసి పాడి పంటలతో ప్రజలందరూ సుఖ సంతోషాలతో, అష్టైశ్వర్యాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలన్న ఉద్దేశంతోనే తరతరాలుగా గంగ జాతర నిర్వహిం చుకుంటున్నట్లు ఈ సందర్భంగా వైఎస్ఆర్సిపి ఇన్చార్జ్ నూక తోటి రాజేష్ చెప్పారు.

## గోవులను గోశాలలకు తరలించాలి

**- గ్రామ పంచాయతీ కార్యదర్శికి బీజేపీ నేతల వినతి**

ప్రజాభూమి, వేంపల్లె

స్థానిక పట్టణంలో విచ్చలవిడిగా తిరుగుతున్న గోవులను గోశాలలకు తరలించి ప్రజలకు, ట్రాఫిక్‌కు కలుగుతున్న ఇబ్బందులను నివారించాలని బీజేపీ నాయకులు కోరారు. ఈ మేరకు గురువారం



బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి గాలి హరిప్రసాద్ నేతృత్వంలో బీజేపీ నాయకులు వేంపల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శి ఏమిరెడ్డి నాగభూషణం రెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా గాలి హరిప్రసాద్ మాట్లాడుతూ పట్టణంలో గోవులు చెత్తాచెదారం, ప్లాస్టిక్ వ్యర్థాలు తిని అనారోగ్యానికి గురై మృత్యువాత పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. గోవుల్లో సకల దేవతలు కొలువై ఉంటారని ధర్మశాస్త్రాలు పేర్కొంటున్నాయని, హిందూ సమాజం వాటిని విశ్వాసంతో ఆచరిస్తోందన్నారు. గోవధ మహాపాతకమని, గోవుల అక్రమ రవాణా, గోవధ నిరోధక చట్టాల ప్రకారం గోవులను నిర్లక్ష్యంగా వదిలేయడం, అక్రమంగా తరలించడం నిషేధిత చర్యలని తెలిపారు. పట్టణంలో సంబంధిత నిబంధనలు కచ్చితంగా అమలు అయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. గోవధ వంటి చర్యలకు ఎవరూ పాల్పడకుండా కఠిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి పుష్పలత నాయక్, నాయకులు మునగల చంద్ర, రాము తదితరులు పాల్గొన్నారు.




## రాధా రంగా మిత్రమండలి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గా L.I.C. రాంబాబు నియామకం

ప్రజాభూమి పెడన

కృష్ణాజిల్లాలో ప్రసిద్ధిగాంచిన కొండాలమ్మ తల్లి గుడి ప్రక్కన అమ్మ కన్వెన్షన్ హాల్ నందు రాధా రంగా మిత్రమండలి ఆత్మీయ సమావేశం ఘనంగా నిర్వహించినారు.ఈ కార్యక్రమంలో అందరికీ చిరపరిచితుడు,అందరికీ బాగా తెలిసిన వ్యక్తి కీ రాధా రంగా మిత్రమండలి ఆంధ్ర రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గా K.V.V. రాంబాబు.(LIC. రాంబాబు)..అమ్మ కన్వెన్షన్ యజమాని ను. నియమించిన రాధా రంగా మిత్రమండలి రెండు తెలుగు రాష్ట్రాల అధ్యక్షులు బుల్లెట్ ధర్మారావు నియామక పత్రమును అందజేసినారు. ముందుగా శ్రీ వంగవీటి మోహన రంగా శ్రీకృష్ణదేవరాయల చిత్రపటా లకు పూలమాలలు అలంకరించి నివాళులు అర్పించి నారు. ఈ కార్యక్రమానికి వచ్చిన కొంత మంది పెద్దలు మాట్లాడుతూ L.I.C. రాంబాబు 2009లో బిజెపి పార్టీ తరపున ఎమ్మెల్యేగా పోటీ చేసిన వ్యక్తి మరియు శ్రీ వంగవీటి మోహన రంగా వీరాభిమాని.రాంబాబు శాలివాహన సంఘం. (కుమ్మరి) నాయకుడిగా, బీసీ నాయకుడిగా అందరికీ తెలిసిన వ్యక్తి అని అలాంటి మంచి వ్యక్తిని నియమించిన బుల్లెట్ ధర్మారావుని అందరు అభినందించడం జరిగినది. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ నేను అన్ని కులాలను, మహిళలను కలుపుకొని అందరితోనూ సఖ్యతగా ఉంటూ మండల స్థాయి నుంచి నియోజకవర్గం స్థాయిల వరకు కుల మతాలకు అతీతంగా అందరినీ కలుపుకొని కమిటీలను ఏర్పాటు చేసి అధ్యక్షులు అయిన బుల్లెట్ ధర్మారావు తెలిపి ఆయన ఆమోదంతో జనసేన అధినేత పవన్ కళ్యాణ్ గారికి మద్దతుగా, కూటమి నాయకులను కలుపుకుని కమిటీలు ఏర్పాటు చేసి ఎవరు కష్టాల్లో ఉన్నా కూడా వారికి అండగా నేను ఉంటూ రాధా రంగా మిత్ర మండలి ని బలోపేతం చేయటానికి నా వంతు నేను కృషి చేస్తానని నన్ను నమ్మి ఈ కమిటీలో నాకు స్థానం కల్పించిన బుల్లెట్ ధర్మారావు కి నేను రుణపడి ఉంటాను అని ఆయనకు ఏ మాట రాకుండా నేను నడుచుకుంటానని ఈ కొండాలమ్మ తల్లి గుడి సాక్షిగా తెలియజేస్తున్నాను అని చెప్పినారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా అవనిగడ్డకు చెందిన. యాసం చిట్టిబాబు, గుడివాక శివరావు,LIC. యూనియన్ నాయకులు కిషోర్ , గుడివాడకు చెందిన. వడ్డే గిరి, సాయిన నాని, మారు బోయిన బాబి, మత్తి వెంకటేశ్వరరావు, వల్లభుని శేఖర్, విన్నకోట సుబ్బారావు, బడుగు ఉమా దేవి, కొక్కు ప్రభావతి,వన్నెంరెడ్డి కుమారి, సామినేని మల్లిక,జూపూడి శాంతా కుమారి, ఏల్చూరి సుధారాణి, కూనపరెడ్డి లక్ష్మి,ముంగండ బాల కుమారి, వన్నెంరెడ్డి ప్రసాద్, మాదాసు శ్రీను, పెన్నేరు రమేష్ బాబు, తోట చిన్నారి, అడప బాబి, ఆంజనేయులు, తూము వెంకటరత్నం, వీరభద్ర రావు, వెన్న నాగఫణి రాజ్, బొమ్మిడి శంకర్, బోయిన వెంకటేశ్వరరావు, ముప్పిరిశెట్టి ఉమాశంకర్, చిలంకుర్తి వెంకీ, కొక్కు మహేష్. పెడన కూనపరెడ్డి రంగయ్య నాయుడు, గుడిసేవ విజయ కుమార్.అధిక సంఖ్యలో రంగా గారి అభిమానులు మెగా ఫ్యామిలీ అభిమానులు కూటమి నాయకులు పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం గావించినారు.

## దివ్యాంగుల జాతీయ స్థాయి సిట్టింగ్ వాలీబాల్ పోటీల్లో ఏపీ ఘనత..

**విజేతలను అభినందించిన మంత్రి కందుల దుర్గేష్**

**ఉత్తర్ ప్రదేశ్ లోని మీరట్ లో ఫిబ్రవరి 25 నుండి 28వ తేదీ వరకు జరిగిన దివ్యాంగుల సిట్టింగ్ వాలీబాల్ జాతీయ స్థాయి పోటీల్లో స్వర్ణం సాధించిన పురుషుల జట్టు**



అమరావతి ప్రజాభూమి ప్రతినిధి

ఉత్తర్ ప్రదేశ్ లోని మీరట్ లో ఫిబ్రవరి 25 నుండి 28వ తేదీ వరకు జరిగిన దివ్యాంగుల సిట్టింగ్ వాలీబాల్ జాతీయ స్థాయి పోటీల్లో ఆంధ్రప్రదేశ్ పురుషుల జట్టు అద్భుత ప్రతిభ కనబరిచి స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకుంది. ఈ నేపథ్యంలో పారా వాలీబాల్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ప్రెసిడెంట్ బోడపాటి శివదత్ ఆధ్వర్యంలో సంబంధిత టీం మంత్రి కందుల దుర్గేష్ ను వెలగపూడి సచివాలయం రెండవ బ్లాక్ లోని పేషీలో గురువారం కలిసింది. పారా వాలీబాల్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ( పి వి ఏ పి )వారి ఆధ్వర్యంలో 5 సంవత్సరాల వ్యవధిలో ఆంధ్రప్రదేశ్ నేషనల్ ఛాంపియన్ షిప్ గా నిలిచిందని వారు తెలిపారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ పురుషులు మరియు మహిళల జట్లను మంత్రి కందుల దుర్గేష్ ప్రత్యేకంగా సత్క రించి అభినందించారు. PVAAP ప్రెసిడెంట్ బోడ పాటి శివదత్ ఈ సందర్భంగా మంత్రి కం దుల దుర్గేష్ కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. వైకల్యాన్ని జయించి, క్రీడల్లో రాణిస్తూ రాష్ట్ర కీర్తిని జాతీయ స్థాయిలో ఇనుమడింపజేస్తున్న క్రీడా కారుల కృషి ఎంతో స్ఫూర్తిదాయకమని మంత్రి కొనియాడారు. ఈ కార్యక్రమంలో పారా వాలీబాల్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు బోడపాటి శివదత్, ఇతర అసోసియేషన్ సభ్యులు మరియు క్రీడాకారులు పాల్గొన్నారు. మంత్రి దుర్గేష్ తమను వెన్నుతట్టి ప్రోత్సహించినందుకు శివదత్ కృతజ్ఞతలు తెలియజేశారు.

## వేసవిలో బాటసారులకు దాహార్తి తీర్చండి : ఆర్డీఓ సాంబశివరావు

కృష్ణాజిల్లా/బ్యూరో మచిలీపట్నం



వేసవిలో బాటసారుల దాహార్తిని తీర్చేందుకు నగరపాలక సంస్థలతోపాటు స్వచ్ఛంద సేవా సంస్థలు ముందుకురావడం ముదావహమని బందరు ఆర్డిఓ సాంబశివరావు అన్నారు మానవతా స్వచ్ఛంద సేవ సంస్థ ఆధ్వర్యంలో గురువారం జిల్లా కోర్టు రోడ్ లో వినాయకుడి గుడి వద్ద ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని ఆర్డిఓ ప్రారంభించారు మానవతా స్వచ్ఛంద సేవ సంస్థ ప్రతినిధులు జి కిషోర్, బొమ్మిడి అయ్యప్ప స్వామి,ముదిగొండ శాస్త్రి, ఆదిత్య ల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఈ శిబిర ప్రారంభంలో నాయ కులు పీవీ ఫణి కుమార్, గండికోట అంజిబాబు,ఇంజనీర్ ఆర్ వి ఎస్ మురళీధర్,కోటేశ్వరరా వు, కాగిత సాంబశివరావుతదితరులు ఈ కార్య క్రమంలో పాల్గొని సేవ లందించారు ఈ సం దర్భంగా ఆర్డీవో మాట్లా డుతూ మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ మచిలీపట్నంలో స్వచ్ఛత కార్యక్రమాల్లో పాల్గొనడం అభినందనీయమన్నారు.

## కాలువ పూడిక తీత పనులను పర్యవేక్షించిన గోపు సత్యనారాయణ

మచిలీపట్నం/ప్రజాభూమి రూరల్



మచిలీపట్నం మండలం ఖరీఫ్ పంట సాగు నీరు మరియు త్రాగు నీరు కోసం నందమూరు వద్ద పంట కాలువ పుడుక తీత పనులు తెలుగుదేశం పార్టీ ప్రదాన కార్యదర్శి గోపు సత్యనారాయణ ప్రారం భించి పుడుక తీతలు పనుల్లో స్వయంగా పాల్గొని NREGS వర్కర్స్ కు తగు సూచ నలు తెలియచేసారు. ఆయన మాట్లా డుతూ నందమూరు నుండి తాళ్ళ పాలెం, జింజేరు,కానూరు వరకు సుమారు 7 కిలోమీటర్లు మేర పంట కాలువ పుడుక తీతలు చేసి మన ము ముందస్తు సిద్ధంగా ఉండాలి అని చెప్పియున్నారు మరియు రైతులు సంక్షేమముగా ఉం డాలి అని మన కూటమి ప్రభుత్వం మరింతగా కృషి చేస్తుంది అని తెలియచేసారు. ఈ కార్యక్రమంలో దివి మహేష్, గుమస్తా వెంకటేశ్వరరావు, జొన్నల నాగమల్లేశ్వరావు, సిద్దిరెడ్డి పాండు రాంగరావు, గణపబత్తుల పాము, గణపబత్తుల రాజు, బోలిశెట్టి నాని, బోట్ల రాజేష్, లాస్కార్లు, రైతులు పాల్గొన్నారు.

# ఆంధ్రప్రదేశ్ పర్యాటక శాఖకు అంతర్జాతీయ గౌరవం

**'బెస్ట్ టూరిజం ప్రమోషన్ స్టేట్'గా ఎంపిక**

**మంత్రి కందుల దుర్గేష్‌కు ప్రతిష్ఠాత్మక 'మెట్రో ఎక్స్‌పెడిషన్ – GTM టూరిజం అవార్డు 2026' ఆహ్వానం**



అమరావతి ప్రజాభూమి ప్రతినిధి

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దార్శనికత, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పర్యావరణ స్పృహ, మంత్రి కందుల దుర్గేష్ అంకితభావం.. ఈ ముగ్గురి సమిష్టి కృషి ఏపీ పర్యాటక రంగాన్ని గ్లోబల్ మ్యాప్‌పై సగర్వంగా నిలబెట్టింది. ఈ క్రమంలో ఆంధ్రప్రదేశ్ పర్యాటక రంగం మరో అంతర్జాతీయ స్థాయి మైలురాయిని అధిగమించింది. దక్షిణాదిలోనే అతిపెద్ద ట్రావెల్ అండ్ ట్రేడ్ ఎక్స్‌పో అయిన గ్లోబల్ ట్రావెల్ మార్కెట్ ( జి టి ఎం 2026) వారు ఆంధ్రప్రదేశ్‌ను "బెస్ట్ టూరిజం ప్రమోషన్ స్టేట్" (ఉత్తమ పర్యాటక ప్రచార రాష్ట్రం)గా ఎంపిక చేశారు. ఈ మేరకు ప్రతిష్ఠాత్మకమైన 'మెట్రో ఎక్స్‌పెడిషన్ – GTM టూరిజం అవార్డు 2026' స్వీకరించాల్సిందిగా రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ కు నిర్వా హకులు అధికారిక ఆహ్వానం పంపారు. కేరళలోని తిరువనంతపురం, కోవలంలో ఉన్న 'ది లీలా' హోటల్‌లో జూన్ 4వ తేదీ సాయంత్రం 5 గంటలకు నిర్వహించనున్న వేడుకలో ఈ అవార్డును ప్రదానం చేయనున్నారు. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ గురువారం వెలగపూడి సచివా ల యం బ్లాక్ లోని తన ఛాంబర్ లో పర్యా ట క శాఖ ఉన్నతాధికారులను అభినందించారు. జూన్ 3 నుండి 5 వరకు జరిగే ఈ ఎక్స్‌పోలో ప్రపంచవ్యాప్తంగా ఉన్న టూరిజం బోర్డులు, హాస్పిటాలిటీ బ్రాండ్‌లు మరియు పరిశ్రమల ప్రతినిధులు పాల్గొననున్నారు. ఇటువంటి వేదికపై ఆంధ్రప్రదేశ్‌కు అవార్డు దక్కడం రాష్ట్ర పర్యాటక అభివృద్ధికి నిదర్శనం. మంత్రి కందుల దుర్గేష్ ఆధ్వర్యంలో పర్యాటక శాఖ సాధించిన ఈ విజయ పరంపరపై శాఖాధికారులు మరియు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మంత్రి కందుల దుర్గేష్ కృషికి గుర్తింపు:ఆంధ్రప్రదేశ్ పర్యాటక రంగాన్ని బలోపేతం చేయడంలో, రాష్ట్ర సంస్కృతి, వారసత్వం, పర్యాటక ప్రాంతా లను జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రమోట్ చేయడంలో మంత్రి కందుల దుర్గేష్ కనబరిచిన దార్శనిక నాయకత్వం మరియు అంకితభావానికి ఈ అవార్డు దక్కింది. ప్రత్యేకించి పర్యాటక శాఖ మంత్రిగా కందుల దుర్గేష్ బాధ్యతలు చేపట్టిన నాటి నుండి క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తూ, మౌలిక సదుపాయాల కల్పనలో వేగం పెంచారు. రీజినల్ ఇన్వెస్టర్ల సదస్సులు, రోడ్ షోలు, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఆయన వినిపించిన పర్యాటక వాణికి ఇన్వెస్టర్లు ఫిదా అ య్యారు. ఫలితంగా కేవలం 18 నెలల కాలంలోనే 100కు పైగా సంస్థలతో ఎంవోయూలు కుదుర్చుకోవడం విశేషం. ఈ క్రమంలో రాష్ట్రానికి ఏకంగా రూ. 20,000 కోట్లకు పైగా పెట్టుబడులను ఆకర్షించి అసాధారణ విజయాన్ని నమోదు చేశారు. అదే విధంగా పర్యాటక శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ



అజయ్ జైన్, టూరిజం ఎండీ ఆమ్రపాలి కాట మరియు రాష్ట్ర పర్యాటక శాఖ బృందం చేపట్టిన వినూత్న కార్యక్రమాలు, గమ్యస్థానాల అభివృద్ధి మరియు పర్యాటక రంగానికి మంత్రి కందుల దుర్గేష్ ఇస్తున్న ప్రాధాన్యతను జీటీఎం మేనేజింగ్ ఎడిటర్ సిజి నాయర్ తన ఆహ్వాన పత్రికలో ప్రత్యేకంగా ప్రశంసించారు.ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ...భవిష్యత్ అంతా టూరిజం దే అని విశ్వసించి, పర్యాటక రంగాన్ని 'మిషన్ మోడ్'లో అభివృద్ధి చేయాలన్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు లక్ష్యం, పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్‌షిప్ విధానంలో తెచ్చిన సంస్కరణలు ఈ విజయానికి పునాది వేశాయి. ముఖ్యంగా పర్యాటక రంగానికి పారిశ్రామిక హోదా కల్పించడం, అత్యుత్తమ పర్యాటక పాలసీ 2024-29ని విడుదల చేయడం, హోమ్ స్టే, కారవాన్ టూరిజం, ల్యాండ్ అలాట్ మెంట్, బి అండ్ బీ వంటి అనుబంధ పాలసీలు, టెంట్ సిటీల ఏర్పాటు ఇవన్నీ ఒక చారిత్రక మైలురాయిగా చెప్పవచ్చు. అంతేగాక గతంలో ఎన్నడూ లేని విధంగా కేంద్ర ప్రభుత్వం 8 పర్యాటక ప్రాజెక్టులకు దాదాపు రూ.430 కోట్లు కేటాయించి ఏపీ పర్యాటకాభివృద్ధికి బాటలు వేయడం విశేషం. "కూటమి ప్రభుత్వ హయాంలో ఏపీ పర్యాటకం కేవలం విహార యాత్ర కాదు.. రాష్ట్ర పర్యాటక వైభవాన్ని చాటిచెప్పేలా రూపొందించిన సరికొత్త ఆవిష్కరణలు పరిశీలిస్తే...1053 కి.మీ పొడవైన సుదీర్ఘ సముద్ర తీరాన్ని అంతర్జాతీయ స్థాయి వసతులతో కూడిన బీచ్ రిసార్టులుగా తీర్చిదిద్దడం.. తిరుమల, శ్రీశైలం, విజయవాడ, అరసవల్లి వంటి ప్రముఖ పుణ్యక్షేత్రాలను అనుసంధానిస్తూ భక్తులకు మెరుగైన దర్శనం, వసతి సౌకర్యాలు కల్పించడం.. అరకు లోయ, గండికోట, లంబసింగి, సూర్యలంక బీచ్ వంటి ప్రాంతాల్లో సాహస క్రీడలు, కారవాన్ టూరిజం ప్రవేశపెట్టడం... కొండపల్లి టాయ్ ఫెస్టివల్ వంటి స్థానిక కళలను, లేపాక్షి వంటి చారిత్రక కట్టడాలను ప్రపంచానికి పరిచయం చేయడం.. టెంపుల్ టూరిజంతో పాటు ఎకో, అడ్వెంచర్, హెరిటేజ్, కల్చర్, బీచ్, రివర్, వెల్ నెస్, క్రూయిజ్ తదితర విభిన్న టూరిజం ప్రక్రియలను పరిచయం చేయడం, ప్రత్యేకించి సోషల్ మీడియా మరియు అంతర్జాతీయ ప్లాట్‌ఫామ్స్‌పై ఏపీ పర్యాటక సౌందర్యాన్ని 'బ్రాండ్ ఏపీ'గా ప్రదర్శించి పర్యాటకులను ఆకర్షించడం, ఏడాది పొడవునా పర్యాటక శోభ ఉండేలా విశాఖ, అనకాపల్లి, అరకు ఉత్సవ్, గండికోట ఉత్సవ్, ఫ్లెమింగో ఫెస్టివల్, అమరావతి ఆవకాయ్ ఫెస్టివల్, ఆత్రేయపురం బోట్ ఫెస్టివల్, విజయవాడ, కొండవీడు ఉత్సవ్ తదితర పర్యాటక పండుగలతో విస్తృత ప్రచారం కల్పించడం ఈ అవార్డు వరించడానికి కారణాలయ్యాయని మంత్రి దుర్గేష్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు మంత్రి దుర్గేష్ ఆధ్వర్యంలో పర్యాటక శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అజయ్ జైన్, ఎండీ ఆమ్రపాలి కాట మరియు టూరిజం అధికారుల బృందం సమన్వయంతో డిజిటల్ మార్కెటింగ్ చేపట్టడం వల్ల యాత్రికులు, పర్యాటకుల సంఖ్య గణనీయంగా పెరిగింది. ఈ చర్యల వల్ల రాష్ట్రానికి పెట్టుబడులే కాకుండా, స్థానిక యువతకు పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయి.కేరళలో అందుకోబోయే ఈ అవార్డు ఆంధ్రప్రదేశ్ పర్యాటక వైభవానికి కేవలం ఆరంభం మాత్రమేనని పర్యాటక శాఖ వర్గాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి.

## హాస్టళ్లలో 'నెట్ జీరో' విప్లవం.. జూన్ 10 నాటికి పనులు పూర్తి కావాలి

**సాంఘిక సంక్షేమ శాఖ రాష్ట్ర సంచాలకులు లావణ్య వేణి IAS ఆదేశం**

**కృష్ణా జిల్లాలో క్షేత్రస్థాయిలో నిర్మాణ పనుల పరిశీలన**



మచిలీపట్నం/ప్రజాభూమి ప్రతినిధి:రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ డైరెక్టర్ లావణ్య వేణి (IAS) గురువారం కృష్ణా జిల్లాలో విస్తృతంగా పర్యటించారు. జిల్లాలోని పామర్రు, చల్లపల్లి, మరియు మోపిదేవి ప్రాంతాల్లోని సాంఘిక సంక్షేమ హాస్టళ్లలో జరుగుతున్న నూతన నిర్మాణ మరియు మరమ్మత్తు పనులను ఆమె స్వయంగా పరిశీలించారు. విద్యార్థుల వసతి గదులు, వంటశాలలు మరియు మౌలిక సదుపాయాల నాణ్యతపై అధికారులకు కీలక సూచనలు చేశారు.వార్తలోని ముఖ్యాంశాలు:నాణ్యతే పరమావధి: PMAJAY పథకం కింద పామర్రులో నిర్మిస్తున్న బాలికల హాస్టల్‌ను తనిఖీ చేసిన డైరెక్టర్, గదుల్లో వెలుతురు (Ventilation) ధారాళంగా ఉండాలని సూచించారు. అలమరలు, రీడింగ్ రూమ్స్ ఏర్పాటుతో పాటు కంపోస్ట్ పిట్, సోక్ పిట్ వంటి పర్యావరణ హిత చర్యలు చేపట్టాలని ఆదేశించారు.గడువులోగా పనులు పూర్తి: చల్లపల్లి, మోపిదేవి హాస్టళ్లలో జరుగుతున్న పనులను జూన్ 10వ తేదీ నాటికి నూటికి నూరు శాతం పూర్తి చేయాలని, విద్యా సంవత్సరం ప్రారంభం నాటికి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు.రూ. 7 కోట్ల భారీ నిధులు: జిల్లాలోని హాస్టళ్ల అభివృద్ధికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని, ఇందుకోసం సాధారణ నిధులు రూ. 2.5 కోట్లు, అదనంగా DMF నుండి రూ. 4.5 కోట్లు కేటాయించినట్లు ఆమె వెల్లడించారు.హెల్తీ క్యాంపస్ - నెట్ జీరో: విద్యుత్ ఆదా కోసం సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేసి, అన్ని హాస్టళ్లను 'Net Zero Healthy Campus' లుగా తీర్చిదిద్దుతున్నట్లు తెలిపారు. భద్రత కోసం CCTV కెమెరాలు, తాగునీటి కోసం RO ప్లాంట్లు ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు.విద్యార్థులకు సిద్ధంగా ఉన్న సామాగ్రి: కొత్త విద్యా సంవత్సరం ప్రారం భంలోనే విద్యార్థులకు కావాల్సిన బ్లాంకెట్లు, కార్పెట్లు మరియు ఇతర నిత్యావసర సామాగ్రిని అందజేస్తామని, ఇప్పటికే అన్ని హాస్టళ్లకు వీటిని సరఫరా చేసినట్లు ఆమె పేర్కొన్నారు.ఈ పర్యటనలో జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ (DD) షేక్ షాహిద్ బాబు, సంబంధిత ఇంజనీరింగ్ విభాగం అధికారులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## గోపువానిపాలెంలో భగ్గుమన్న జనసేన-టీడీపీ విభేదాలు

.మచిలీపట్నం/ప్రజాభూమి రూరల్



మచిలీపట్నం మండలం గోపువానిపాలెం గ్రామంలో జనసేన, టీడీపీ కార్యకర్తల మధ్య ఉద్రిక్త పరిస్థి తులు నెలకొన్నాయి. గ్రామంలో అక్రమ మట్టి తవ్వకాలు జరుగుతున్నాయంటూ జనసేన నాయకులు బండి రామకృష్ణ టీడీపీకి చెందిన ట్రాక్టర్లను అడ్డుకోవడంతో వివాదం చెలరేగింది. ట్రాక్టర్లను అడ్డుకోవడంపై ఆగ్రహం వ్యక్తం చేసిన టీడీపీ నాయకులు వాలిశెట్టి విమినేష్ జనసేన నాయకులతో వాగ్వా దానికి దిగారు. ఈ వాగ్వాదం క్రమంగా ఘర్షణకు దారి తీసి ఇరువర్గాల కార్య కర్తలు పరస్పరం తోపులాటకు పాల్పడ్డారు.జనసేన టిడిపి నాయకుల మధ్యన ఘర్షణ వాతావరణం చోటు చేసుకోవడంతో సమాచారం అందుకున్న మచిలీపట్నం రూరల్ పోలీసులు గ్రామానికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. పోలీసుల జోక్యంతో పరిస్థితి సద్దుమణిగింది. అయితే గ్రామంలో కొంతసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది.ఈ ఘటనపై గ్రామ మాజీ సర్పంచ్ వాలిశెట్టి రేఖ స్పందిస్తూ జనసేన నాయకుల తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్రమ మట్టి తవ్వకాల పేరుతో ఉద్దేశపూర్వకంగా గ్రామంలో విద్వేషాలు రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. మండలంలోని ఇతర గ్రామాల్లో జరుగుతున్న మట్టి తవ్వకాలపై స్పందించని జనసేన నాయకులు గోపువానిపాలెం గ్రామాన్ని టార్గెట్ చేయడం అన్యాయమన్నారు.గ్రామస్తులు సొంత అవసరాల కోసం తమ భూమిలోని మట్టిని ఇళ్ల నిర్మాణానికి తరలిస్తుండగా అక్రమ తవ్వకాల పేరుతో అడ్డుకోవడం దురుద్దేశపూర్వక చర్య అని పేర్కొన్నారు. ఖాళీగా ఉన్న ట్రాక్టర్‌ను అడ్డుకొని దౌర్జన్యానికి పాల్పడటమే కాక టీడీపీ కార్యకర్తలపై తప్పుడు కేసులు పెట్టే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు.

దీనిపై జనసేన నాయకులు బండి రామకృష్ణ మాట్లాడుతూ ప్రభుత్వ అనుమతులు లేకుండానే కొంతమంది ట్రాక్టర్ల ద్వారా మట్టిని తరలిస్తూ లక్షల రూపాయలు అక్రమంగా సంపాదిస్తున్నారని ఆయన ఆరోపించారు. ప్రభుత్వ భూములను దోచుకుంటూ ప్రజా సంపదను దుర్వినియోగం చేస్తున్న వారిపై జిల్లా కలెక్టర్ ఎస్పీలకు ఫిర్యాదు చేస్తామన్నారు. అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.అక్రమ మట్టి తవ్వకాలపై సమాచారం అందడంతో జనసేన నాయకులు గ్రామానికి చేరుకుని మట్టి తరలిస్తున్న ట్రాక్టర్లను అడ్డుకున్నట్లు తెలిపారు. ఈ ఘటనతో గోపువానిపాలెం గ్రామంలో రాజకీయ వర్గాల మధ్య విభేదాలు మరోసారి బహిర్గతమయ్యాయి.



## కృష్ణా విశ్వవిద్యాలయం సెమిస్టర్ ఫలితాలు విడుదల చేసిన వైస్ ఛాన్స్లర్

మచిలీపట్నం/కృష్ణాజిల్లా బ్యూరో



కృష్ణ విశ్వవిద్యాలయం వారు ఇటీవల నిర్వహించిన యు జీ 6 , బీ.ఈడీ. స్పెషల్ బి.ఈడి 1, సెమిస్టర్ రీవాల్యుయేషన్ ఫలితాలను కృష్ణా యూనివర్సిటీ ఉప కులపతి కూన రాంజీ గురువారం విడుదల చేశారు. ఈ సందర్భంగా యూనివర్సిటీ వైస్ ఛాన్సర్ రాం జీ పరీక్ష ఫలితాల పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులు భవిష్యత్తులో ఉన్నత లక్ష్యాలతో వివిధ రం గాలలో ఉద్యోగాలలో స్థిరపడాలని ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. సెమిస్టర్ స్పెషల్ సప్లిమెంటరీ పరీక్షల షెడ్యూల్ విడుదల అయిందని వచ్చే నెల 8వ తేదీ లోపు పరీక్ష ఫీజు ఆలస్య రుసుము లేకుండా చెల్లించవచ్చని తెలిపారు. సప్లిమెంటరీ పరీక్షల నోటిఫికేషన్ కృష్ణ యూనివర్సిటీ వెబ్సైట్లో పొందుపరచడం జరిగిందన్నారు.

## వివాదాల సామరస్య పరిష్కారానికి "సమాధాన్ సమారోహ్" ప్రత్యేక లోక్ అదాలత్

**జిల్లా ప్రధాన న్యాయమూర్తి గోపి**

కృష్ణాజిల్లా/బ్యూరో మచిలీపట్నం



దేశవ్యాప్తంగా వివాదాల సామరస్య పరిష్కారానికి నిర్వహిస్తున్న "సమాధాన్ సమారోహ్" ప్రత్యేక లోక్ అదాలత్ కార్యక్రమం ఏప్రిల్ 2026 నుంచి ప్రారంభమై ఆగస్టు 21, 22, 23 తేదీల వరకు కొనసాగనుందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి గోపి తెలిపారు. చివరగా లో ప్రత్యేక లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు తెలిపింది.సుప్రీంకోర్టు ఎదుట పెండింగ్‌లో ఉన్న వివిధ మేటర్స్ ను సామరస్య పూర్వ కంగా పరిష్కరించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యమని పేర్కొన్నారు.న్యాయవాదులు, కక్షిదా రులు చురుకుగా పాల్గొని వివాదాల పరిష్కారానికి సహకరించాలని కోరారు.పార్టీలు భౌతికంగా గానీ, ఆన్లైన్ ద్వారా గానీ హాజరుకావచ్చని తెలిపారు. కేసు వివరాలను గూగుల్ ఫారం ద్వారా పంపవచ్చని, దరఖాస్తుల స్వీకరణకు చివరి తేదీ మే 31, 2026గా నిర్ణయించారు. గూగుల్ ఆన్లైన్ ద్వారా దరఖాస్తులను డౌన్లోడ్ చేసుకోవాలని కోరారు. ఈ గూగుల్ ఫారం సుప్రీం కోర్ట్ ఆఫ్ ఇండియా అధికారిక వెబ్‌సైట్ లో కూడా అందుబాటులో ఉంది.సహాయం కోసం వన్ స్టాప్ సెంటర్ (వార్ రూమ్) సంప్రదింపు నంబర్లు 011-23112428, 011-23112528 అని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు వినియోగించుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షులు, జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. గోపి కోరారు.

## పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

**- కలెక్టర్ డికె బాలాజీ**

మచిలీపట్నం/ప్రజాభూమి ప్రతినిధి:



పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని,వాయు కాలుష్యం నివారణకు విరివిగా మొక్కలు నాటాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ ప్రజలకు పిలుపునిచ్చారుగురువారం ఉదయం జిల్లా కలెక్టర్ మచిలీపట్నం గాంధీనగర్ వాకర్స్ అసోసియేషన్ హాలు లో యోగా తరగతుల్లో పాల్గొన్న అనంతరం అక్కడి చిల్డ్రన్ పార్క్ లో తన తండ్రి కృష్ణయ్య శెట్టి మేనల్లుడు లోహిత్ తో కలసి మొక్కలు నాటారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మొక్కలు వలన స్వచ్ఛమైన ఆక్సిజన్ లభిస్తుందని, కాలుష్యం తగ్గుతుందని, ఆహ్లాదకరమైన వాతావరణం ఏర్పడుతుందని తెలిపారు. మొక్కలు పెంచడం వలన పచ్చదనం పెరిగి, పర్యావరణ పరిరక్షణ జరుగుతుందన్నారు. కాబట్టి సమాజం లో ప్రతి ఒక్కరూ మొక్కలు విరివిగా నాటడంతోపాటు వాటిని సంరక్షించే కార్యక్రమాన్ని విస్తృతంగా చేపట్టాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు .కలెక్టర్ తండ్రి కృష్ణయ్య శెట్టి మాట్లాడుతూ చిల్డ్రన్ పార్క్ లో మొక్కలు పెంచడం వలన పార్క్ కి వచ్చే చిన్నారులకు స్వచ్ఛమైన ఆక్సిజన్ లభిస్తుందని, చిన్నారులకు మంచి ఆరోగ్యం లభిస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ ట్రస్టీ యారా జగన్ మోహన్, యోగా గురువులు గురునాధబాబు , చింతయ్య , వడ్డి శ్రీనివాస్, తోట జ్యోతి ప్రసాద్, పట్నాల సత్యనారాయణ, అశోక్ మాస్టారు, జ్యూవెలరీ పార్క్ అసోసియేషన్ అధ్యక్షుడు అంకెం జితేంద్ర, మామిడిబత్తుల కిషోర్,. సమాచార శాఖ డిప్యూటీ డైరెక్టర్ వెంకటేశ్వర ప్రసాద్, జిల్లా సహకార ఆడిటింగ్ అధికారి పి.రాము, యోగ సభ్యులు ఆర్ డి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు

# పర్యాటక రంగంలో భారత్-అమెరికా బంధం బలోపేతం : మంత్రి కందుల దుర్గేష్

- ఆంధ్రప్రదేశ్‌కు అమెరికా పర్యాటక పెట్టుబడులే లక్ష్యంగా సచివాలయంలో మంత్రి కందుల దుర్గేష్ తో 'యూఎస్-ఇండియా స్ట్రాటెజిక్ పార్టనర్‌షిప్ ఫోరమ్' భేటీ
- రాష్ట్ర పర్యాటక సంస్కరణలపై ప్రశంసలు -- అమెరికా ఇన్వెస్టర్ల దృష్టికి ఏపీ పర్యాటక రంగం విధానాలను తీసుకెళ్తామని వెల్లడి
- ఏపీని గ్లోబల్ టూరిజం హబ్‌గా మార్చే ప్రక్రియలో ఇటువంటి భాగస్వామ్యాలు ఎంతో కీలకమని మంత్రి దుర్గేష్ ప్రకటన
- సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ నేతృత్వంలో విదేశీ పెట్టుబడులకు పూర్తి సహకారం అందిస్తామని హామీ



**ప్రజాభూమి ప్రతినిధి - అమరావతి**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పర్యాటక రంగాన్ని అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోందని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. ఇందులో భాగంగా భారత్ మరియు అమెరికా దేశాల మధ్య పర్యాటక బంధాన్ని బలోపేతం చేసేందుకు కృషి చేస్తున్న యూఎస్-ఇండియా స్ట్రాటెజిక్ పార్టనర్‌షిప్ ఫోరమ్ ప్రతినిధులు గురువారం వెలగపూడి సచివాలయంలో మంత్రి కందుల దుర్గేష్ ని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్‌లో పర్యాటక అభివృద్ధి కోసం మంత్రి కందుల దుర్గేష్ తీసుకువచ్చిన నూతన సంస్కరణలు, పాలసీలను ఈ సందర్భంగా ప్రతినిధి బృందం ప్రశంసించింది. ఈ పురోగతిని అమెరికాలోని ప్రముఖ ఇన్వెస్టర్లకు వివరించి, ఏపీకి పర్యాటక రంగంలో భారీ పెట్టుబడులు వచ్చేలా కృషి చేస్తామని వారు స్పష్టం చేశారు. గత 75 ఏళ్లుగా భారత్-అమెరికా దేశాల మధ్య కొనసాగుతున్న దౌత్య, వాణిజ్య బంధం మరియు సాధించిన విజయాలను వివరిస్తూ రూపొందించిన ప్రత్యేక పుస్తకాన్ని మంత్రి దుర్గేష్ కి బహూకరించారు. ఇరు దేశాల మధ్య పర్యాటక రాకపోకలను పెంచడం, సాంస్కృతిక మార్పిడి మరియు హాస్పిటాలిటీ రంగంలో నూతన సాంకేతికతను అందిపుచ్చుకోవడంపై ఈ సమావేశంలో చర్చించారు. రాష్ట్రంలో పర్యాటక రంగం అభివృద్ధికి ఉన్న అపారమైన అవకాశాలను ప్రతినిధులకు వివరించిన మంత్రి దుర్గేష్ విదేశీ పెట్టుబడులకు సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ల నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తుందని తెలిపారు. ఏపీని గ్లోబల్ టూరిజం హబ్‌గా మార్చే ప్రక్రియలో ఇటువంటి భాగస్వామ్యాలు ఎంతో కీలకమని ఆయన పేర్కొన్నారు. మంత్రి దుర్గేష్ ను కలిసిన వారిలో యూఎస్-ఇండియా స్ట్రాటెజిక్ పార్టనర్‌షిప్ ఫోరమ్ సీనియర్ డైరెక్టర్ ఆస్టిక్ సిన్హా, టూరిజం అండ్ హాస్పిటాలిటీ వింగ్ హెడ్ దివ్ ద్రిష్టి సింగ్ ఉన్నారు.

# బదిలీపై వెళుతున్న సివిల్ జడ్జికి ఘన సత్కారం





**ప్రజాభూమి ప్రతినిధి - రామచంద్రపురం**

రామచంద్రపురం జూనియర్ సివిల్ జడ్జ్ , అడిషనల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ వి నాగేశ్వరరావు నాయక్ బదిలీపై కొవ్వూరు కోర్టుకు వెళ్తున్న సందర్భంగా రామచంద్రపురం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కోటిపల్లి లోవరాజు ఆధ్వర్యంలో బార్ అసోసియేషన్ హాల్లో గురువారం ఘనంగా సత్కరించారు. ఆయన చేసిన సేవలను పలువురు సీనియర్ న్యాయవాదులు పిల్లి మురళీమోహన్ వెంకటర మణ, పలివెల సత్యనారాయణ, అల్లం గనిరాజు, ముసిని సర్వారాయుడు, దొమ్మల పాటి సత్యనారాయణ, ఎస్ బి ఎస్ కే కుమారస్వామి, ఆర్ ఆర్ కె, నేలపాటి వీరభద్రరావు, సూరంపూడి గంగాధరం వెలగల నరేందర్ రెడ్డి బివి ప్రసాద్ లు కొనియాడారు. అధ్యక్షుడు కోటిపల్లి లావరాజు మాట్లాడుతూ జూనియర్ న్యాయవాదులకు ప్రాక్టీస్ లో పలు సూచనలు చేయడం సీనియర్ న్యాయవాదుల ద్వారా వారికి అవకాశాలు కల్పించే విధంగా ప్రోత్సహించడం మర్చిపోలేమన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జ్ ఎమ్.వెంకటేశ్వరరావు, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి శ్రీమతి నిజం శారద, బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి నీలం మధుసూదన్ రావు కార్యవర్గ సభ్యులు, సీనియర్ న్యాయవాదులు జూనియర్ న్యాయవాదులు మహిళా న్యాయవాదులు పాల్గొన్నారు.

# ఈ నెల 15న కుంటముక్కలలో ప్రత్యేక గ్రీవెన్స్ : కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

**ప్రజాభూమి ప్రతినిధి - విజయవాడ**

ప్రభుత్వం ప్రజలకు మరింత చేరువగా పరిపాలన అందించాలనే లక్ష్యంతో గౌరవ ముఖ్యమంత్రి మార్గదర్శకాలకు అనుగుణంగా నియోజకవర్గ స్థాయిలోనూ ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) నిర్వహించడం జరుగుతోందని.. ఈ నెల 15వ తేదీ శుక్రవారం జి.కొండూరు మండలం, కుంటముక్కల గ్రామంలో ప్రత్యేక గ్రీవెన్స్ నిర్వహించనున్నట్లు కలెక్టర్ డా. జి.లక్ష్మీశ తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి కార్యక్రమం జరుగుతుందని, స్థానిక ప్రజలు ఈ కార్య క్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్‌తో పాటు వివిధ శాఖల జిల్లాస్థాయి అధికారులు కూడా పాల్గొంటారని తెలిపారు. ప్రజలకు పారదర్శకమైన, జవాబుదారీతనంతో కూడిన పరిపాలన అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ప్రతి వినతిని పరిశీలించి సాధ్యమైనంత త్వరగాపరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు.

# జిల్లాలో జూన్ నుంచి సర్ ప్రక్రియ ప్రారంభం

- ఇంటింటా జనగణ నమోదు ప్రక్రియను వేగవంతం చేసి మే 20 నాటికి పూర్తి చేయాలి
- క్షేత్రస్థాయి అధికారులతో జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహణ



**ప్రజాభూమి ప్రతినిధి - కాకినాడ**

భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జూన్ నెలలో స్పెషల్ ఇంటెన్సీ రివిజన్ - సర్ ప్రక్రియ ప్రారంభమవుతుందని ఇందుకు క్షేత్రస్థాయి అధికారులు సమయత్తం కావాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ అధికారులను ఆదేశించారు. జిల్లాలో సర్ ప్రక్రియ నిర్వహణ, ఇంటింటా జనగణన నమోదు వంటి అంశాలపై గురువారం కాకినాడ కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ హరేంధిరప్రసాద్.. అధికారులతో కలిసి క్షేత్రస్థాయి అధికారులతో వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. జూన్ నుంచి జిల్లాలో మొదలుకానున్న స్పెషల్ ఇంటెన్సీ రివిజన్ ప్రక్రియకు తీసుకోవాల్సిన చర్యలు, ప్రస్తుతం జిల్లాలో సాగుతున్న ఇంటింటా జనగణ నమోదు పురోగతిని ఆయా మండలాల అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు రానున్న జూన్ నెల నుంచి జిల్లాలో సర్ ప్రక్రియ ప్రారంభం కానుందన్నారు. ఇందుకు క్షేత్రస్థాయి సిబ్బంది పూర్తిస్థాయిలో సన్నద్ధం కావాలని ఆదేశించారు. 2002 ఓటరు జాబితాను ప్రస్తుత ఓటరు జాబితాకు మ్యాపింగ్ చేయడం జరుగుతుందన్నారు. ఈ ప్రక్రియపై ప్రత్యేక దృష్టి పెట్టి జిల్లాలో సజావుగా సాగేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. మే 01 నుంచి జిల్లాలో ప్రారంభమైన ఇంటింటా జనగణన నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. వివరాల నమోదులో ఎటువంటి తప్పులు దొరలకుండా పారదర్శకంగా జనగణ నమోదు చేపట్టాలన్నారు. ఎన్యూమరేటర్లు సేకరిస్తున్న వివరాలను ఎప్పటికప్పుడు సూపర్వైజర్లు, మండల స్థాయి అధికారులు పర్యవేక్షణ చేసి, వివరాలు సక్రమంగా నమోదయ్యేలా చూడాలన్నారు. ఈ ఇంటింటా జనగణన నమోదు ప్రక్రియ మే 20నాటికి పూర్తి అయ్యేలా అధికారులు ప్రత్యేక కృషి చేయాలని జిల్లా కలెక్టర్ క్షేత్రస్థాయి అధికారులకు స్పష్టం చేశారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి డా.టి.తిప్పేనాయక్, జిల్లా సెన్సస్ ఇంచార్జి ఇన్వెస్టిగేటర్ ప్రదీప్, కలెక్టరేట్ సెన్సెస్ సూపరింటెండెంట్ ఎం.జగన్నాథం ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఖనిజాలకు విలువ జోడింపుతో అదనపు ఆదాయం

- పన్ను ఎగవేతలను అరికట్టేందుకు ఏఐ టెక్నాలజీ టూల్స్
- 2026-27 ఏడాదికి రూ.1,27,506 కోట్ల ఆదాయం లక్ష్యం
- ఆదాయార్జన శాఖల సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు దిశానిర్దేశం

**ప్రజాభూమి ప్రతినిధి - అమరావతి**

కేంద్రం నుంచి రావాల్సిన నిధులను రాబట్టే ప్రయత్నాలను ముమ్మరం చేయడంతోపాటు... రాష్ట్రానికి వచ్చే సొంత ఆదాయాలను పెంచుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సూచించారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడానికి పెద్ద ఎత్తున పరిశ్రమలు వస్తున్నాయని... వీటి ద్వారా మరింత ఆదాయం పెంచుకునేలా చర్యలు తీసుకోవాలని సీఎం సూచించారు. గురువారం సచివాలయంలో ఆదాయార్జన శాఖలపై సీఎం చంద్రబాబు నాయుడు సమీక్షించారు. శాఖల వారీగా ప్రభుత్వానికి సమకూరుతోన్న ఆదాయాలపై చర్చించారు. 2026-27 ఆర్థిక సంవత్సరంలో లక్ష్యాలకు అనుగుణంగా పనిచేయాలని వివిధ శాఖల అధికారులకు సీఎం దిశానిర్దేశం చేశారు. రాష్ట్ర సొంత ఆదాయాలు 2024-25 ఆర్థిక సంవత్సరానికి రూ.1,04,345 కోట్లుగా ఉంటే... 2025-26 ఆర్థిక సంవత్సరానికి రూ. 1,10,643 కోట్లుగా నమోదైనట్టు అధికారులు వెల్లడించారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో జీఎస్టీ నుంచి రూ. 33,679 కోట్లు, గనులు శాఖ నుంచి రూ.10,300 కోట్లు, స్టాంపులు- రిజిస్ట్రేషన్ల శాఖ నుంచి రూ.11,047 కోట్ల మేర ఆదాయం వచ్చినట్టు తెలిపారు. 2024-25 ఆర్థిక సంవత్సరంతో పోల్చుకుంటే 2025-26 ఆర్థిక సంవత్సరంలో స్టేట్ ఓన్ రెవెన్యూలో 6 శాతం మేర వృద్ధి నమోదైనట్టు చెప్పారు. 2026-27 ఆర్థిక సంవత్సరానికి రూ. 1,27,506 కోట్ల మేర ఆదాయాన్ని లక్ష్యంగా పెట్టుకున్నామని దానికి అనుగుణంగా పని చేస్తున్నామని అధికారులు సీఎం చంద్రబాబుకు వివరించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ... "గనులు, ఎక్సైజ్, స్టాంపులు రిజిస్ట్రేషన్, వాణిజ్య పన్నులు, రవాణా తదితర శాఖలు లక్ష్యాలకు అనుగుణంగా పని చేయాలి. ప్రభుత్వ ఆదాయంలో ప్రతీ రూపాయి సద్వినియోగం కావాలి. పొరుగు రాష్ట్రాల ఆదాయాలను విశ్లేషించి మన రాష్ట్రంలోనూ సొంత ఆదాయం పెంపునకు కృషి చేయాలి. ప్రతీ ఆదాయార్జన శాఖ పూర్తి సామర్థ్యంతో పని చేయాలి. ఆదాయాన్ని కొల్పోయే పరిస్థితి ఎక్కడా ఉండకూడదు. కేంద్రం నుంచి రావాల్సిన నిధులపై ప్రత్యేకంగా దృష్టి పెట్టాలి. పెట్టుబడులు వస్తున్నప్పుడు టాక్స్ రెవెన్యూ పెరగాలి. స్టాంపులు రిజిస్ట్రేషన్ శాఖలో లావాదేవీలు పెరుగుతున్నాయి. ఆదాయ లక్ష్యాలను చేరుకోవాలి. ఈవీ వాహనాల వినియోగం పెంచేలా చర్యలు చేపట్టాలి. సంప్రదాయ వాహనాల స్థానే ఈవీలను ప్రోత్సహించాలి. రిజిస్ట్రేషన్ శాఖలో ఎక్కడా ప్రజలకు ఇబ్బంది లేకుండా ఆదాయం పెరిగే మార్గాలను అన్వేషించాలి. 22ఏ లాంటి భూ వివాదాలు పరిష్కారం అయితే రిజిస్ట్రేషన్ ఆదాయాలు పెరిగే అవకాశం ఉంటుంది. ప్రస్తుత 2026-27 ఆర్థిక సంవత్సరంలో 42 రోజుల్లో 38 శాతం మేర ఆదాయంలో గ్రోత్ ఉంది. ఇది శుభపరిణామం."అని ముఖ్యమంత్రి అన్నారు.

**గ్రోత్ సెంటర్లుగా జిల్లాలు...**

"పెట్టుబడులన్నీ సాకారమైతే ఆదాయాలు పెరుగుతాయి. కేంద్ర సహకారంతో పాటు సొంత ఆదాయాలను పెంచుకునేలా సామర్థ్యాలను పెంచుకోవాలి. ప్రస్తుత పెట్టుబడులకు అనుగుణంగా జీవీఏ, ఆదాయాలు పెరగాలి. ప్రాజెక్టులు గ్రౌండ్ అవుతున్నాయి. మొత్తంగా 30 శాతం ఆదాయం వృద్ధి నమోదు అయ్యే అవకాశం ఉంది. వ్యవస్థల్లో వినూత్నమైన విధానాలను అమలు చేయటం ద్వారా ఆదాయాలను పెంచుకోవచ్చు. జిల్లా యూనిట్‌గా గ్రోత్ రేట్ లక్ష్యాలను సాధిస్తే రాష్ట్ర వ్యాప్తంగా లక్ష్యాలను సులువుగా సాధించే అవకాశం ఉంటుంది. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానంతో లక్ష్యాలను మనం అంతా కలిసి సాధిద్దాం. పెట్టుబడులకు అనుగుణంగా జీఎస్టీ లక్ష్యాలను ఎలా చేరుకోగలమో విశ్లేషించాలి. లీకేజీలు అరికట్టటంలో ఏఐ టూల్స్ వినియోగించాలి. ఏఐ డ్రివెన్ జీఎస్టీ రిటర్న్ స్క్రూటినీ చేయాలి. పన్ను ఎగవేతలు లేకుండా పన్ను వసూళ్లు చేసేలా టెక్నాలజీ వినియోగించాలి. పన్ను చెల్లింపుదారులకు పూర్తి స్థాయి అవగాహన కల్పించండి. వేధింపులు లేకుండా పన్ను వసూళ్లు జరగాలి. టెక్నాలజీ వినియోగం ద్వారా పన్ను ఎగవేతలు.. నిబంధనల ఉల్లంఘనలను నివారించాలి. ప్రతీ ప్రభుత్వ శాఖ 360 డిగ్రీల్లో అంశాలను విశ్లేషించి ఆదాయ లక్ష్యాలను సాధించాలి. ఎక్సైజ్, గనులు, రవాణా శాఖలు ఏఐ టూల్స్ వినియోగించి ఎగవేతలను అరికట్టాలి. ఆదాయార్జన విషయంలో పూర్తి పారదర్శకంగా ఉండాల్సిందే. పొరుగు రాష్ట్రాల్లో వాహనాలు కొనుగోలు చేసి... ఇక్కడ రిజిస్ట్రేషన్లు చేసుకుంటున్నారు.. ఇక్కడే వాహనాలు కొనుగోలు చేసేలా మోటివేట్ చేయాలి."అని ముఖ్యమంత్రి చెప్పారు.

**అంతర్జాతీయ మార్కెట్‌కు ఎర్రచందనం ఉత్పత్తులు**

"ఎర్ర చందనం అంతర్జాతీయ మార్కెట్లలో విక్రయించేలా వాల్యూ అడిషన్ చేసి ఉత్పత్తులను తయారు చేయండి. ప్రపంచంలోనే అరుదైన వనరు మనకు ఆదాయం తెచ్చిపెట్టాలి. ప్రొఫెషనల్ టాక్స్ ను వసూలు చేసే విషయంలో చట్టసవరణ అంశాన్ని పరిశీలించాలి. ఇక్కడ పనులు చేసుకుంటూ పొరుగు రాష్ట్రాలకు ఆదాయం పోకుండా ఉండేలా చర్యలు చేపట్టాలి. యువతకు ఉపాధి, ఎంఎస్ఎంఈలు, ప్రాడెక్టు పర్ఫెక్షన్ వంటి అంశాలతో జీఎస్డీపీ, జీవీఏ సాధ్యం అవుతాయి. ఎకనమిక్ యాక్టివిటీ, జీవీఏ లక్ష్యాన్ని సాధించేలా ప్రతీ శాఖ సామర్థ్యం పెంచుకోవాలి. ఖనిజాల వాల్యూ అడిషన్ జరిగితే మరింత ఆదాయం సమకూర్చు కోగలుగుతాం. రేర్ ఎర్త్ మినరల్స్ ద్వారా గనుల ఆదాయం బాగా పెరిగేలా చూడాలి. ఏ శాఖలోనూ ఆదాయం తగ్గకుండా చర్యలు తీసుకోవాలి. 24 గంటల్లో వాహనాల రిజిస్ట్రేషన్ జరిగిపోవాలి. పురపాలక శాఖలో పన్నులు స్టాండడైజేషన్, రేషనలైజేషన్ కావాలి. పన్నుల్లో వ్యత్యాసాలను తగ్గిస్తే చెల్లించేందుకు ప్రజలు ముందుకు వస్తారు. జీఐఎస్, డ్రోన్ సర్వేలతో పాటు ఉపగ్రహ చిత్రాలను వినియోగించి అనుమతులు, నిర్మాణాలు, అక్రమ నిర్మాణాలపై ఎప్పటికప్పుడు చర్యలు తీసుకో వాలి. ప్రతీ నెలా మున్సిపాల్టీలు, కార్పోరేషన్ల పరిధిలోని ఆస్తులను గుర్తించి పన్ను అసెస్ మెంట్లను నిర్ధారించాలి. పంచాయితీరాజ్ శాఖలో అన్నీ ఆన్‌లైన్ వసూళ్లు జరుగుతున్నాయి. గ్రామాల్లో ఇంటింటికీ కుళాయి పథకాన్ని కూడా ఇంటిగ్రేట్ చేయండి. ఏపీలోని వివిధ పంచాయితీలకు జాతీయ స్థాయిలో ఉత్తమ అవార్డులు వచ్చాయి. ప్రస్తుతం ఉన్న స్వచ్ఛాంధ్ర నిధులను త్వరితగతిన ఖర్చు చేస్తే..మరిన్ని నిధులు ఇచ్చేందుకు కేంద్రం సిద్ధంగా ఉంది. అర్బన్, రూరల్ స్థానిక సంస్థల్లో నిధులు ఖర్చు చేసి స్వచ్ఛ భారత్ లక్ష్యాలను సాధించాలి." అని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఈ సమీక్షకు సీఎస్ సాయి ప్రసాద్, ఆర్థిక, రవాణా, ఎక్సైజ్, గనులు, స్టాంపులు రిజిస్ట్రేషన్, వాణిజ్య పన్నులు, అటవీ, పురపాలక శాఖల అధికారులు హాజరయ్యారు.

# కౌమార బాలబాలికల సాధికారత దిశగా పయనం

## కలెక్టర్ డా. జి.లక్ష్మీశ



**ప్రజాభూమి ప్రతినిధి - విజయవాడ**

కౌమార దశలోని బాలబాలికల సమగ్ర అభివృద్ధి, భద్రత, ఆత్మవిశ్వాసం, విద్య, ఆరోగ్య అవగాహన తదితరాలపై అవగాహన కల్పించే లక్ష్యంతో కిశోరి వికాసం ప్రత్యేక వేసవి శిబిరాల కార్యక్రమాన్ని జిల్లాలో విస్తృతంగా నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ తెలిపారు. గురువారం కలెక్టర్ లక్ష్మీశ అధ్యక్షతన కలెక్టరేట్ శ్రీ ఏవీఎస్ రెడ్డి హాల్‌లో కిశోరి వికాసంపై వివిధ శాఖల అధికారులతో సమన్వయ సమావేశం జరిగింది. ఈ నెల 1 నుంచి జూన్ 11 వరకు జరిగే కార్యక్రమాలను విజయవంతం చేసేందుకు అనుసరించాల్సిన ప్రణాళికపై కలెక్టర్ అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న కార్యక్రమాల్లో వైద్య ఆరోగ్యం, విద్య, పోలీస్, నైపుణ్యాభివృద్ధి, యువజన సంక్షేమం, పంచాయతీరాజ్ శాఖలు కూడా భాగస్వాములు కావాలని.. కమ్యూనిటీ హాళ్లు, స్వర్ణ గ్రామం, స్వర్ణ వార్డుల్లో మంగళ, శుక్రవారాల్లో ఉదయం, సాయంత్రం కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. జిల్లా మహిళాభివృద్ధి, శిశు సంక్షేమశాఖ నోడల్ అధికారి సాయిగీత, జిల్లా బాలల పరిరక్షణ అధికారి ఎం.రాజేశ్వరరావు, జిల్లా యువజన సంక్షేమ అధికారి డా. కొల్లేటి రమేష్ పాల్గొన్నారు.

# డా. ఎన్‌టీఆర్ వైద్య సేవతో సమగ్ర ఆరోగ్య భద్రత

- అర్హులైన లబ్ధిదారులకు పూర్తిస్థాయి నగదు రహిత వైద్య సేవలు
- ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో అందుబాటులో నాణ్యమైన చికిత్స
- ఇగ్నైట్ సెల్‌ను సందర్శించిన కలెక్టర్ డా. జి.లక్ష్మీశ




**ప్రజాభూమి ప్రతినిధి - విజయవాడ**

డా. ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్ట్ ద్వారా అర్హులైన లబ్ధిదారులకు ఎంప్యానెల్ చేసిన ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో నగదు రహిత నాణ్యమైన వైద్య సేవలు అందుతున్నాయని కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు. గురువారం జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన డా. ఎన్‌టీఆర్ వైద్య సేవ ఇగ్నైట్ సెల్‌ను కలెక్టర్ లక్ష్మీశ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లబ్ధిదారులకు నాణ్యమైన వైద్య సేవలను ఉచితంగా అందించడంతో పాటు, వైద్య ఖర్చుల భారం నుంచి ఆర్థిక భద్రత కల్పించడం జరుగుతోందన్నారు. జిల్లాలో 5,81,282 (బీపీఎల్) ఆరోగ్య కార్డులు ఉన్నాయని.. 2022, ఏప్రిల్ 1 నుంచి ఈ ఏడాది ఏప్రిల్ 30 వరకు 89,168 సర్జరీలు లేదా లథెరపీలు నిర్వహించినట్లు వివరించారు. డా. ఎన్‌టీఆర్ వైద్య సేవకు సంబంధించి 30 ప్రభుత్వ, 66 ప్రైవేటు మొత్తం 96 ఎంప్యానెల్డ్ ఆసుపత్రులు ఉన్నట్లు తెలిపారు. ఈ ఆసుపత్రు ల్లో లబ్ధిదారులు ఆరోగ్య సేవలు పొందడంలో వైద్య మిత్రలు పూర్తి సహాయ సహకారాలు అందిస్తున్నట్లు కలెక్టర్ లక్ష్మీశ వివరించారు. కార్యక్రమంలో డా. ఎన్‌టీఆర్ వైద్య సేవ జిల్లా సమన్వయ అధికారి డా. జె.సుమన్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# జిల్లాలో గృహ నిర్మాణాల వేగవంతానికి కార్యాచరణ ప్రణాళిక

- సెప్టెంబర్ నాటికి జిల్లాలో పీఎంఏవై 1.0 కింద చేపట్టిన గృహాలు పూర్తి చేయాలి
- జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్



**ప్రజాభూమి బ్యూరో - కాకినాడ**

జిల్లాలోని గృహ నిర్మాణాలు వేగవంతం చేసేందుకు అధికారులు కార్యాచరణ ప్రణాళిక ప్రకారం పని చేయాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ అధికారులను ఆదేశించారు. గురువారం కాకినాడ కలెక్టరేట్ లో జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్.. గృహ నిర్మాణ శాఖపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలోని గృహ నిర్మాణాల పురోగతిపై హౌసింగ్ పీడీ ఎన్వీవీ సత్యనారాయణ ఇతర ఇంజనీరింగ్ అధికారులతో జిల్లా కలెక్టర్ చర్చించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో పీఎంఏవై 1.0 కింద చేపట్టిన గృహాలను సెప్టెంబర్ నాటికి పూర్తి చేయాలన్నారు. ఇందుకు కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకొని గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం గృహ నిర్మాణ పనులపై ప్రత్యేక దృష్టి పెట్టినందున జిల్లాలో వివిధ దశలో ఉన్న గృహ నిర్మాణాలను సకాలంలో పూర్తి చేయాలన్నారు. జిల్లాలో ప్రధానమంత్రి ఆవాస్ యోజన 1.0, 2.0; గ్రామీణ్ కింద 62,480 గృహ నిర్మాణాలకుగాను ఇప్పటివరకు 35,451 గృహాలు పూర్తి చేయడం జరిగిందన్నారు. ఇందిలో ఆప్షన్ 3 కింద పెద్దాపురం, కొమరగిరి, సామర్లకోటలో 10169 గృహాలు కేటాయించడం జరిగిందన్నారు. ఇందులో ఇప్పటివరకు 2154 గృహాలు పూర్తయ్యాని మిగిలినవి వివిధ దశలో ఉన్నాయన్నారు. కొమరగిరి లేఔటులో 8,697 ఇళ్లకు గాను 1641 ఇళ్ల నిర్మాణం పూర్తయిందన్నారు. వివిధ దశల్లో ఉన్న ఇళ్ల నిర్మాణ పనులపై ప్రత్యేక దృష్టి పెట్టి వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. గృహ నిర్మాణాల లబ్ధిదారులతో ప్రత్యేకంగా మాట్లాడి వారి అవగాహన కల్పించాలన్నారు. జిల్లాలో గృహ నిర్మాణాలకు అవసరమైన ఇసుక, సిమెంటు ఇతర నిర్మాణ సామాగ్రి అందుబాటులో ఉందన్నారు. వాతావరణం గృహ నిర్మాణాలకు అనుకూలంగా ఉన్నందున అధికారులు గృహ నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి పెట్టి నిర్మాణ పనులు సకాలంలో పూర్తి చేయాలన్నారు. సమావేశంలో డీఆర్డీఏ పీడీ జి. శ్రీనివాసు, హౌసింగ్ మేనేజర్ కే సురేష్, కాకినాడ, పెద్దాపురం ఈఈలు కె.ఎస్.ఎన్.రెడ్డి, ఎల్. శ్రీనివాసు ఇతర డీఈలు నాగభూషణం, వి.శ్రీనివాసు, పి. సువర్ణ రాజు తదితరులు పాల్గొన్నారు.

# లీగల్‌గానే భూములు కొనుగోలు

- ఆ భూముల్లో నిషేధిత జాబితాలో ఉన్న భూమి లేదు
- మాకన్నా ముందు టీడీపీ నాయకుడు సుధీర్ ఆ భూములు కొన్నారు
- ఎల్లో మీడియా అసత్య ప్రచారంపై పరువు నష్టం దావా వేస్తా
- నేను కబ్జా చేస్తే నా పేరు రాయాలి. వైయస్ జగన్ పేరెందుకు రాస్తారా?
- మాజీ ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి ధ్వజం

ప్రజాభూమి ప్రతినిధి – వైయస్సార్ కడప

తాను ఒక్క సెంటు భూమి కబ్జా చేసినట్టు నిరూపించినా రాజకీయాల నుంచి వైదొలగడానికి తాను సిద్ధంగా ఉన్నానని, తాను తప్పు చేస్తే తన పేరు రాయాలి కానీ వైయస్ జగన్ పేరుతో తప్పుడు కథనాలు రాస్తే సహించేది లేదని మీడియాకు మాజీ ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి సవాల్ విసిరారు. వైయస్సార్ కడప జిల్లా పార్టీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ పెద్ద దస్తగిరి హత్యను అడ్డం పెట్టుకుని చంద్రబాబు కూటమి ప్రభుత్వం డైవర్షన్ పాలిటిక్స్ చేస్తోందని, మీడియా కథనాలపై కోర్టులో పరువు నష్టం దావా వేస్తానని హెచ్చరించారు. తయ్యబ్ ముస్లిం వెల్ఫేర్ సొసైటీ పేరుతో ఉన్న భూమిని లక్ష్మీ పద్మావతి కన్‌స్ట్రక్షన్స్ పేరుతో లీగల్‌గానే కొనుగోలు చేశామని, ఆ భూముల్లో ఒక్క సెంటు స్థలం కూడా నిషేధిత భూమి లేదని చెప్పారు. గతంలో ఇదే భూమిని 1989లో టీడీపీ నాయకుడు సుధీర్ కొనుగోలు చేసిన విషయాన్ని కూడా ఆయన గుర్తు చేశారు. ఈ వివరాలన్నీ సొసైటీ మీటింగ్ మినిట్స్ లోనే ఉన్నాయని, కావాలంటే పరిశీలించుకోవచ్చని చెప్పారు. రెండేళ్లలో ఏం చేశామో చెప్పుకోలేక తప్పుడు ప్రచారంతో డైవర్షన్ పాలిటిక్స్ చేయడం ఇకనైనా మానుకోవాలని మాజీ ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డి హితవు పలికారు.

**ఆయన ఇంకా ఏమన్నారంటే...** : వైయస్ జగన్ పేరు తలచకుండా రోజు గడవవు తాము మోసే పార్టీలు బాగుండాలని మిగతా అన్ని పార్టీల మీద బురదజల్లుతూ ఎల్లో మీడియా న్యూస్ రాయకుండా వ్యూస్ రాస్తూ ప్రజలను తప్పుదారి పట్టిస్తోంది. కట్టుకథలతో వ్యక్తిత్వ హననం చేయడానికి ప్రయత్నిస్తున్న ఈ పేపర్లను ప్రజలు పట్టించుకోవడమే మానేశారు. ఈ పేపర్ల పరిస్థితి రానురాను టాయలెట్ పేపర్ల మాదిరిగా తయారైంది. వైయస్ జగన్ గారి పేరు తలచుకోకుండా మీడియాకి రోజు గడవడం లేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లయినా ఇప్పటికీ వైయస్సార్‌సీపీ మీద పడి ఏడవడం తప్ప, ఈ రెండేళ్ల చంద్రబాబు పాలనలో ఏం చేశారో ప్రజలకు చెప్పడం లేదు. డైవర్షన్ పాలిటిక్స్‌లో భాగంగానే పెద్ద దస్తగిరి హత్యను అడ్డం పెట్టుకుని వైయస్సార్‌సీపీ నాయకుల మీద అసత్య ప్రచారం చేస్తున్నారు. టీడీపీ నాయకులు వందల ఎకరాల డీ పట్టాలు ఆక్రమించుకున్నారు. రోజూ వేల టన్నుల మట్టి, ఇసుకని అక్రమంగా తరలించి జేబులు నింపుకుంటున్నారు. కానీ ఇవేవీ మీడియా కళ్లకు కనిపించడం లేదా? ఈ దోపిడీ మీద చర్చ జరగకుండా ఉండేందుకే మా పార్టీ మీద నిత్యం బురదజల్లుతున్నారు.

**ఆ భూమి మొత్తం పట్టా భూమి :** తయ్యబ్ ముస్లిం వెల్ఫేర్ సొసైటీ పేరుతో ఉన్న భూమి పూర్తిగా పట్టా భూమి. అందులో ఒక్క సెంట్ స్థలం కూడా నిషేధిత జాబితాలో లేదు. నిబంధనల ప్రకారమే డబ్బులు చెల్లించి లక్ష్మీ పద్మావతి కన్‌స్ట్రక్షన్స్ పేరుతో ఆ స్థలాన్ని కొనుగోలు చేయడం జరిగింది. ఈ లక్ష్మీ పద్మావతి కన్‌స్ట్రక్షన్స్ కంపెనీలో మా కుటుంబ సభ్యులతోపాటు పెద్ద దస్తగిరి మరో నలుగురు భాగస్వాములుగా ఉన్నారు. 25 ఏళ్లుగా అదే కమిటీ కొనసాగుతోంది. ఈ కమిటీ మీటింగ్ మినిట్స్‌లో ఆ భూములకు సంబంధించి అన్ని వివరాలు ఉన్నాయి. ఇందులో దాచడానికి ఏమీ లేదు. మాకన్నా ముందు గతంలో 1989లో టీడీపీ లీడర్ సుధీర్ ఈ భూములను కొనుగోలు చేశాడు. లీగల్‌గా మార్కెట్ ధరకే ఆ భూములను కొనుగోలు చేయడం జరిగింది. నా మీద భూ కబ్జా ఆరోపణలు చేస్తూ వార్తలు రాస్తున్న పేపర్లు, మీడియా ఛానెళ్లు నేను ఒక్క సెంటు భూమి కబ్జా చేశానని నిరూపించినా రాజకీయాల నుంచి శాశ్వతంగా తప్పుకోవడానికి సిద్ధం. నా మీద తప్పుడు కథనాలు రాసిన పత్రికలు, ఛానెళ్ల మీద పరువు నష్టం దావా వేస్తా. సివిల్, క్రిమినల్ సెక్షన్ల కింద కేసులు పెడతా. నేను తప్పు చేసి ఉంటే నా పేరు రాయాలి. మధ్యలో వైయస్ జగన్ గారి పేరు ఎందుకు రాస్తున్నారు. రామోజీ ఫిలిం సిటీలో వందలాది ఎకరాల రైతుల భూములు కబ్జా చేశారు. వాటి గురించి సమాధానం చెప్పే దమ్ముందా? అని రవీంద్రనాథ్ రెడ్డి సవాల్ విసిరారు.

## మన్యంలో పిడుగుల విషాదం: చిన్నారి బలి



ప్రజాభూమి – రంపచోడవరం

మన్యంలో పిడుగుల రూపంలో మృత్యువు విరుచుకుపడటం అత్యంత బాధాకరమని రాష్ట్ర ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్‌పర్సన్, ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి ఆవేదన వ్యక్తం చేశారు. మారేడుమిల్లి మండలం ఇవ్వంపల్లి గ్రామానికి చెందిన కత్తుల రవి తేజేశ్వర రెడ్డి (8) గురువారం పిడుగుపాటుకు గురై ప్రాణాలు కోల్పో వడంతో ఆ ప్రాంతంలో విషాద ఛాయలు అలముకున్నాయి. చిన్నారి మృతదేహాన్ని రంపచో డవరం ప్రాంతీయ ఆసుపత్రికి తరలించగా, విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే శిరీషాదేవి హుటాహుటీన అక్కడికి చేరుకున్నారు. చిన్నారి మృతి తీరని లోటుఆసుపత్రిలో బాలుడి మృత దేహాన్ని చూసి ఎమ్మెల్యే తీవ్ర భావోద్వేగానికి లోనయ్యారు. ఒకానొక దశలో ఆమె కన్నీరు పెట్టుకుని, మృతుడి కుటుంబ సభ్యులను ఓదార్చారు. "చిన్న వయసులోనే బాబు మరణించ డం ఆ కుటుంబానికి తీరని లోటు. ప్రభుత్వం తరపున బాధితులకు అన్ని విధాలా అండగా ఉంటాం" అని భరోసా ఇచ్చారు. అనంతరం అడ్డతీగల మండలం డి.రామవరంలో ఉపా ధ్యాయుడు సుమర్ల సద్గుణ రావు పిడుగు పాటుతో మృతి చెందడంపై కూడా ఆమె తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. అప్రమత్తత అవస రం ప్రస్తుత వాతావరణ పరిస్థితుల దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే సూచించారు. పిడుగులు పడే సమయంలో తీసు కోవాల్సిన జాగ్రత్తలపై అధికారులు ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని ఆమె ఆదేశించారు. కాగా, ఇదే ప్రమాదంలో స్పృహ కోల్పోయి చికిత్స పొందుతున్న కత్తుల సత్యనారాయణ రెడ్డి (15) పరిస్థితిని ఆమె ఆరా తీశారు. మెరుగైన చికిత్స కోసం రాజమండ్రి ప్రభుత్వ ఆసుపత్రికి రిఫర్ చేయించి, స్వయంగా అంబులెన్స్ ఎక్కించారు. రాజమండ్రి వైద్యులతో ఫోన్లో మాట్లాడి తక్షణ మే వైద్య సేవలు అందించాలని కోరారు. పాల్గొన్న ముఖ్య నేతలుఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ సోళ్ళ బొజ్జిరెడ్డి, రాష్ట్ర దూదేకుల కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ సుభానీ, టీడీపీ మండల అధ్యక్షుడు పెంటపాటి అనంత మోహన్, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు షేక్ చోటు, సిద్ధా వెంకన్న దొర, కడబాల గణపతి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పండగలా అంతర్జాతీయ మ్యూజియం దినోత్సవ కార్యక్రమాలు

- ఈ నెల 18న చారిత్రక వైభవాన్ని చాటిచెప్పేలా ఉత్సవాలు
- విజయవాడ బాపూ మ్యూజియంలో ప్రత్యేక కార్యక్రమాలు
- ప్రతి ఒక్కరూ భాగస్వాములై విజయవంతం చేయండి
- వారసత్వ సంపదకు నెలవైన మ్యూజియాల విశిష్టతను చాటిచెప్పండి
- మీడియా సమావేశంలో కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

ప్రజాభూమి ప్రతినిధి – విజయవాడ

నవ్య రాజధాని అమరావతికి గేట్ వే అయిన విజయవాడ ప్రాంతంలో వినూత్న కార్యక్రమాలు నిర్వహిస్తూ జిల్లా సమగ్రాభివృద్ధికి కృషిచేయడం జరుగుతోందని.. ఇందులో భాగంగా ఈ నెల 18న అంతర్జాతీయ మ్యూజియం దినోత్సవం (International Museum Day) సందర్భంగా పండగలా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ తెలిపారు. పర్యాటక, ఆర్కియాలజీ శాఖలతో పాటు జిల్లా అధికార యంత్రాగం ఆధ్వర్యంలో విజయవాడ ఉత్సవ్ కమిటీ భాగస్వామ్యంతో ఈ కార్యక్రమాలు జరుగుతాయన్నారు. కలెక్టర్ లక్ష్మీశ గురువారం కలెక్టరేట్ శ్రీ ఏవీఎస్ రెడ్డి హాల్‌లో అంతర్జాతీయ మ్యూజియం దినోత్సవ కార్యక్రమాలపై మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వారసత్వ సంపదను సంరక్షిస్తూ సంస్కృతిని సజీవంగా నిలిపే జ్ఞాన నిలయాలే మ్యూజియాలని.. గత వైభవాన్ని నేటి తరానికి, నేటి సంస్కృతిని రేపటి తరానికి అనుసంధానించే వారధులని పేర్కొన్నారు. ఇంతటి విశిష్టత కలిగిన మ్యూజియంల చారిత్రక వారసత్వ ప్రతీకలను భావితరాలకు అందించాలనే ఉద్దేశంతో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మ్యూజియమ్స్ యునైటింగ్ ఏ డివైడెడ్ వరల్డ్ థీమ్‌తో ఈ ఏడాది అంతర్జాతీయ మ్యూజియం దినోత్సవం జరుగుతుందన్నారు. 1887లో పునాది పడిన మన నగరంలోని బాపూ మ్యూజియాన్ని ఈ నెల 18న ఉచితంగా సందర్శించి, కార్యక్రమాల్లో భాగస్వాములు కావొచ్చన్నారు. రాష్ట్రంలో 14 వరకు పురావస్తు మ్యూజియాలు, మ్యూజియం క్షేత్రాలు ఉన్నాయని కలెక్టర్ లక్ష్మీశ వివరించారు.



**బాపూ మ్యూజియంలో రోజంతా ప్రత్యేకం:** ఈ నెల 18న ఉదయం బాపూ మ్యూజియంలో కల్చరల్ ఓపెనింగ్‌తో ప్రారంభమై మ్యూజియమ్స్ ఇన్ ది మోడర్న్ డేపై ప్రత్యేక చర్చలు, గైడెడ్ మ్యూజియం టూర్, విజయవాడ హెరిటేజ్ క్విజ్, దేశభక్తిని పెంపొందించేలా మ్యూజియంల విశిష్టతను చాటిచెప్పేలా లేజర్ షో వంటి కార్యక్రమాలు ఉంటాయన్నారు. హెరిటేజ్ ఫొటోగ్రఫీ హంట్, పెయింటింగ్ పోటీలతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేసినట్లు వివరించారు. వివిధ పోటీల్లో విజేతలకు బహుమతుల ప్రదానంతో పాటు సత్కరించనున్నట్లు తెలిపారు. సాయంత్రం ఇందిరాగాంధీ మునిసిపల్ మైదానంలో జరిగే రూట్స్ రీలోడెడ్ (Roots Reloaded) కార్యక్రమంలో భాగంగా ప్రముఖ గాయని గీతా మాధురి బృందంతో పాటు బ్యాండ్ సెహరీ లైవ్ మ్యూజికల్ కాన్సర్ట్ ఉంటుందని వెల్లడించారు. అనుభవజ్ఞులు, యువత, విద్యార్థులు, వివిధ సంస్థలు, జర్నలిస్టులు.. ఇలా ప్రతిఒక్కరూ కార్యక్రమాల్లో భాగస్వాములై విజయవంతం చేయాలని, గౌరవ ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు కూడా ఈ కార్యక్రమాల్లో పాల్గొంటారని కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. సమావేశంలో జిల్లా పర్యాటక అధికారి ఎ.శిల్ప, ఆర్కియాలజీ డీడీ ఎం.రామసుబ్బారెడ్డి, ఏడీలు వెంకటరావు, నరసింహనాయుడు, ఉత్సవ కమిటీ ప్రతినిధి వీఎం సుధర్మ తదితరులు పాల్గొన్నారు.

## ఏపీసీపీడీసీఎల్ కృష్ణా జిల్లా సర్కిల్ కార్యాలయంలో సీఎండీ పి. పుల్లారెడ్డి సమీక్ష సమావేశం




ప్రజాభూమి ప్రతినిధి – మచిలీపట్నం

ఏపీసీపీడీసీఎల్ కృష్ణా సర్కిల్ కార్యాలయంలో సీఎండీ పి. పుల్లారెడ్డి గురువారం సర్కిల్ స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఫీడర్ లెవెల్ సోలరైజేషన్, ఎస్సీ, ఎస్టీ వినియోగదారులకు సోలార్ రూఫ్ టాప్‌ల ఏర్పాటు, పీఎం సూర్య ఘర్ పథకం అమలు, రెవెన్యూ కలెక్షన్లు, లో వోల్టేజ్ సమస్యల పరిష్కారం తదితర అంశాలపై సమగ్రంగా సమీక్షించారు. ఈ సందర్భంగా సీఎండీ మాట్లాడుతూ వినియోగదారులకు త్వరితగతిన సేవలు అందించాలని, రెవెన్యూ కలెక్షన్లు వంద శాతం సాధించాలని, లో వోల్టేజ్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. అలాగే ఫీడర్లను నిరంతరం పర్యవేక్షిస్తూ బ్రేక్‌డౌన్‌లు లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎస్సీ, ఎస్టీ కాలనీలలో కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో సోలార్ రూఫ్‌టాప్ కార్యక్రమాన్ని వేగవంతంగా అమలు చేస్తున్నామని చెప్పారు. సీపీడీసీఎల్ పరిధిలో లక్ష్యంగా పెట్టుకున్న 1.91 లక్షల కనెక్షన్లకు ప్రతి ఇంటిపై 2 కిలోవాట్ల సోలార్ రూఫ్‌టాప్ వ్యవస్థలను ఆగస్టు నెలాఖరులోపు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. కృష్ణా జిల్లాలో కూడా ఈ కార్యక్రమం ఇప్పటికే ప్రారంభమైందన్నారు. ఈ కార్యక్రమానికి అవసరమైన మెటీరియల్ ఇప్పటికే అందుబాటులోకి వచ్చిందని, మిగిలిన సామగ్రి కూడా త్వరలో చేరుతుందని పేర్కొన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఎస్సీ, ఎస్టీ రూఫ్‌టాప్ కార్యక్రమాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. పీఎం సూర్య ఘర్ పథకం కింద ఇప్పటివరకు సీపీడీసీఎల్ పరిధిలో దాదాపు 40 వేల కనెక్షన్లు ఇచ్చామని, కృష్ణా జిల్లాలోని కొన్ని మండలాల్లో పురోగతి తక్కువగా ఉండటంపై సమీక్ష నిర్వహించి, అన్ని గ్రామాల్లో కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల పెండింగ్ దరఖాస్తులను మూడు నెలల్లోపు పూర్తిచేయాలని అధికారులకు ఆదేశించారు. అవసరమైన పోల్స్, మెటీరియల్ సిద్ధంగా ఉన్నాయని, మిగిలిన సామగ్రి కూడా త్వరలో అందుబాటులోకి వస్తుందని తెలిపారు. ప్రజలకు నాణ్యమైన, అంతరాయం లేని విద్యుత్ సరఫరా అందించడంతో పాటులో వోల్టేజ్ సమస్యలు లేకుండా చూడాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో డైరెక్టర్ టెక్నికల్ మురళీకృష్ణ యాదవ్,డైరెక్టర్ ఫైనాన్స్ వెంకటేశ్వర్లు, ఎస్‌ఈ పి. రవీంద్రబాబు తదితర ఇంజనీరింగ్ అధికారులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## బత్తలపల్లిలో ఆర్డీటీ ఆసుపత్రిని సందర్శించిన మంత్రి లోకేష్

- మంత్రి లోకేష్ చొరవతో ఆర్డీటీకి ఎఫ్ సీఆర్ఏ అనుమతులు మంజూరు
- ఆర్డీటీ సేవలు కొనసాగేలా చూస్తానని యువగళం పాదయాత్రలో హామీ
- ఇచ్చిన మాట నిలబెట్టుకున్న మంత్రి నారా లోకేష్
- మంత్రి హోదాలో తొలిసారి ఆర్డీటీకి వచ్చిన నారా లోకేష్ కు ఘనస్వాగతం
- ఆర్డీటీ వ్యవస్థాపకుడు విన్సెంట్ ఫెర్రర్ సమాధిని సందర్శించి నివాళులు అర్పించిన మంత్రి
- తలసేమియాతో బాధపడుతున్న చిన్నారులకు పరామర్శ

ప్రజాభూమి ప్రతినిధి – బత్తలపల్లి

శ్రీ సత్యసాయి జిల్లా ధర్మవరం నియోజకవర్గం బత్తలపల్లిలోని ఆర్డీటీ(రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్) ఆసుపత్రిని గురువారం విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ సందర్శించారు. అనంతపురం కేంద్రంగా సేవలందిస్తున్న ఆర్డీటీకి 2021లో ఎఫ్ సీఆర్ఏ (ఫారిన్ కంట్రిబ్యూషన్ రెగ్యులేషన్ యాక్ట్) రెన్యువల్‌ను కేంద్ర ప్రభుత్వం నిలిపివేసింది. దీంతో విదేశీ నిధులు ఆగిపోవడంతో సేవా కార్యక్రమాలకు ఆటంకం ఏర్పడింది. ప్రజల జీవితాల్లో భాగమైన ఆర్డీటీ సేవలు నిరంతరాయంగా అందేలా చూస్తానని యువగళం పాదయాత్రలో నారా లోకేష్ హామీ ఇచ్చారు. ప్రజా ప్రభుత్వం రాగానే మంత్రి లోకేష్ ఆర్డీటీపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుని కేంద్రంతో నిరంతరం సంప్రదింపులు జరిపారు. మంత్రి లోకేష్ చొరవతో కేంద్ర ప్రభుత్వం ఆర్డీటీకి ఎఫ్ సీఆర్ఏ అనుమతులు మంజూరు చేసింది. ఇచ్చిన హామీని నిలబెట్టుకుని మంత్రి హోదాలో తొలిసారి ఆర్డీటీకి వచ్చిన నారా లోకేష్ కు ఆర్డీటీ ప్రోగ్రాం డైరెక్టర్ మాంచో ఫెర్రర్, ఆర్డీటీ హాస్పిటల్ హెడ్ ఆఫ్ డిపార్ట్‌మెంట్ డాక్టర్ పి.లలితా దేవి, ఆసుపత్రి సిబ్బంది, స్థానిక స్థానిక ప్రజానీకం ఘనస్వాగతం పలికారు. ముందుగా ఆర్డీటీ వ్యవస్థాపకుడు విన్సెంట్ ఫెర్రర్ సమాధిని సందర్శించిన మంత్రి లోకేష్.. ఆయన సమాధి వద్ద పుష్పగుచ్ఛం ఉంచి ఘనంగా నివాళులు అర్పించారు. మాంచో ఫెర్రర్ మాతృమూర్తి అన్నే ఫెర్రర్, సోదరి యమున, సోదరి భర్త సంజీవ్ తో మంత్రి లోకేష్ ప్రత్యేకంగా మాట్లాడారు. ఆసుపత్రిలో అందిస్తున్న వైద్య సేవలను ఈ సందర్భంగా మాంచో ఫెర్రర్ మంత్రి లోకేష్ కు వివరించారు. అనంతరం ఆసుపత్రిలోని చిన్న పిల్లల వార్డులోకి వెళ్లిన మంత్రి లోకేష్.. అక్కడ తలసేమియాతో బాధపడుతూ చికిత్స పొందుతున్న పలువురు చిన్నారులను పరామర్శించారు. సింధూరా, గురు లోకేష్, పార్థసారథి, చైత్రశ్రీ, విక్రమాదిత్యా రెడ్డితో లోకేష్ సరదాగా సంభాషించారు. బాగా చదవాలని, తల్లిదండ్రులను బాగా చూసుకోవాలంటూ వారిలో ఉత్సాహం నింపారు. చిన్నారుల తల్లిదండ్రులను పలకరించారు. ఆర్డీటీ గురించి ఎలా తెలుసుకున్నారని వారిని ప్రశ్నించారు. చిన్నారులకు అందుతున్న చికిత్స వివరాలను ఈ సందర్భంగా వైద్యులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆసుపత్రి సిబ్బందితో కలిసి ఫోటోలు దిగారు. ఈ కార్యక్రమంలో ఆర్డీటీ ప్రోగ్రాం డైరెక్టర్ మాంచో ఫెర్రర్, ఆర్డీటీ హాస్పిటల్ హెడ్ ఆఫ్ డిపార్ట్ మెంట్ డాక్టర్ పి.లలితా దేవితో పాటు మంత్రులు పయ్యావుల కేశవ్, అనగాని సత్యప్రసాద్, ఎస్.సవిత, ఎమ్మెల్యేలు పల్లె సింధూరారెడ్డి, ఎంఎస్ రాజు, కాలవ శ్రీనివాసులు, బండారు శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

## నా దేశం నా బాధ్యతలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలి

- సీఎం మార్గనిర్దేశం లో పొదుపుచర్యలకు శ్రీకారం
- ప్రజా ప్రతినిధులు, అధికారులు పొదుపు చర్యల్లో ప్రజలకు మోడల్ గా నిలవాలి.
- ప్రజాప్రతినిధులు, అధికారులు ఎనర్జీ పొదుపులో భాగంగా నేటి నుండే చర్యలు
- ఈవీ వాహనల వినియోగం, సోలార్ పవర్ ఎనర్జీపై అవగాహన పెంచుకోవాలి
- అవసరమైన విభాగాల్లో వర్క్ ఫ్రం హోం పై చర్యలపై సమాలోచన
- బంగారం కొనుగోళ్లుపై స్వీయ నియంత్రణ పాటించాలి
- దేశీయ టూరిజంకు పెద్దపీట వేయాలి.
- యుద్ధ పరిస్థితుల ప్రభావం తగ్గేలా ఇప్పటి నుండే చర్యలు తీసుకుందాం..
- విదేశీమారక నిల్వలు తరిగిపోకుండా కాపాడుకుందాం.
- మంత్రి కొలుసు పార్థసారథి

ప్రజాభూమి ప్రతినిధి – అమరావతి

యుద్ధ వాతావరణ నేపథ్యంలో ప్రధాని మోదీ పిలుపులో భాగంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మార్గనిర్దేశంలో ప్రజాప్రతినిధులు, అధికారులు స్వయం పొదుపు చర్యలను పాటించనున్నామని సమాచార, పౌర సంబంధాలు, గృహ నిర్మాణ శాఖామాత్యులు కొలుసు పార్థసారథి తెలిపారు. ఏపీ సచివాలయంలోని ప్రచార విభాగంలో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మంత్రి మాట్లాడుతూ నాదేశం నా బాధ్యతలో భాగంగా ప్రతి ఒక్కరూ పొదుపు చర్యలు పాటించాలని పిలుపునిచ్చారు. క్యాబినేట్ సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పొదుపు చర్యలపై దిశానిర్దశం చేశారన్నారు. ఇందులో భాగంగా ప్రజా ప్రతినిధులు, అధికారులు తమ వాహణ శ్రేణిలో వాహనాల సంఖ్యను స్వచ్ఛందంగా తగ్గించడం, సమావేశాలను ఆన్ లైన్‌లో వర్చువల్ గా నిర్వహించడం, వారానికి ఒక సారి నో వెహికల్ ఫ్రైడే పాటించడం తదితర చర్యలు తీసుకుంటున్నామన్నారు. అలాగే ప్రజలు సైతం స్వచ్ఛందంగా పొదుపు చర్యలు తీసుకోవాలని కోరారు. యుద్ధ వాతావరణ నేపథ్యంలో ఇందన అవసరాల తగ్గింపు, విదేశీ మారక నిల్వల పరిరక్షణ, రైతులు పండించిన వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతులు, అలాగే ఆయిల్, గ్యాస్, యూరియా తదితర దిగుమతుల తగ్గింపు తో నియంత్రణ పాటించడం వల్ల మేలు జరుగుతుందన్నారు. అరటి, ధాన్యం, వ్యవసాయ, ఉద్యానవన పంటల ఎగుమతులపై యుద్ధ ప్రభావం పడే అవకాశాలు ఉన్నాయన్నారు. అందుకనే ప్రజా ప్రతినిధులు, అధికారులు పొదుపు చర్యల్లో ప్రజలకు ఆదర్శంగా నిలవాలని, తాము పొదుపు చర్యలు పాటిస్తూ వారికి ఆదర్శంగా నిలవాలన్నారు. దేశం క్లిష్ట పరిస్థితుల్లో ఉన్న సమయంలో మనందరం ఒక్క మాటపై నిలబడి కష్టాల నుండి బయటపడాలని అన్నారు. రాష్ట్రంలోని ప్రతి శాఖలోనూ గతంలో వాహనాలకు వినియోగించే ఆయిల్ పరిమితిని సాధ్యమైనంత తక్కువ ఉండేలా చూడటం, ప్రభుత్వం నూతన వాహనాలను కొనుగోలు చేయాలంటే ఈవీ వాహనాలనే కొనుగోలు చేయడం వంటి చర్యలతో పాటు ప్రజలను చైతన్య పరిచేలా విస్తృత ప్రచారం నిర్వహించనున్నామన్నారు. ప్రజలు వాకింగ్, సైక్లింగ్ తదితర పర్యావరణ హితమైన చర్యలు పాటించాలని, ప్రజా ప్రతినిధులు, అధికారులు



పర్యటనల సమయంలో దగ్గర దూరాన్ని పాదయాత్రగా చేయాలని సూచించారు. వారానికి ఒక రోజు మంత్రులు, అధికారులు సైకిళ్లపై ఏపీ సచివాలయానికి వస్తే ఖచ్చితంగా అది ప్రజలపై ప్రభావం చూపి వారు సైతం అదే బాట పడతారన్నారు. రాష్ట్రంలోని విద్యా సంస్థల్లో వారానికి రెండు రోజులు నో వెహికల్ డే లుగా పాటించాలని సూచించారు. రాష్ట్రంలో ఈవీ స్టేషన్ ల పెంపు లో భాగంగా ఆయా సంస్థలకు ప్రోత్సాహకాలను అందిస్తామన్నారు. ట్రాఫిక్ లో సైతం ఎక్కువ సేపు వాహనాలు నిలవకుండా పోలీసులు చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే ఆర్టీసీ సంస్థ తీసుకుంటున్న పొదుపు చర్యలపై సమీక్షిస్తామన్నారు. కేంద్రం రాష్ట్రానికి అందించనున్న ఈవీ బస్సులు త్వరగా రాష్ట్రానికి వచ్చేలా చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే పెద్ద పెద్ద విద్యాసంస్థలు, విశ్వవిద్యాలయాలు కూడా పొదుపులో భాగంగా ఆన్ లైన్ క్లాస్ ల నిర్వహణపై సమాలోచన చేయాలన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో అవసరమైన విభాగాల్లో వారానికి రెండు రోజులు వర్క్ ఫ్రం హోమ్ నిర్వహణపై పరిశీలన చేస్తున్నామన్నారు. స్వదేశీ టూరిజం, స్వదేశీ ప్రొడక్ట్స్ పై ప్రజలు అవగాహన పెంచుకోవాలన్నారు. మన దేశంలోనే అద్భుతమైన పర్యాటక ప్రాంతాలు ఉన్నాయని, విదేశీ ప్రయాణాలు తగ్గించుకుని వేసవితో పాటు ఇతర సెలవు రోజుల్లో దేశంలోని ఆయా ప్రాంతాలకు వెళ్లాలని, అలాగే విదేశీ వస్తువుల కొనుగోళ్లను తగ్గించి స్వదేశీ తయారీ ఉత్పత్తులను ఎక్కువగా వాడాలని మంత్రి పార్థసారథి కోరారు. బంగారం కొనుగోళ్లపై నియంత్రణ పాటించాలని, మన దేశంలో వందల టన్నుల్లో బంగారం దిగుమతి చేసుకుంటున్నామని దీంతో విదేశీ మారక నిల్వలు తగ్గిపోతున్నా యని, కావున ప్రజలు స్వచ్ఛందంగా బంగారం కొనుగోళ్లు తగ్గించాలన్నారు. బంగారంపై మోజు తగ్గించుకుని కొద్ది రోజులు ఆగుదాం అని వేచి చూడటం వల్ల మన దేశం బంగారం దిగుమతులు తగ్గిస్తుందని వివరించారు. ఎనర్జీ ఉత్పత్తిలో భాగంగా సూర్యఘర్ పథకంలో భాగంగా ప్రతి ఇంటిపై సోలార్ ప్యానెల్స్ ను బిగించుకోవాలని మంత్రి పార్థసారథి సూచిం చారు. సోలార్ ప్యానెల్స్ బిగింపు కార్యక్రమం ను వేగంగా చేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం జరిగిందన్నారు. పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కోవడానికి ప్రజలందరూ సిద్ధంగా ఉండాలన్నారు. రైతులు కూడా ఎరువుల వాడకం తగ్గించాలని, నానో ఎరువులు, సేంద్రియ ఎరువుల వాడకంపై అవగాహన పెంచుకోవాలన్నారు.